www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మింటిలోకి రేపంటి రూపం!

నిన్నటి తరం అగ్రనటి బి సరోజాదేవి కన్నుమూత

13 ఏళ్ల వయసులోనే చిత్రసీమలోకి..

నాలుగు భాషల్లో 200 చిత్రాల్లో అభినయం

'చిటపట చినుకులు' పాటతో అభిమానుల హృదయాల్లో శాశ్వతంగా స్థానం 10



మంగళవారం | 15-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 107 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, బహుళపక్షం; తిథి: పంచమి రా.10:39 తదుపరి షష్ఠి; నక్షత్రం: శతభిషం ఉ.6:26, పూర్వాభాద్ర తె.5:46; వర్జ్యం: మ.12:39-2:12; దుర్ముహూర్తం: ఉ.8:28-9:19, రా.10:26-11:08; అమృతఘడియలు: రా.9:59-11:32; రాహుకాలం: మ.3:00-4:30; సూర్యోదయం: 5:52; సూర్యాస్తమయం: 6:49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో నిర్వహించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో లబ్దిదారులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

రేషన్‌కార్డు.. పేదల ఆత్మగౌరవ ప్రతీక

- 5.61 లక్షల కుటుంబాలకు కొత్త కార్డులు.. 3.10 కోట్ల మందికి సన్నబియ్యం
- దండగన్న సాగును పండగ చేశాం.. రైతుల ప్రతి ధాన్యపు గింజనూ కొన్నాం
- మహిళలను ఆర్టీసీ బస్సుల యజమానులను చేశాం
- ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లయ్యే నాటికి నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుచేసి తీరుతాం
- ప్రాజెక్టుల నాణ్యతపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధమా?.. 2034 దాకా కాంగ్రెస్‌దే అధికారం
- సూర్యాపేట జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిన రోజు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ/సూర్యాపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రభుత్వం అందించే రేషన్‌కార్డు కేవలం సరుకులు అందించే పత్రం మాత్రమే కాదని, పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆకలి తీర్చే ఆయుధమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కానీ, గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్‌కు ఏనాడూ పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలని, సన్నబియ్యం అందించాలన్న ఆలోచన కూడా రాలేదని ఆరోపించారు. తాము మాత్రం రాష్ట్రంలో 26 లక్షల మందికి రేషన్‌కార్డులు ఇచ్చామని, 5.61 లక్షల కొత్త కార్డులు ఇస్తున్నామని తెలిపారు. 3.10 కోట్ల మందికి రేషన్‌ద్వారా సన్నబియ్యం అందించి వారి కడుపు నింపుతున్నామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో బెల్టుషాపులు తెరిస్తే.. తాము రేషన్ షాపులు తెరుస్తున్నామని చెప్పారు. పేదలు సన్నబియ్యం

మిగతా 13వ పేజీలో...

రేపు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ

- కేంద్ర జలవనరుల మంత్రి పాటిల్ ఆధ్వర్యంలో సమావేశం
- బనకచర్ల సహా ఇరు రాష్ట్రాల ప్రాజెక్టులపై చర్చ
- నేడు ఢిల్లీకి రేవంత్, చంద్రబాబు
- తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాపై ఒత్తిడి తెద్దాం
- అధికారులతో భేటీలో రేవంత్ 13

పార్లమెంటు వేదికగా 'బీసీ' వాణి!

- 21న మళ్లీ ఢిల్లీకి రేవంత్‌రెడ్డి
- 3 రోజుల పాటు అక్కడే మకాం
- ప్రధానితో భేటీ కానున్న సీఎం!
- నేడు గవర్నర్ వద్దకు బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ 13

హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఏకే సింగ్

- త్రిపుర హైకోర్టు నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ
- త్రిపుర సీజేగా జస్టిస్ ఎం.ఎస్.రామచందర్ రావు నియామకం
- తెలంగాణ హైకోర్టు నుంచి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ వినోద్ కుమార్ బదిలీ.. కొలీజియం సిఫారసులకు రాష్ట్రపతి ఆమోదం
- న్యాయకోవిదుల కుటుంబం నుంచి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్
- ఆయన తాత జస్టిస్ బీపీ సిన్హా సుప్రీం 6వ ప్రధాన న్యాయమూర్తి


న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) నియమితులయ్యారు. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ సోమవారం కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. ఆయనతో పాటుగా దేశంలో నలుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేస్తూ, ఐదు హైకోర్టులకు కొత్త సీజేలను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణతో పాటు త్రిపుర, మద్రాస్, రాజస్థాన్ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులు బదిలీపై రానున్నారు. మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, కర్ణాటక, గువాహటి, పట్నా హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులు నియమితులయ్యారు. జస్టిస్ ఏకే సింగ్‌ను తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం మే 26న సిఫారసు చేసింది. దానికి రాష్ట్రపతి ఆమోదం లభించింది.



జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్

అంతకుముందు చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన అలోక్ అరాధే బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయినప్పటి నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జస్టిస్ సుజోయ్‌పాల్‌ను బదిలీ చేసింది. ఆయనను కలకత్తా హైకోర్టు జడ్జిగా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుకు కేంద్రం ఆమోదించింది. హైకోర్టులో నాలుగో సీనియర్ జడ్జిగా ఉన్న జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసింది. గతంలో తెలంగాణ హైకోర్టు నుంచి వివిధ రాష్ట్రాల

మిగతా 10వ పేజీలో...



గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

- హరియాణా గవర్నర్‌గా ముగిసిన బండారు దత్తాత్రేయ పదవీ కాలం.. ఆయన స్థానంలో అసీం ఘోష్
- నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు (74) గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు. హరియాణా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగిసింది. ఆయనకు పొడిగింపు లభించలేదు. ఆయన స్థానంలో పశ్చిమ బెంగాల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ అసీమ్ కుమార్ ఘోష్‌ను నియమించారు. ఈ నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఆమోదముద్ర వేశారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వీరి నియామకాలు అమల్లోకి వస్తాయి. దత్తాత్రేయను తొలుత 2019 సెప్టెంబరు 19న హిమాచల్ ప్రదేశ్

మిగతా 14వ పేజీలో...

ఊరూ.. పేరూ.. మార్చి.. ఏమార్చి..



- బెట్టింగ్ యాప్‌లపై విచారణ కొనసాగుతున్నా ఆగని దందా
- చైనా, సింగపూర్‌పై నిఘా పెరగడంతో.. ఇండోనేషియా బంగ్లాదేశ్, కంబోడియా వంటి దేశాలకు మకాం మార్పు
- బాధితుల్లో తమిళుల తర్వాత తెలుగు రాష్ట్రాలవారే ఎక్కువ
- వాడుతున్న వారిలో 18 నుంచి 25 ఏళ్ల వారే అత్యధికం

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బెట్టింగ్ యాప్స్‌పై పోలీసులు వరుస కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నా.. వాటి మోసాలు మాత్రం ఆగడం లేదు. వేల కొద్దీ బెట్టింగ్ యాప్‌లను పోలీస్‌లు బ్లాక్ చేయడమే కాకుండా.. యాప్స్‌ను ప్రోత్సహించే వారికి నోటీసులు ఇస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు బెట్టింగ్ యాప్స్‌పై విచారణ జరుపుతున్నా.. వాటి కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. పోలీస్‌లు బ్లాక్ చేసిన యాప్స్‌లో కొన్ని అక్షరాలను అటూ ఇటూ మార్చేసి కొత్త పేర్లతో మళ్లీ దందా మొదలుపెడుతున్నారు. ఇటీవలిదాకా చైనా, సింగపూర్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు.. దర్యాప్తు సంస్థల నిఘా పెరగడంతో అప్రమత్తమై కంబోడియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ వంటి దేశాలకు మకాం మార్చి తమ దందాను కొనసాగిస్తున్నాయి. ఈ బెట్టింగ్ యాప్స్ ఉచ్చులో పడ్డవారు.. రూ.వందలు, వేలతో మొదలుపెట్టి.. రూ.లక్షలు, కోట్లల్లో

మిగతా 14వ పేజీలో...



బిహార్‌లో 35.5 లక్షల ఓట్ల తొలగింపు?

- జాబితాలో మృతులు, విదేశీయులు, ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారి ఓట్లు
- కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ

పట్నా, జూలై 14: బిహార్‌లో ఎన్నికల కమిషన్ (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) కారణంగా 35.5 లక్షల మంది పేర్లను తొలగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈసీ ఇచ్చిన గణాంకాల ఆధారంగా పార్టీలు ఈ అంచనాకు వస్తున్నాయి. ఇంతవరకు 6.6 కోట్ల మంది ఓటర్లు పేరు నమోదు పత్రాలను సమర్పించారని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇది మొత్తం ఓటర్లలో 88.18 శాతానికి సమానమని తెలిపింది. ఫారాల సమర్పణకు ఈ నెల 25 వరకు సమయం ఉందని, ఆ తరువాత

మిగతా 2వ పేజీలో...

భావ ప్రకటన.. స్వీయ నియంత్రణ



- సోషల్ మీడియా కంటెంట్‌పై కట్టడి ఉండాలి.. సెన్సార్ పద్ధతి సరికాదు
- అలాంటి పోస్టులకు పౌరులు వారంతట వారే దూరంగా ఉండాలి 2
- కొన్ని జాగ్రత్తలతో భావప్రకటన స్వేచ్ఛ మార్గదర్శకాలిచ్చే అంశం ఆలోచిస్తున్నాం: సుప్రీంకోర్టు

జీవిత భాగస్వామితో సంభాషణల రికార్డుల్ని సాక్ష్యంగా తీసుకోవచ్చు!

- వివాహసంబంధ కేసుల్లో దీనికి ఓకే
- పరస్పర నిఘా అంటేనే.. ఆ భార్యాభర్తల మధ్య బంధం లేదని..
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- పంజాబ్-హరియాణా హైకోర్టు తీర్పు కొట్టివేత 2

నిమిషను రక్షించడానికి.. 'బ్లడ్ మనీ'యే దారి

- సుప్రీంకోర్టుకు 'సేవ్ నిమిష కౌన్సిల్' నివేదన
- ఇందులో ప్రభుత్వం చేయగలిగింది తక్కువే!
- అయినా సాధ్యమైనదంతా చేస్తున్నాం: కేంద్రం
- రేపే యెమెన్‌లో నర్సు నిమిష ప్రియకు ఉరి

1000 కోట్లు

రాజధాని హైదరాబాద్ శివార్లలో భారీ భూ కుంభకోణం

- ఎనికేపల్లి 'గోశాల' భూములకు అక్రమార్కుల ఎసరు.. తప్పుడు పత్రాలతో 99.14 ఎకరాల భూమి అమ్మకానికి!
- అందులోనే గోశాల నిర్మాణానికి సర్కారు సన్నాహాలు.. ఈ భూసేకరణపై ఇప్పటికే కొనసాగుతున్న వివాదం
- ఈ భూముల కొనుగోలుకు రూ.కోటిన్నర అడ్వాన్స్ ఇచ్చి మోసపోయినవారి ఫిర్యాదుతో వెలుగులోకి విషయం
- ఫోర్జరీ పత్రాలపై రెవెన్యూ అధికారుల విచారణ.. పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారినట్లు ప్రాథమికంగా నిర్ధారణ



గత ప్రభుత్వ హయాంలోని కొందరు పెద్దల హస్తం?

రాజధాని హైదరాబాద్ శివార్లలో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోశాల భూములపై స్థానిక రైతులకు, రెవెన్యూ అధికారుల మధ్య ఓ వైపు వివాదం నడుస్తుండగా.. మరోవైపు తప్పుడు పత్రాలతో ఈ భూములను కొల్లగొట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ మొదలు పెట్టిన రెవెన్యూ అధికారులు.. ఈ భూముల వ్యవహారంలో ఇప్పటికే పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. దీని వెనుక గత ప్రభుత్వ హయాంలోని కొందరు పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది. 14

గురుకుల హాస్టల్‌పై నుంచి దూకి విద్యార్థిని మృతి



సంధ్య (ఫైల్)

- పారిపోయే ప్రయత్నంలో ప్రమాదం?
- యాదాద్రి భువనగిరి జిల్లా తూప్రాన్‌పేట బీసీ గురుకులంలో ఘటన
- ఎస్ఎఫ్ఐ, బీజేవైఎం నిరసనలు
- విద్యార్థిని కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లించేందుకు స్కూల్ అధికారుల హామీ

చౌటుప్పల్ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గురుకులంలో ఉండడం ఇష్టం లేని ఓ విద్యార్థిని.. వసతి గృహంపై నుంచి దూకి పారిపోయేందుకు యత్నించి ప్రాణాలు కోల్పోయింది..! ఆదివారం రాత్రి సమయంలో ఆమె దూకడంతో తెల్లవారే వరకు ఎవరూ గమనించలేదు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం విఠలాపురం గ్రామానికి చెందిన ఊరబావి పరుశరాములు జయమ్మ దంపతుల మూడో కుమార్తె సంధ్య (11). గురుకుల ప్రవేశ పరీక్షలో ఎంపికైన ఆమెకు తూప్రాన్‌పేటలోని

మిగతా 12వ పేజీలో...

20 నెలల్లో 93 మంది గురుకుల విద్యార్థుల మృతి 12

పర్యవేక్షిస్తానన్న ముఖ్యమంత్రి హామీలేమయ్యాయి: హరీశ్

భర్త వివాహేతర సంబంధం.. వేధింపులు డెంటిస్ట్ ఆత్మహత్య 3

- హనుమకొండలో ఘటన
- భర్త కూడా వైద్యుడే

గోడ దూకిన జమ్మూకశ్మీర్ సీఎం!


కశ్మీర్ అమరవీరుల కార్యక్రమానికి ఎల్జీ అనుమతి నిరాకరణ.. ఆంక్షల మధ్య శ్మశాన వాటికకు ఒమర్



- ముఖ్యమంత్రిని అడ్డుకున్న పోలీసులు
- గోడెక్కి లోపలికి వెళ్లి.. నివాళులు

శ్రీనగర్, జూలై 14: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 1931 జూలై 13న జరిగిన ఘటనలో చనిపోయిన అమరవీరులకు నివాళులర్పించే విషయంలో వివాదం రేగింది. కేంద్రం, లెఫ్టినెంట్ గవర్నర్ వర్సెస్ జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా అనేలా పరిస్థితులు తలెత్తాయి. గవర్నర్ మనోజ్ సిన్హా ఆదేశాల మేరకు నౌహట్టాలోని 'మజర్ ఏ శుహదా' శ్మశానవాటికలోని సమాధుల వద్దకు నేతలు ఎవరూ వెళ్లకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. అమరవీరుల దినం నిర్వహించకుండా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నేతలను ఆదివారం హౌస్ అరెస్టు చేశారు. ఒమర్ అబ్దుల్లాను ఇంటి నుంచి బయటకు రాకుండా చేశారు. శ్మశానం గేటుకు కూడా తాళాలు వేశారు. అయితే సోమవారం ఎట్టకేలకు ఆంక్షలను ధిక్కరించి, ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చిన సీఎం.. శ్మశానవాటిక వద్దకు వెళ్లారు. అక్కడ భద్రతా సిబ్బంది ఆయన్ను అడ్డుకోవడంతో.. క్యాబినెట్ మంత్రులతో సహా గోడ దూకి లోపలికి వెళ్లారు. అమరవీరుల సమాధుల వద్ద నివాళులర్పించారు. ఈ వీడియోను ఒమర్ అబ్దుల్లా 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "1931 జూలై 13 నాటి ఘటన అమరవీరులకు నివాళులు అర్పించాం. 'ఎన్నిక కాని ప్రభుత్వం' నన్ను అడ్డుకొనేందుకు ప్రయత్నించి, నౌహట్టా చౌక్ నుంచి నడిచి వెళ్లేలా చేసింది. గేటును బ్లాక్ చేయడంతో గోడ దూకాల్సి వచ్చింది. నన్ను అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. కానీ నన్ను ఈ రోజు ఆపలేకపోయారు' అని పేర్కొన్నారు. కేంద్రం తీరుపై మండిపడ్డారు. 'నేనేమీ చట్టవిరుద్ధంగానో, అక్రమంగానో వ్యవహరించలేదు. చట్ట పరిరక్షకులమని చెప్పుకుంటున్న వారు నన్ను ఏ చట్టం ప్రకారం అడ్డుకున్నారో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. కశ్మీర్ చరిత్రలో 1931 జూలై 13న జరిగిన ఘటనను కీలకంగా చెబుతుంటారు. ఆ రోజున మహారాజా హరిసింగ్‌కు వ్యతిరేకంగా శ్రీనగర్ జైలు బయట ఆందోళన చేస్తున్న అబ్దుల్ ఖాదిర్ మద్దతుదారులపై డోగ్రా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో 22 మంది చనిపోయారు. నాటి ఘటనను స్మరించుకుంటూ ఏటా జూలై 13న తేదీన అమరవీరుల దినోత్సవం జరుపుతున్నారు.

లోకం తీరు



'డ్రాగన్' అన్‌డాకింగ్ విజయవంతం

- 18 రోజుల తర్వాత నేడు భూమిపైకి శుభాన్షు శుక్లా

న్యూఢిల్లీ, జూలై 14: యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శాభాన్షు శుక్లా.. 18 రోజుల తర్వాత భూమికి తిరుగు ప్రయాణమయ్యారు. శాభాన్షుతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు మంగళవారం భూమిపైకి చేరుకోనున్నారు. ఐఎస్ఎస్ నుంచి నలుగురు వ్యోమగాముల బృందాన్ని తీసుకొస్తున్న డ్రాగన్ వ్యోమనౌక.. అన్‌డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. అక్కడి నుంచి దాదాపు 22 గంటల ప్రయాణం అనంతరం ఈ వ్యోమనౌక మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సముద్ర జలాల్లో దిగనుంది. సోమవారం మధ్యాహ్నం 2:37 గంటలకు కమాండర్ పెగ్గీ విట్సన్, మిషన్ పైలట్ శాభాన్షు శుక్లా, మిషన్ స్పెషలిస్టులు స్లావోజ్ ఉజ్నాన్‌స్కీ-విస్నియెస్కీ, టిబోర్ కాపు.. ఐఎస్ఎస్ నుంచి 'డ్రాగన్'లోకి ప్రవేశించారు. కాగా, ఐఎస్ఎస్‌లో ఉన్న నాసా బృందం ఆదివారమే వీరికి వీడ్కోలు వేడుక నిర్వహించింది. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శాభాన్షు బృందం గత నెల 25న స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్‌లో అంతరిక్షంలోకి బయల్దేరింది. 28 గంటల ప్రయాణం అనంతరం ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించింది. ఈ బృందం అక్కడే 18 రోజులుండి పలు ప్రయోగాలు చేసింది.

వీసా వచ్చినా అమెరికాలో గ్యారెంటీ ఏమీ లేదు

- రూల్స్ ఉల్లంఘిస్తే వెనక్కి పంపే ముప్పు.. ఎంబసీ స్పష్టం

న్యూఢిల్లీ, జూలై 14: అమెరికా వీసాలు పొందిన వారికి, దరఖాస్తుదారులకు ఇక్కడి ఆ దేశ రాయబార కార్యాలయం కఠిన సూచనలు చేసింది. వీసా వస్తే అంతా ముగిసినట్టు కాదని, అనంతరం కూడా నిరంతర తనిఖీలు ఉంటాయని స్పష్టం చేసింది. వీసాపై అమెరికా వెళ్లిన వారిని అక్కడి అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుంటారని తెలిపింది. అమెరికా చట్టాలు, వీసా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారా, లేదా అన్నదాన్ని గమనిస్తుంటారని, ఒకవేళ ఉల్లంఘించినట్టు తేలితే వెంటనే తప్పి పంపించివేస్తారని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. వీసా లభించినంత మాత్రాన అమెరికాలో శాశ్వత ప్రవేశానికి, శాశ్వత నివాసానికి గ్యారెంటీ లభించినట్టు కాదని విద్యార్థులు, ఉద్యోగార్థులకు స్పష్టం చేసింది. దరఖాస్తుల్లో తప్పుడు వివరాలు పేర్కొన్నా, తగిన అనుమతులు లేకుండా ఉద్యోగాలు చేసినా వీసాలు రద్దు చేసి, తిప్పి పంపిస్తారని వివరించింది. డీఎస్-160 వీసా దరఖాస్తులో గత అయిదేళ్లలో ఉపయోగించిన అన్ని సామాజిక మాధ్యమాల యూజర్‌నేమ్‌లను రాయాల్సి ఉంటుందని తెలిపింది. ఎఫ్, ఎం, జె నాన్‌ఇమ్మిగ్రెంట్ వీసా కోసం దరఖాస్తు చేసిన వారు తమ సామాజిక మాధ్యమాల అకౌంట్ల ప్రైవసీ సెట్టింగ్‌లను పబ్లిక్‌కు మార్చాలని సూచించింది. వాటిని పరిశీలించిన తరువాత వారిని దేశంలోకి రానీయవచ్చా, లేదా అని అమెరికాలోని అధికారులు నిర్ణయం తీసుకుంటారు.

50 రోజుల్లోగా యుద్ధం ఆపకపోతే టారిఫ్ శిక్ష

- రష్యాకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, జూలై 14: ఉక్రెయిన్‌పై దాడులు కొనసాగిస్తున్నందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 50రోజుల్లోగా యుద్ధం ఆపకపోతే రష్యాపై టారిఫ్‌లు విధించి శిక్షిస్తానన్నారు. "పుతిన్ విషయంలో నేను చాలా నిరాశచెందాను. అతను మాటమీద నిలబడే వ్యక్తి అనుకున్నాను. అందంగా మాట్లాడతాడు కానీ రాత్రి వేళల్లో ప్రజలపై బాంబులు వేస్తాడు. అది మాకు నచ్చడం లేదు" అని చెప్పారు. ఇటీవల ఉక్రెయిన్‌పై రష్యా దాడుల నేపథ్యంలో ట్రంప్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక ఉక్రెయిన్‌కు పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థను పంపుతున్నట్లు ట్రంప్ నిర్ధారించారు. అది ఉక్రెయిన్‌కు చాలా అవసరం అయినందువల్ల పంపుతున్నట్లు ఆయన చెప్పారు. అయితే ఎన్ని పంపించాలనేదానిపై నిర్ణయం తీసుకోలేదని, ఉక్రెయిన్ రక్షణకు వాటి అవసరం ఉంది కాబట్టి కొన్ని పంపుతున్నామని వెల్లడించారు. తాము పంపే వాటికి ఉక్రెయిన్ వంద శాతం డబ్బు చెల్లిస్తుందని, అది తమ వ్యాపారమని అన్నారు.

10లక్షల భారతీయ కార్మికులకు రష్యా ఉపాధి

మాస్కో, జూలై 14: నైపుణ్యం ఉన్న కార్మికుల కొరతతో ఇబ్బంది పడుతోన్న రష్యా ఈ ఏడాది ఆఖరు కల్లా పది లక్షల మంది భారతీయ కార్మికులకు ఉపాధి కల్పించనుంది. భారీ పరిశ్రమలు, మిలిటరీ కాంప్లెక్స్ ఉన్న యురల్ పర్వతాలకు సమీపంలోని యాకటెరిన్‌బర్గ్‌లో వీరికి ఉపాధి కల్పిస్తారు. ఇందు కోసం ప్రత్యేకంగా కాన్సులేట్ జనరల్ కూడా ప్రారంభించనున్నారు. పారిశ్రామిక సంస్థల ఉత్పత్తిని పెంచాల్సి ఉందని యురల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు ఆండ్రీ బెసెడిన్ తెలిపారు. ఇందుకోసం భారత్‌తో పాటు శ్రీలంక, ఉత్తర కొరియాల నుంచి నైపుణ్యం ఉన్న కార్మికులను తీసుకుంటామని చెప్పారు. 2030 నాటికి రష్యాలో 3.1మిలియన్ల కార్మికుల కొరత ఏర్పడుతుందని అంచనా.

అన్నాడీఎంకేలో చేరేందుకు సిద్ధం: పన్నీర్ సెల్వం

చెన్నై, జూలై 14(ఆంధ్రజ్యోతి): జయలలిత మరణానంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా అన్నాడీఎంకేపై తిరుగుబాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ఓ మెట్టు దిగొచ్చారు. తనకెలాంటి పదవులు వద్దని, ఎలాంటి షరతుల్లేకుండానే అన్నాడీఎంకేలో చేరేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే, పన్నీర్‌సెల్వం, జయ నెచ్చెలి శశికళను పార్టీలో చేర్చుకునేందుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ససేమిరా అంటున్న విషయం తెలిసిందే. దీనికితోడు బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఆయన.. ఎన్‌డీఏ నేతృత్వంలో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు.

ఒడిశాలో ప్రొఫెసర్ లైంగిక వేధింపులు.. ఒంటికి నిప్పంటించుకున్న విద్యార్థిని

న్యూఢిల్లీ, జూలై 14: ఒడిసాలో ఘోరం జరిగింది. కాలేజీలో తనపై ప్రొఫెసర్ పాల్పడుతున్న లైంగిక వేధింపులను భరించలేక.. యాజమాన్యానికి, ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినా ఏమాత్రం స్పందించడం లేదన్న మనోవేదనతో 22 ఏళ్ల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. కాలేజీ కారిడార్‌లోనే ఒంటికి నిప్పంటించుకుంది. 95శాతం మేర గాయాలతో భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఆమెను మంటల్లోంచి కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినికి 70శాతం మేర గాయాలయ్యాయి. బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో ఈ ఘోరం జరిగింది. బాధితురాలు ఆ కాలేజీలో బీఈడీ చదువుతోంది. విభాగాధిపతి సమీర్ కుమార్ కొన్నినెలలుగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని... అకడమిక్ కెరీర్‌ను నాశనం చేసి, భవిష్యత్తు లేకుండా చేస్తానని బెదిరిస్తున్నారని జూలై 1న ఆమె కాలేజీ అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసి 10రోజులైనా యాజమాన్యం స్పందించడం లేదని, పైగా కాలేజీ ప్రిన్సిపాల్ ఫిర్యాదును ఉపసంహరించుకోవాలంటూ ఒత్తిడి చేశారని ఆరోపిస్తూ బాధితురాలు సోమవారం కాలేజీ ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ క్రమంలోనే ఒంటికి నిప్పంటించుకొంది.

ఇక ఇంధన మీటల తనిఖీలు

విమానయాన సంస్థలకు డీజీసీఏ ఆదేశాలు.. ఈ నెల 21లోపు నివేదికలివ్వాలని వెల్లడి



న్యూఢిల్లీ/దుబాయ్, జూలై 14: అహ్మదాబాద్ విమానప్రమాదం నేపథ్యంలో బోయింగ్ విమానాలను వినియోగిస్తున్న ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇంజన్లకు ఇంధనాన్ని సరఫరా చేసే మీటల(ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్)లను తనిఖీ చేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21లోపు తనిఖీలను పూర్తిచేసి నివేదికను సమర్పించాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. బోయింగ్ 737, 787(8/9/10) డ్రీమ్ లైనర్లలో తనిఖీలు చేయాలని, ఏవైనా మార్పులు చేసి ఉంటే.. ఆ వివరాలను కూడా నివేదికలో తెలియజేయాలని పేర్కొంది. అహ్మదాబాద్‌లో బోయింగ్-787 డ్రీమ్ లైనర్ విమాన ప్రమాదానికి ఇంధన మీట 'రన్' స్థితి నుంచి 'కటాఫ్'కు మారడమే కారణమని దర్యాప్తులో తేలిన విషయం తెలిసిందే.! మరోవైపు, దుబాయ్‌కి చెందిన దిగ్గజ విమానయాన సంస్థ ఎతిహాద్ ఎయిర్‌వేస్ తమ వద్ద ఉన్న బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానాల విషయంలో అప్రమత్తమైంది. తన వద్ద ఉన్న బోయింగ్-787 డ్రీమ్ లైనర్ విమానాల్లో ఇంధన మీటలను తనిఖీ చేస్తోంది.

అనేక ప్రశ్నలు: ఎయిరిండియా సీఈవో

ప్రమాదంపై ప్రాథమిక నివేదిక అనేక ప్రశ్నలను ఉత్పన్నం చేస్తోందని ఎయిరిండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ అన్నారు. ఏఏఐబీ నివేదిక కొన్ని విషయాల్లో స్పష్టతనిచ్చినా.. మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతోందని తమ సిబ్బందికి పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు. "విమానంలో ఎలాంటి మెకానికల్, నిర్వహణ లోపాలు లేవు. ఇంధన నాణ్యత కూడా బాగుంది. టేకాఫ్‌లో ఎలాంటి అసాధారణ పరిస్థితులు కనిపించలేదు. పైలట్లకు ప్రీ-ఫ్లైట్ బ్రీత్-అనలైజర్ పరీక్షలు నిర్వహించాం. దర్యాప్తు కొనసాగుతుండగా.. వదంతులు వస్తుంటాయి. వాటిని పట్టించుకోకుండా.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం" అని ఆయన అన్నారు.

మానవ తప్పిదమే: మోహన్ రంగనాథన్

ఎయిరిండియా విమాన ప్రమాదం అతిపెద్ద మానవ తప్పిదమే అని విమానయాన నిపుణుడు కెప్టెన్ మోహన్ రంగనాథన్ స్పష్టం చేశారు. పైలట్ల తప్పిదంపై వస్తున్న ఊహాగానాలను పైలట్ల సంఘాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. సోమవారం రంగనాథన్ వెల్లడించిన అభిప్రాయం సంచలనంగా మారుతోంది. "ప్రాథమిక నివేదికలో తొలుత ఒక ఇంధన మీట ఫెయిల్ అయినట్లు తేలింది. ఆ తర్వాత సెకను వ్యవధిలోనే రెండోది కూడా ఫెయిలయ్యింది. విద్యుత్తు సరఫరా వైఫల్యంతో మీటలు వాటంతట అవే కదలవు. పైలట్ తన చేతితో లాక్‌ను పైకి లేపి.. 'రన్' నుంచి 'కటాఫ్' లేదా.. 'కటాఫ్' నుంచి 'రన్' మోడ్‌కి మార్చాలి. ఇది ఆటోమేటిక్‌గా జరిగే వ్యవహారం కానేకాదు" అని ఆయన వివరించారు. "విమానంలో మెకానికల్ లోపం ఉంటే ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చేది" అని అభిప్రాయపడ్డారు.

పారదర్శకంగా దర్యాప్తు జరగాలి

అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి సంబంధించి ఏఏఐబీ నివేదికపై ఎయిరిండియా పైలట్ల సంఘం, ఇండియన్ పైలట్స్ గిల్డ్(ఐపీజీ) అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఊహాగానాలు, సంచలనాలకు దూరంగా.. వాస్తవాధారిత, పారదర్శక దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశాయి. "ఈ నివేదికలో కీలకమైన సాంకేతిక వివరణలు, కాక్‌పిట్ వాయిస్ రికార్డింగ్ ట్రాన్స్‌క్రిప్టులు లేవు. దీంతో మీడియాలో తప్పుడు కథనాలు పుట్టుకొస్తున్నాయి" అని వ్యాఖ్యానించాయి.

గాల్లోకి ఎగిరిన కాసేపటికే కుప్పకూలిన విమానం

- లండన్‌లో ఘటన.. నలుగురి మృతి

లండన్, జూలై 14: లండన్ నుంచి నెదర్లాండ్స్‌లోని లెలిస్టాడ్‌కు బయల్దేరిన చిన్నపాటి విమానం టేకాఫ్ అయిన కాసేపటికే కూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న నలుగురు మృతి చెందారు. నెదర్లాండ్స్‌లోని జ్యూష్ ఏవియేషన్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ బీ200 సూపర్ కింగ్ విమానం లండన్‌కు తూర్పున 56కి.మీ దూరంలో ఉన్న సౌత్ ఎండ్ విమానాశ్రయం నుంచి ఆదివారం మధ్యాహ్నం గాల్లోకి ఎగిరిన కొన్ని సెకన్లకే కుప్పకూలింది.

బిహార్‌లో 35.5 లక్షల ఓట్ల తొలగింపు?

(మొదటిపేజీ తరువాయి)

జాబితాలను ప్రచురిస్తామని వివరించింది. 12.5 లక్షల మంది అంటే 1.59 శాతం మంది ఓటర్లు చనిపోయారని, వారి పేర్లను జాబితాల నుంచి తొలగిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. మరో 17.5 లక్షల మంది అంటే 2.2 శాతం మంది బిహార్ నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లారని, వారి పేర్లను కూడా తీసివేస్తామని పేర్కొంది. ఇంకో 5.5 లక్షల మంది అంటే 0.73 శాతం మంది పేర్లు రెండు చోట్ల ఉన్నాయని, వాటిని కూడా మార్చుతామని వివరించింది. ఈ లెక్కన 35.5 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉంది. ఇది మొత్తం ఓటర్లలో 4.5 శాతానికి సమానమని తేలింది. ఓటర్ల జాబితాల్లో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ జాతీయుల పేర్లు ఉండడంతో వాటిని కూడా తొలగించాలని నిర్ణయించింది. భారీగా ఓటర్లను తొలగించడంపై విపక్షాలు విమర్శిస్తున్నాయి.

విద్యార్థుల ఆత్మహత్యలపై స్టేటస్ రిపోర్టు సమర్పించండి

న్యూఢిల్లీ, జూలై 14: ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలపై యథాతథ స్థితిని తమకు నివేదించాలని పశ్చిమబెంగాల్, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఐఐటీ - ఖరగ్‌పూర్, ఐఐటీ ఢిల్లీల్లో విద్యార్థుల ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులతోపాటు దర్యాప్తుపై తాజా పరిస్థితిని తెలియజేయాలని రెండు రాష్ట్రాల పోలీసులను కోరింది. కోటాలో నీట్ ఆశావాహుల ఆత్మహత్యలు పెరిగి పోవడం ఆందోళనకరమని పేర్కొన్న ధర్మాసనం..వాటిని తగ్గించడానికి తీసుకున్న చర్యలేమిటని రాజస్థాన్ ప్రభుత్వాన్ని నిలదీసింది.

ఇక ప్రతి ఎంపీ పంచ్ కొట్టాల్సిందే

- లేదంటే అలవెన్స్‌లు కట్

న్యూఢిల్లీ, జూలై 14: వచ్చేవారం ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల నుంచి లోక్‌సభ సభ్యులకు నూతన హాజరు వ్యవస్థ అమల్లోకి రానుంది. సమావేశాలకు హాజరయ్యే సభ్యులు 'పంచ్' నమోదు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు అన్ని రకాల అలవెన్సులు పొందేందుకు సభ్యులకు ఈ నూతన హాజరు వ్యవస్థను అమల్లోకి తెస్తున్నారని తెలుస్తోంది. సమావేశాలు జరుగుతున్నప్పుడు, ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు సభ్యుల హాజరీ పెంచేందుకు ప్రతిపాదించిన నూతన అటెండెన్స్ విధానం అమలు పట్ల స్పీకర్ ఓం బిర్లా ఆసక్తిగా ఉన్నారని సమాచారం. కాగిత రహితంగా పార్లమెంట్‌ను మార్చేందుకు ఓం బిర్లా గతేడాది డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకూ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి.

నూనె, చక్కెర బోర్డులు పెట్టండి

- చిరుతిళ్లపై కేంద్ర ఆరోగ్యశాఖ సూచన

న్యూఢిల్లీ, జూలై 14: చిరుతిళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ సంస్థలు వంటి వాటిలో 'చక్కెర, నూనె బోర్డు'లను ప్రదర్శించాలని సూచించింది. రోజువారీ తీసుకునే ఆహార పదార్థాల్లో ఉండే కొవ్వు, చక్కెర వంటి కీలక సమాచారాన్ని అందులో ప్రదర్శించాలని తెలిపింది. ఈ మేరకు గత నెల 21న ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్యసలీల శ్రీవాస్తవ అన్ని విభాగాలకు లేఖ రాశారు. లెటర్ హెడ్లు, ఎన్వలప్ కవర్లు, నోట్‌ప్యాడ్లు, ఫోల్డర్లు వంటి అధికారిక పత్రాలు, స్టేషనరీపై ఆరోగ్య సందేశాలను ముద్రించాలని లేఖలో తెలిపారు. పని ప్రదేశాల్లో పౌష్టికాహారం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ఆ పోస్టులు కలవరపరచడం లేదా?

సోషల్‌మీడియాలో కంటెంట్‌పై ప్రభుత్వ కట్టడి ఉండాలి.. కానీ సెన్సార్ పద్ధతి సరికాదు

- భావస్వేచ్ఛను కొన్ని జాగ్రత్తలతో అనుభవించాలి.. స్వీయ నియంత్రణ కీలకం
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ కేసులో సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జూలై 14 : భావ ప్రకటన, వ్యక్తీకరణ స్వేచ్ఛ విలువను పౌరులు తెలుసుకోవాలని, మాట్లాడేటప్పుడు స్వయం నియంత్రణను పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. అభ్యంతరకర పోస్టులను సోషల్ మీడియాలో నిరోధించేందుకు వీలుగా మార్గదర్శకాలు తెచ్చే యోచన చేస్తున్నామని తెలిపింది. 'ఈ పోస్టులు పౌరులను కలవరపరచడం లేదా?' అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టడి చేయాల్సిందేనని స్పష్టం చేసింది. హిందూ దేవతకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ట్వీట్‌లు పోస్టు చేసిన వ్యవహారంలో వజహత్‌ఖాన్ అనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌ను గతనెల 9న పశ్చిమబెంగాల్‌లో అరెస్టు చేశారు. అప్పటికే ఆయనపై ఆ రాష్ట్రంతో పాటు ఆరు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దీనిపై వజహత్ ఖాన్ ఆ నెల 23న సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆయనకు జూలై 14(సోమవారం) వరకు చట్టపరచర్యల నుంచి రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఆ గడువు ముగియడంతో సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ ఆయన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా శర్మిష్ఠ పనోలీ అనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌పై వజహత్ ఖాన్ ఆరోపణలు చేశారు. "శర్మిష్ఠ ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా మతపరమైన వీడియోలు పెట్టడంపై నేను ఫిర్యాదు చేశాను. అయితే, అప్పటికే సోషల్ మీడియాలో నేను ట్వీట్ చేసిన వ్యాఖ్యలకుగాను నన్ను పశ్చిమబెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. నాపై పలు రాష్ట్రాలపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయండి. లేదంటే అన్ని కేసులను కలిపి విచారించండి." అని కోరారు. ఇదే సమయంలో జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. సోషల్‌మీడియాలో వ్యాపించిన విభజన ధోరణలను కట్టడి చేయాల్సిందేనన్నారు. అయితే, దీని అర్థం సెన్సార్‌ను అమలు చేయాలనేది కాదని, తాము స్వయం నియంత్రణల గురించి ఆలోచిస్తున్నామని తెలిపారు. "భావస్వేచ్ఛను పౌరులు అనుభవించాలనుకుంటే కొన్ని నియంత్రణలను వారు తమకు తాముగా పాటించాలి. ఇలా ఉల్లంఘనలకు పాల్పడరాదు." అని వ్యాఖ్యానించారు. భావ ప్రకటన స్వేచ్ఛకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (2) విధించిన నియంత్రణలు సరిగ్గానే ఉన్నాయన్నారు. "సోషల్ మీడియాలో పెట్టే కంటెంట్ విషయంలో తప్పనిసరిగా కొంత నియంత్రణ ఉండాలి. అటువంటి పోస్టులకు పౌరులు దూరంగా ఉండాలి. వాటిని షేర్ చేయడం, లైక్ చేయడం చేయరాదు" అని కోర్టు సూచించింది. వజహత్ ఖాన్‌కు కల్పించిన రక్షణలను వచ్చే విచారణ వరకు పొడిగించింది.

సీజేఐ గవాయ్‌కు అస్వస్థత.. ఢిల్లీ ఆసుపత్రిలో చేరిక

న్యూఢిల్లీ, జూలై 14: సీజేఐ జస్టిస్ గవాయ్ అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల క్రితం ఆయన హైదరాబాద్‌లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆయన్ను ఢిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఒకటి రెండు రోజుల్లో విధులకు హాజరవుతారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 12న ఆయన హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ఆయన హాజరయ్యారు.

జీవిత భాగస్వామి సంభాషణల రికార్డుల్ని సాక్ష్యంగా తీసుకోవచ్చు!


- వివాహసంబంధ కేసుల్లో దీనికి ఓకే

జీవిత భాగస్వామితో జరిపిన సంభాషణల రహస్య రికార్డులను వివాహసంబంధ కేసుల్లో సాక్ష్యంగా పరిగణించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పంజాబ్‌కు చెందిన ఓ భార్యాభర్తల కేసులో సోమవారం ఈ మేరకు తీర్పునిచ్చింది. తొలుత భటిండాలోని ఫ్యామిలీకోర్టులో ఈ కేసు విచారణకు వచ్చింది. తన భార్య తన మీద తీవ్రమైన వేధింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ.. అందుకు ఆధారంగా, ఆమెతో గతంలో జరిపిన ఫోన్ సంభాషణల ఆడియో రికార్డులున్న సీడీని కోర్టులో సమర్పించాడు భర్త. ఆ సీడీని సాక్ష్యంగా తీసుకోవటానికి ఫ్యామిలీ కోర్టు అంగీకరించింది. అయితే, ఫోన్ సంభాషణల రికార్డు వ్యక్తిగత గోప్యతకు భంగకరమని హైకోర్టు వాటిని తిరస్కరించింది. ఈ నేపథ్యంలో, భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆడియో రికార్డుల్ని సాక్ష్యంగా పరిగణించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

నర్సు నిమిషను రక్షించడానికి..

'బ్లడ్ మనీ' ఒక్కటే మార్గం!

- సుప్రీంకు 'సేవ్ నిమిష కౌన్సిల్' నివేదన
- ఎవరి ద్వారా మాట్లాడాలన్నదే ప్రశ్న: కేంద్రం



న్యూఢిల్లీ, జూలై 14: యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియ (38)ను కాపాడేందుకు హత్యాపరిహార ధనం (బ్లడ్ మనీ) చెల్లించడం ఒక్కటే ఏకైక పరిష్కారమని 'సేవ్ నిమిష ప్రియ-ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' అనే సంస్థ సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఆమె తల్లి ప్రస్తుతం యెమెన్‌లోనే ఉన్నారని.. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులతో ఓ సామాజిక కార్యకర్త ద్వారా మాట్లాడుతున్నారని వెల్లడించింది. పరిహార ధనం తీసుకోవడానికి హతుడి కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే నిమిష బయటపడే అవకాశం ఉంటుందని తెలిపింది. అయితే బ్లడ్ మనీ చెల్లింపు ప్రైవేటుగా జరగాల్సిన వ్యవహారమని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి అన్నారు. ఆ డబ్బు తాము ఏర్పాటు చేసుకుంటామని నిమిష కుటుంబ సభ్యులు చెబుతున్నారని.. అయితే ఎవరితో మాట్లాడాలన్నదే ఇక్కడ ప్రశ్న అని తెలిపారు. ఆ దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వపరంగా చేయగలిగింది చాలా తక్కువని.. అయినా ఆమెను కాపాడేందుకు సాధ్యమైన మేర అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించారు. బుధవారం నిమిషకు మరణ దండన అమలు కానున్న సంగతి తెలిసిందే. కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన నిమిష.. 2017లో తన యెమెనీ వ్యాపార భాగస్వామిని హత్య చేశారన్న అభియోగాలపై 2020లో అక్కడ ఆమెకు మరణశిక్ష విధించారు. ప్రస్తుతం నిమిష ఆ దేశ రాజధాని సనాలోని జైలులో ఉన్నారు. ఆమెను రక్షించడానికి దౌత్య మార్గాల్లో కృషిచేయాల్సిందిగా భారత ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ 'సేవ్ నిమిష ప్రియ-ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. కేంద్రం తరఫున అటార్నీ జనరల్ హాజరయ్యారు. యెమెన్ ప్రస్తుతం హౌతీల పాలనలో ఉందని.. ఆ ప్రభుత్వాన్ని ఎవరూ దౌత్యపరంగా గుర్తించడం లేదని ఆయన తెలిపారు. మరణ శిక్ష అమలును కొంతకాలం సస్పెండ్ చేయడానికి వీలుందో లేదో కనుక్కునేందుకు ఆ ప్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కేంద్రం ఇటీవల లేఖ రాసిందని తెలిపారు. సాధ్యమైన అన్ని యత్నాలూ చేస్తున్నామని.. అక్కడ పలుకుబడి కలిగిన కొందరు షేక్‌లను కూడా రంగంలోకి దించామని వివరించారు.

2008లో యెమెన్‌కు..

నిమిష 2008లో యెమెన్ వెళ్లారు. రాజధాని సనాలో సొంత క్లినిక్ ఏర్పాటుచేసేందుకు 2015లో ఆ దేశస్థుడైన తలాల్ అబ్దో మహదీ సాయం తీసుకున్నారు. ఆ ఏడాది నిమిష నెల రోజుల సెలవుపై కేరళ వచ్చినప్పుడు మహదీ కూడా ఆమెతోపాటు వచ్చారు. ఆ తర్వాత అతడితో ఆమెకు విభేదాలు వచ్చాయి. తన పాస్‌పోర్టు స్వాధీనం చేసుకోవడానికి 2017లో అతడికి నిమిష మత్తు ఇంజక్షన్ ఇచ్చిందని.. ఓవర్‌డోస్‌తో అతడు మరణించాడని ఆమె కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నిమిష మరో నర్సు సాయంతో మృతదేహాన్ని ముక్కలుచేసి భూగర్భ ట్యాంకులో పడేసినట్లు యెమెనీ కోర్టు అధికారిక పత్రాలు చెబుతున్నాయి. దేశం వదిలి పారిపోతుండగా ఆమెను పట్టుకున్నారు. ట్రయల్ కోర్టు మరణ శిక్ష విధించింది. కాగా, నిమిష ప్రియను కాపాడేందుకు కేరళకు చెందిన సున్నీ ముస్లింల మతగురువు షేక్ అబూబకర్ అహ్మద్ ముస్లియార్ ప్రయత్నాలు మొదలుపెట్టారు. 'ఇండియా గ్రాండ్ ముఫ్తీ' బిరుదు ఉన్న 94 ఏళ్ల అబూబకర్ యెమన్‌లో మతాధికారులతో చర్చించారు.

నాకు రక్తం బలి కావాలి.. లేదంటే అల్లకల్లోలమే!

- మహమ్మారి వస్తుంది.. అగ్ని ప్రమాదాలూ ఉంటాయి
- ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురుస్తాయి
- రంగంలో మాతంగి స్వర్ణలత భవిష్య వాణి

సికింద్రాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బోనాల జాతరను సాకలు పోసి బాగా చేసినా.. ప్రతిసారి చేసినట్లే ఈసారి కూడా పొరపాటు చేశారని రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత మండిపడ్డారు. తనకు రక్తం బలి కావాలని, లేకపోతే అల్లకల్లోలం జరుగుతుందని హెచ్చరించారు. 'మీరు మాత్రం ఆరగిస్తారు.. నాకు మాత్రం బలి ఇవ్వరా?' అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో మహమ్మారి వస్తుందని, అగ్ని ప్రమాదాలు జరుగుతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బోనాల జాతర సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో సోమవారం ఉదయం రంగం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. తనకు పూజలు సరిగా


భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి స్వర్ణలత

నిర్వహించాలని.. అలా చేయకపోతే రక్తం కక్కుకొని చస్తారని, పూజలు సరిగా నిర్వహించకపోవడం వల్లే మరణాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఏడాది తన కోరికలు చెబుతున్నానని, అయినా పండుగ సందర్భంగా ఏదో ఒక ఆటంకం కల్పిస్తూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు వారాల పాటు తనకు పూజలు చేసి, సాక పోసి ఆనంద పరచాలన్నారు. తన రూపాన్నిపెట్టడానికి కూడా అడ్డు పడుతున్నారని అన్నారు.. తనను మొక్కే వాళ్ల ఉండాలని, నిందలు వేసే వాళ్ల ఉండ కూడదన్నారు. తనను కొలిచే వారికి ఎప్పుడూ తోడుగా నిలబడతానని చెప్పారు. ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురుస్తాయని చెప్పారు.

బలి విషయమై అధికారులతో చర్చిస్తాం: మంత్రి పొన్నం

అమ్మవారికి గతంలో నిర్వహించి, ఆ తర్వాత రద్దు చేసిన బలి విషయమై ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. మహంకాళి ఆలయంలో రంగం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు రక్తం కావాలని పరోక్షంగా బలి అంశాన్ని అమ్మవారు ప్రస్తావించినందున దీనిపై దేవాదాయ శాఖ అధికారులతో చర్చిస్తామని వెల్లడించారు. అమ్మవారు కోరిన విధంగా ప్రభుత్వం తరపున అన్ని చేస్తామని, దేవాదాయ శాఖ తరపున శాస్త్రోక్తంగా జరగవలసిన పూజలన్నీ నిర్వహిస్తామని తెలిపారు. సికింద్రాబాద్ బోనాల జాతర బాగా జరిగిందని, ప్రతి ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చారని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తప్పనిసరి చర్యలు చేపడుతుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.


నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న రామచందర్‌రావు

బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

- మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకం
- నల్లగొండ పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు వ్యాఖ్యలు

నల్లగొండ టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందని, అయితే తాము మతపరమైన రిజర్వేషన్లను ఒప్పుకోబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత తొలిసారిగా నల్లగొండకు వచ్చిన ఆయన కార్యకర్తల సమ్మేళనం అనంతరం మీడియాతో మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్లలో 10శాతం ముస్లిం రిజర్వేషన్లను(మతపరమైన రిజర్వేషన్లు) వ్యతిరేకిస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు కూడా దీనిని అంగీకరించలేదని ఆయన గుర్తు చేశారు. మతపరమైన రిజర్వేషన్ల వల్ల అసలైన బీసీలకు నష్టం జరుగుతుందని రాష్ట్ర బీసీలు గుర్తించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారి కార్యకర్తలకే రేషన్‌కార్డులు ఇచ్చే ప్రయత్నం చేస్తోందని, ఇప్పటికే దళారులు రంగంలోకి దిగారని ఆయన ఆరోపించారు. నల్లగొండ గడ్డపై కుటుంబ పాలనను అంతం చేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పోరాడాలని, బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాంచందర్‌రావు చెప్పారు.

స్థానికంపై కమలం గురి

పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ.. 'బీజేపీ వస్తేనే స్వర్ణ తెలంగాణ' నినాదంతో ప్రజల్లోకి

- నేడు రాష్ట్ర పదాధికారులతో ప్రత్యేక వర్క్‌షాప్
- ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ మండలాధ్యక్షులకు శిక్షణ
- జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టిన ఎన్ రాంచందర్‌రావు
- తొలిరోజు సోమవారం నల్గొండ, సూర్యాపేటలో పర్యటన



హైదరాబాద్, జులై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర బీజేపీ నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పంచాయతీ నుంచి మున్సిపాలిటీల వరకు పట్టు సాధించే దిశగా వ్యూహాత్మక కార్యాచరణను రూపొందిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు బీజేపీ అధికారంలోకి వస్తేనే 'స్వర్ణ తెలంగాణ' సాధ్యం అన్న నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం, గ్రామీణ ప్రాంతాల్లో మండలం, నగరాల్లో డివిజన్ కేంద్రంగా కార్యక్రమాలు నిర్వహించనుంది. గ్రామాలవారీగా తమ బలం, బలహీనతలపై కూడా బీజేపీ నివేదికలను రూపొందించుకుంది. వీటి ఆధారంగా స్థానిక పార్టీ క్యాడర్‌తో సమీక్షించి అందుకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి సన్నద్ధమైంది. మంగళవారం రాష్ట్ర పదాధికారులకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఏయే ప్రాంతాల్లో పార్టీకి పట్టుంది.. ఎక్కడ బలహీనంగా ఉంది.. వంటి అంశాలను ఇందులో సమీక్షించనున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ కూడా హాజరు కానున్నారు. మరోవైపు, రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలను ఐదు జోన్‌లుగా విభజించిన పార్టీ నాయకత్వం, ఆయా జోన్‌ల పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఉమ్మడి హైదరాబాద్, నల్గొండ జిల్లాల నాయకులకు మంగళవారం సాయంత్రం శిక్షణా సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై బుధవారం కూడా వీరికి శిక్షణ ఇవ్వనున్నారని పార్టీవర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థల్లో సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లో ఓటు బ్యాంకు పెంచుకోవచ్చని కమలనాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోలిస్తే తాము గణనీయంగా బలపడ్డామని భావిస్తున్న కమలనాథులు, చట్టసభల ఎన్నికల్లాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సీట్లు పెంచుకోవాలన్న పట్టుదలతో ఉన్నారు. "గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల పార్టీ కొంత బలహీనంగా ఉన్నమాట వాస్తవం. ఆ ప్రాంతాల్లో బలోపేతం కావాలి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి కూడా మాకు అభ్యర్థుల్లేరు. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. గతంతో పోలిస్తే మెరుగుపడినా, ఇంకా చేయాల్సింది చాలా ఉంది" అని పార్టీ సీనియర్ నేత ఒకరు స్పష్టం చేశారు.

పార్టీ బలహీనంగా ఉన్న జిల్లాల్లో ఒకటైన ఉమ్మడి నల్గొండ నుంచి రాంచందర్‌రావు క్షేత్రస్థాయి పర్యటనలు ప్రారంభించడం విశేషం. తొలిదశలో నల్గొండ, సూర్యాపేట జిల్లాలు, ఆ తర్వాత ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారు. ప్రాథమిక షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18, 19తేదీల్లో రాంచందర్‌రావు ఉత్తర తెలంగాణలో పర్యటించనున్నారు. 25, 26 తేదీల్లో దక్షిణ తెలంగాణ పరిధిలోని మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లే అవకాశం ఉందని పార్టీవర్గాలు వివరించాయి. కాగా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కైవసం చేసుకోవడమే తమ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ స్పష్టం చేశారు. ఇందుకోసం, పార్టీ నాయకత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టబోతోందని ఆయన చెప్పారు.

దళిత కార్యకర్త ఇంట్లో రాంచందర్‌రావు బస

స్థానిక సంస్థల ఎన్నికలే తన మొదటి టార్గెట్ అని ప్రకటించిన రాంచందర్‌రావు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి హోదాలో తొలిసారిగా సోమవారం జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టారు. చౌటుప్పల్, నల్గొండ, సూర్యాపేట తదితర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికాయి. రాంచందర్‌రావు తన సొంతూరు నల్లబండగూడెంలో దళిత కార్యకర్త ఇంట్లో రాత్రి బస చేశారు.

మహిళను కించపరిస్తే కమిషన్ స్పందించదా?

- కమిషన్ కార్యాలయం ఎదుట జాగృతి మహిళల నిరసన
- వారి ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ సభ్యులు
- మల్లన్న క్షమాపణలు చెప్పాలి.. జాగృతి ఎస్టీ సెల్ డిమాండ్

హైదరాబాద్, రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గౌరవప్రదమైన హోదాలో ఉన్న మహిళపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంపై ఫిర్యాదు చేయడానికి వస్తే మహిళా కమిషన్ స్పందించదా? ఇదేం పద్ధతి? అంటూ జాగృతి మహిళానేతలు ప్రశ్నించారు. కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం మహిళాకమిషన్ కార్యాలయంలో వారు ఫిర్యాదుచేశారు. కాగా, ముందస్తు సమాచారం ఇచ్చినా చైర్‌పర్సన్ అందుబాటులో లేకపోవడం తగదని అసహనం వ్యక్తంచేశారు. కార్యదర్శి సైతం ఫిర్యాదులేఖను తీసుకునేందుకు అంగీకరించకపోవడంతో అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. అయినా కమిషన్ చైర్‌పర్సన్ అందుబాటులోకి రాకపోవడంతో ఫిర్యాదు పత్రాన్ని కమిషన్ సభ్యులు సుధంలక్ష్మి, రేవతిరావు, ఉమ, అఫ్రోజ్ షహీనాకు అందజేశారు. కాగా, కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జాగృతి ఎస్టీ సెల్ హైదరాబాద్ అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో మల్లన్న చిత్రపటానికి చెప్పులతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. మరో వైపు, తెలంగాణ జాగృతి శ్రేణులు విద్యార్థిసంఘాలు, పలుచోట్ల నిరసనలు, ఆందోళనలు చేపట్టాయి. సోమవారం ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహంవద్ద, ఎల్‌బీనగర్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహంవద్ద ఆందోళన నిర్వహించారు. మల్లన్న శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఓయూ జేఏసీ చైర్మన్ ఎల్చాల దత్తాత్రేయ, కందులమధు, కొప్పుల అర్జున్, రామకృష్ణ ఆధ్వర్యంలో ఓయూలో ఆందోళన నిర్వహించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. తెలుగు యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ నాయకులు, జేఎస్‌టీయూ పరిధిలోని విద్యార్థి సంఘాల నాయకులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో.. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పేరు

- సిట్ విచారణలో వెల్లడించిన బీఎస్పీ నేత వట్టే జానయ్య

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో రోజుకో కొత్త పేరు బయటకు వస్తోంది. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పేరు ఈ కేసులో తాజాగా బహిర్గతమైంది. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్న క్రమంలోనే బీఎస్పీ నేత వట్టే జానయ్య సోమవారం అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. పలు అంశాలపై జానయ్య నుంచి దర్యాప్తు అధికారులు లిఖితపూర్వకంగా వాంగ్మూలాన్ని నమోదు చేశారు. సిట్ విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌తో అరాచకాలకు పాల్పడిందని విమర్శించారు. "2022 నుంచి మావోయిస్టుల సానుభూతి పరుల పేరుతో నా ఫోన్‌ను ట్యాప్ చేయించారు. నాపై 25 కేసులు పెట్టి, 65 రోజులు అజ్ఞాతంలో ఉండేలా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో నా ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణం. నేను బీఆర్ఎస్‌లో ఉన్నపుడే జగదీశ్ రెడ్డి నా ఫోన్‌ను ట్యాపింగ్ చేయించారు. బీసీ నాయకుల ప్రభావాన్ని అణిచివేయాలనే జగదీశ్‌రెడ్డి ఈ చర్యకు పాల్పడ్డాడు" అని జానయ్య ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఫోన్లు సైతం ట్యాపింగ్‌కు గురయ్యాయన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో గెలిచిన జగదీశ్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలన్నారు. గతంలో బీఎస్పీ చీఫ్‌గా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్(ప్రస్తుతం బీఆర్ఎస్ నేత)కు విషయం చెప్పినా.. పట్టించుకోలేదన్నారు. తనపై అక్రమ కేసులు బనాయించి, జగదీశ్‌రెడ్డి ఎన్నికల్లో గెలుపొందారని, ఇలా ట్యాపింగ్‌తో గెలిచిన 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఓసీలు అంతా కలిసి మాపై దాడికి కుట్ర

- బీసీలంతా ఒకవైపు.. కల్వకుంట్ల కుటుంబం ఒకవైపు
- కాంగ్రెస్‌తో కవిత మిలాఖత్.. త్వరలోనే ఆమె ఆ పార్టీలో చేరతారు: తీన్మార్ మల్లన్న



హైదరాబాద్, పీర్జాదిగూడ, పంజాగుట్ట, జూలై 14(ఆంధ్రజ్యోతి): "ఎగువ కులాల వాళ్లంతా ఏకమై మాపై(బీసీలపై) దాడి చేయాలని చూస్తున్నారు" అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. గతంలో పరకాల, బైరాన్‌పల్లిలో బీసీ మహిళలను నగ్నంగా బతుకమ్మ ఆడించిన జాతి వాళ్లదని విమర్శించారు. "బీసీలమంతా కలిసి రాజకీయ పార్టీగా ముందుకొస్తాం. రాష్ట్రంలో అధికారాన్ని చేపడతాం" అని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పీర్జాదిగూడలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని బీసీలంతా ఒకవైపు.. కల్వకుంట్ల కుటుంబం ఒకవైపు అని చెప్పారు. తన మీద వారి మనుషులను ఉసిగొల్పడం ద్వారా కవిత హత్యాయత్నం చేశారని.. ఆమెపై డీజీపీకి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. తన మీద, తన కార్యాలయం మీద దాడి చేసింది సుజిత్ రావు కల్వకుంట్ల కవిత బంధువే నని పేర్కొన్నారు. ఎథిక్స్ కమిటీ దృష్టికి కవిత వ్యవహారం తీసుకెళ్లి ఆమె సభ్యత్వం రద్దు చేయాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశాం" అని చెప్పారు. తనపై తెలంగాణ జాగృతి జరిపిన దాడిని బీఆర్ఎస్ నేతలు కూడా స్వాగతించలేదని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం, ఇతర కాంగ్రెస్ పెద్దలు ప్రెస్‌మీట్ పెట్టి మరీ కవితకు అండగా నిలిచారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి కవితకు అనధికారిక ఒప్పందం నడుస్తోందని ఆరోపించారు., ఇటీవల ముగ్గురు మంత్రుల ప్రమాణ స్వీకారం జరిగినప్పుడే కవిత కూడా మంత్రిగా ప్రమాణం చేసే అవకాశం ఉండిందని.. ఇది నిజమో, కాదో అనేది కాంగ్రెస్ పెద్దలే సమాధానం చెప్పాలన్నారు. కవిత కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైందని చెప్పారు.. మేడిపల్లి సీఐ గోవింద రెడ్డి చీకటి ఒప్పందం చేసుకున్నారని, ఆ ఒప్పందంతోనే తన మీద మూడుసార్లు హత్యాప్రయత్నం జరిగిందని.. అందుకే ఆయనపైనా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. న్యాయం జరగకపోతే రాష్ట్రంలోని రెండు కోట్ల మంది బీసీలను రోడ్లపైకి తీసుకొచ్చి నిరసన తెలుపుతానని హెచ్చరించారు. కాగా తీన్మార్ మల్లన్నకు వై ప్లస్ కేటగిరి భద్రత కల్పించాలని మున్నూరు కాపు సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఆయనపై జాగృతి నేతలు జరిపిన దాడిని ఖండిస్తున్నట్లు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. బీసీల సంరక్షణకు చట్టం తేవాలని బీసీ జేఏసీ అధ్యక్షుడు సంగెం సూర్యారావు డిమాండ్ చేశారు.

గన్‌మెన్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్!


హైదరాబాద్ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): క్యూ న్యూస్ ఆఫీస్‌పై దాడి ఘటనలో గాల్లోకి కాల్పులు జరిపిన తీన్మార్ మల్లన్న అలియాస్ ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ గన్‌మెన్ శ్రీనివాస్‌పై రాచకొండ సీపీ శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. గన్‌మెన్‌ను తొలగించి కార్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం.

యువతి మోజులో పడి వేధింపులు ఉరివేసుకొని భార్య ఆత్మహత్య

హనుమకొండ జిల్లాలో ఘటన.. ఇన్‌స్టా రీల్స్ చేసే యువతితో భర్త వివాహేతర సంబంధం

- ప్రశ్నిస్తే.. విడాకులిస్తా, ఆమెనే పెళ్లి చేసుకుంటానని నిర్లక్ష్యంగా సమాధానం
- కొడుకుకే అత్తామామల వత్తాసు
- ఆ యువతీ బెదిరింపులు

వరంగల్ క్రైం/హసన్‌పర్తి/వరంగల్ మెడికల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాలో రీల్స్ చేసే యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంపై భర్తను నిలదీస్తే.. తీవ్ర మానసిక, శారీరక వేధింపులకు గురిచేయడం, విడాకులిచ్చేసి.. ఆమెనే పెళ్లి చేసుకుంటానని నిర్లక్ష్యంగా మాట్లాడటంతో ఆ భార్య తీవ్ర ఆవేదనకు గురైంది. చివరికి రీల్స్ చేసే ఆ యువతి కూడా ఫోన్ చేసి బెదిరింపులకు గురిచేయడంతో దిక్కుతోచని స్థితిలో ఆ భార్య ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో ఈ ఘటన జరిగింది. భార్యాభర్తలిద్దరూ వైద్యులే! సీఐ చేరాలు కథనం ప్రకారం.. ములుగు జిల్లా కమలాపూర్‌కు చెందిన హృద్రోగ నిపుణుడు అల్లాడి సృజన్ రెడ్డికి 2017లో హసన్‌పర్తికి చెందిన దంత వైద్యురాలైన ప్రత్యూష (35)తో వివాహం జరిగింది. సృజన్-ప్రత్యూష దంపతులకు జానూష (7), జెస్వికాస్ (7నెలలు) సంతానం. హసన్‌పర్తి కాకతీయ వింటేజ్ వెంచర్‌లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. ప్రత్యూష ఎన్ఎస్ఆర్ ఆస్పత్రిలో దంత వైద్యురాలిగా.. సృజన్‌రెడ్డి ఎంజీఎం ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. తొమ్మిది నెలల క్రితం సృజన్‌కు ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెంజర్ అయిన యువతి (25)తో పరిచయం ఏర్పడింది. ఆమెకు ఇన్‌స్టాలో 2.33 లక్షల ఫాలోవర్లు ఉన్నారు. డిజిటల్ ప్రమోషన్‌లో భాగంగా ఆమె సృజన్‌రెడ్డితో ఇంటర్వ్యూ చేసి, ఆ వీడియోను తన ఇన్‌స్టాలో పోస్టు చేసింది. ఇద్దరి మధ్య ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇది ప్రత్యూషకు తెలియడంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. ప్రత్యూష.. తన అత్తామామలైన మధుసూదన్, పుణ్యవతి దృష్టికి తీసుకెళ్లారు. అయితే వారు సృజన్‌ను మందలించకపోగా ప్రత్యూషనే వేధించడం ప్రారంభించారు. అటు.. ఆ యువతి కూడా ఫోన్ చేసి ప్రత్యూషను బెదిరింపులకు గురిచేసింది. శుక్రవారం సృజన్ తల్లిదండ్రులు.. చిన్నారులు జానూష, జెస్వికాస్‌లను వెంటబెట్టుకొని భద్రాచలంలో ఉంటున్న పెద్ద కుమారుడి ఇంటికి వెళ్లారు. రెండ్రోజులుగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్న సృజన.. ఆదివారం సాయంత్రం గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకుని ఉరేసుకుంది. ఇరుగుపొరుగుతో కలిసి సృజన్ ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి తంజావూర్ పద్మావతి ఫిర్యాదు మేరకు సృజన్‌రెడ్డి, అత్తామామలు మధుసూదన్, పుణ్యవతి, ఇన్‌స్టా ఇన్‌ఫ్లుయెంజర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సృజన్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. కాగా, హసన్‌పర్తిలో సృజన్ ను విమర్శిస్తూ పోస్టర్లు వెలిశాయి. భార్యను చంపిన అల్లాడి సృజన్‌ను వెంటనే శిక్షించాల అని పోస్టర్లలో ఉంది. సృజన్ చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీకి చెప్పులదండ వేశారు.


డాక్టర్ ప్రత్యూష

కేసుల్లో పట్టుబడ్డ వాహనాన్ని రుణ సంస్థ తీసుకోలేదు

- రుణం ఇచ్చినంత మాత్రానయజమాని కాలేదు: హైకోర్టు

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని వస్తువులు, మత్తు పదార్థాలను తరలించిన కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను తమకు అప్పగించాలని రుణసంస్థలు కోరలేవని హైకోర్టు స్పష్టం చేసింది. రుణం ఇచ్చినంత మాత్రాన వాటికి యజమానులు కాలేవని తెలిపింది. ఎలాంటి పత్రాలు లేకుండా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న బొలేరో వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఆ వాహనం తమ తాకట్టులో ఉన్నందున దానిని తమకే అప్పగించాలని కోరుతూ టైగర్ క్యాపిటల్ అనే సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ టీ వినోద్‌కుమార్ ధర్మాసనం.. "రుణం ఇచ్చినంత మాత్రాన యజమాని కాలేరు. ఒకవేళ వాహనం కింద పడి ఎవరైనా పడి చనిపోతే యజమానినే బాధ్యుడిగా చేస్తారు కదా! అలాంటప్పుడు వాహనం మీదెలా అవుతుంది? రుణం చెల్లించే పరిస్థితి లేకపోతే వాహన యజమాని, రుణసంస్థకు ఉన్న ఒప్పందం మేరకు వేలం వేసి రుణ మొత్తం పోను మిగతాది యజమానికి చెల్లించాలి" అని తెలిపింది. కేసు ముగిసిన తర్వాత వాహనాన్ని యజమానికే తప్ప రుణ సంస్థకు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది.

చిరంజీవి ఇంటి క్రమబద్ధీకరణ దరఖాస్తుపై నిర్ణయం తీసుకోండి : హైకోర్టు

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్ నం.25లోని ఇంటి నిర్మాణాన్ని క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ ప్రముఖ నటుడు చిరంజీవి చేసు కున్న దరఖాస్తుపై నాలుగు వారాల్లో విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు స్పష్టంచేసింది. పిటిషనర్‌కు నోటీసులు జారీ చేసి, విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 455ఏఏ కింద నివాస గృహాన్ని క్రమబద్ధీకరించాలని కోరుతూ గత నెల5న చేసుకున్న దరఖాస్తుపై కమిషనర్ ఇప్పటికీ నిర్ణయం తీసుకో లేదంటూ చిరంజీవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచా రణ చేపట్టిన కోర్టు 4 వారాల్లో విచారించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలొచ్చేనా?

- కాజీపేటలో మార్చి నుంచి ఉత్పత్తికి ప్రణాళిక
- 'ఔట్‌సోర్సింగ్'లో నియామకాలకు ప్రయత్నాలు
- స్థానికులకు కొలువులివ్వాలని డిమాండ్

వరంగల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాజీపేట రైల్వే కోచ్ కర్మాగారాన్ని డిసెంబరు నెలఖారులోగా పూర్తి చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. 2026 మార్చి నాటికి ఉత్పత్తి ప్రారంభించేలా రైల్వే అధికారులు కసరత్తు చేస్తున్నారు. 55 ఏళ్ల ఉద్యమ ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఈ కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేసింది. ఈ కర్మాగారంతో తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావించిన స్థానికులకు రైల్వేబోర్డు నుంచి ఎలాంటి హామీ లభించకపోగా.. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రవేటు ఏజెన్సీకి అవకాశం ఇస్తున్నట్లుగా జరుగుతున్న ప్రచారం ఆందోళన కలిగిస్తోంది. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి 2025-26 కేంద్ర బడ్జెట్‌లో రూ.521 కోట్లు కేటాయించారు. పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ ఫ్యాక్టరీని మల్టీపుల్ ఫ్యాక్టరీగా అభివృద్ధి చేస్తున్నారు. రైల్వేకు కావాల్సిన అన్నిరకాల బోగీలు, గూడ్సు వ్యాగన్లు తయారు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వందే భారత్ రైళ్ల బోగీలను కూడా తయారు చేయాలని భావిస్తున్నారు. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు 80 శాతం పైగా పూర్తయ్యాయి. వచ్చే ఏడాది మార్చి నుంచి ఉత్పత్తిని ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించారు. మల్టీపుల్ ఫ్యాక్టరీ కోసం సుమారు 3,500 మంది వరకు ఉద్యోగులు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. వీరిలో 500-1000 మంది వరకు రైల్వేశాఖ నియమించుకొని, మిగిలిన వారిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ఏదైనా ఏజెన్సీకి ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న స్థానికులకు అన్యాయం జరుగుతుందని రైల్వే జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పంజాబ్‌లోని కపుర్తలా కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 50 శాతం ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇచ్చేలా కేంద్రం జీవో ఇచ్చిందని, అలాగే కాజీపేటలో కూడా స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సందేహాలు సశేషం!

మన దేశాన్నే కాదు, యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటనపై ఇటీవల విడుదలైన ప్రాథమిక నివేదిక, సమాధానాలకంటే కొత్త సందేహాలు, ప్రశ్నలు రేకెత్తించింది. విమాన ఇంజన్లకు ఇంధనాన్ని సరఫరాచేసే కంట్రోల్ స్విచ్‌లు ఆఫ్ కావడంతో ఈ ఘోరం జరిగిందని నివేదిక అంటోంది. ప్రమాదానికి ముందు ఏ క్షణానికి ఏం జరిగిందన్న వరుసక్రమంతో పాటు, కాక్‌పిట్ సంభాషణల వివరాలను కూడా ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్‌బ్యూరో (ఎఎఐబి) ఈ ప్రాథమిక నివేదికలో అతిపరిమితంగా ఉంచింది. గాల్లోకి లేచిన కొద్ది క్షణాల్లోనే బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలి, క్షణాల్లో తగలబడిపోయిన ఈ దారుణఘటనకు అనేకానేక సాంకేతిక అంశాలూ, తప్పిదాలు దోహదం చేశాయని నివేదిక నిగ్గుతేల్చవచ్చునని నిపుణులు సైతం భావించారు. తుదినివేదికలో మరెన్ని వివరాలు, ఇంకెన్ని లోతులు ఉంటాయో తెలియదు గానీ, పదిహేను పేజీల ఈ ప్రాథమిక నివేదిక తన గడువు లక్ష్యాన్ని అయితే అందుకోగలిగింది కానీ, తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది.


ప్రాథమిక నివేదిక ఆధారంగా మాట్లాడటం సరికాదని ప్రభుత్వ పెద్దలు ఒకపక్క అంటున్నప్పటికీ, తప్పును తమమీదకు తోసేసే ప్రయత్నంగా పైలట్ల సంఘం అనుమానిస్తోంది. ఎందుకు, ఎలా, సాంకేతికమా, మానవతప్పిదమా వంటి వివరణలూ, వివరాలూ ఏ మాత్రం లేకుండా, పైలట్ల సంభాషణను కూడా పూర్తిగా అందివ్వకుండా నివేదిక విడుదలైనందున పైలట్లకు ఆగ్రహం కలగడం సహజం. ఏం జరిగిందో చెప్పిన ఆ నివేదిక, ఆ చిరు సంభాషణను ప్రస్తావించడం ద్వారా పైలట్లే ఏదో గందరగోళం చేశారన్న అనుమానానికే ఆస్కారం కల్పించింది. ఈ తరహా విమానాల్లో ఇంధన సరఫరా స్విచ్‌లకు లాక్ ఉంటుందని, కుదుపులకు జారిపోకుండా బ్రాకెట్లు ఉంటాయని నిపుణులు అంటున్నారు కనుక, ఈ విమానంలో ఆ వ్యవస్థ ఉంటే, సక్రమంగా పనిచేస్తున్నదా అన్నది ముఖ్యం. అనుభవజ్ఞులైన పైలట్లు నడుపుతున్న ఈ విమానంలో వారు తమకు నిర్దేశించిన ప్రక్రియలను నిర్లక్ష్యం చేయడమన్నది జరగకపోవచ్చును. కానీ, లాకింగ్ సదుపాయం లేని విమానాలు కూడా ఉన్నందున, పైలట్ ప్రమేయం లేకుండా అవి ట్రిప్ అయ్యే అవకాశాల గురించి నివేదిక రేఖామాత్రంగా ప్రస్తావించి ఉంటే బాగుండేది. టేకాఫ్‌లో స్విచ్‌లు కటాఫ్ కావడం, ఇంధనం అందక విమానం జారిపోవడం, క్షణాల్లో పైలట్లు సరిదిద్దినా ఒక ఇంజన్ మాత్రమే పుంజుకోవడం ఇత్యాది వరుస పరిణామాల మధ్య వారిరువురూ ఎంత ఒత్తిడికి గురై ఉంటారో అర్థమవుతూనే ఉంది.

ఇంధన సరఫరా ఎలా నిలిచిపోయిందన్నది పైలట్లకు అర్థంకాలేదని ఆ సంభాషణలో తెలుస్తూనే ఉంది. కానీ, సీవీఆర్ డేటానుంచి, ఈ రెండు వాక్యాలు మాత్రమే నివేదికలో ఉండటం వల్ల తప్పును వారి మీదకు నెట్టివేసి, విమాన నిర్వహణ సంస్థ, తయారీ సంస్థ తప్పించుకో చూస్తున్నాయన్న విమర్శలకు ఆస్కారం కలిగింది. ఈ నెలరోజుల దర్యాప్తులో చాలా విషయాలు తెలిసినప్పటికీ, వాటిని బయటపెట్టకుండా, ఈ నివేదికను ఆన్‌లైన్‌లో ఏ హడావుడీ లేకుండా ఉంచడం వెనుక ఏవో అంతిమ లక్ష్యాలున్నాయన్న అనుమానాలకూ అవకాశం ఏర్పడింది. ఈ పదిహేనుపేజీల నివేదికలోని అంశాలమీద నిపుణులతో వివరణ ఇప్పించే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదు. స్పష్టతను ఇవ్వాల్సిన నివేదిక సామాన్యులు కొన్ని ప్రమాదకరమైన నిర్ధారణలకు వచ్చేట్టుగా చేసింది. రిపోర్టుమీద ఎవరూ సంతకాలు చేయలేదని, మనకంటే ముందు విదేశీమీడియా సంస్థలకు అది అందిందని కూడా అంటున్నారు. ఇంతటి భయానకమైన ప్రమాదాలు జరిగినప్పుడు, వాటిపై జరిగే దర్యాప్తులను ప్రభావితం చేయడానికి అనేక శక్తులు సహజంగానే ప్రయత్నిస్తాయి. కానీ, ఒత్తిళ్ళకు తలొగ్గి కారణాలను కచ్చితంగా నిర్ధారించని పక్షంలో మన పౌరవిమానయాన రంగానికీ, ప్రభుత్వానికీ అప్రదిష్ట కలుగుతుంది. తుదినివేదిక విడుదల కావడానికి ఎన్ని నెలలు పట్టినప్పటికీ, ఈ పుకార్లు, నిందలకూ అది స్వస్తిచెప్పడం అవసరం. అత్యంత నిజాయితీగా ఆ నివేదిక రూపొంది, బాధిత కుటుంబాలవారికి ఉపశమనం కలిగించాలి.

పల్లె భారతిలో నాబార్డ్ ప్రగతి సేద్యం

హరిత విప్లవానంతరం భారత వ్యవసాయ రంగం ఆధునికీకరణ దిశగా ముందడుగు వేస్తున్న సమయంలో, వ్యవసాయానికి అవసరమైన రుణాల కోసం రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడేవారు. అప్పట్లో దేశంలోని బ్యాంకులన్నీ ప్రైవేటు రంగంలో ఉండటంతో, వ్యవసాయ రంగానికి రుణాల వాటా మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థలో ఒక శాతం కంటే కూడా తక్కువగా ఉండేది. ఈ పరిస్థితిని గమనించిన అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ, వ్యవసాయ–గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్న దృక్పథంతో 1969లో 14 పెద్ద బ్యాంకులను, 1980లో మరో ఆరు బ్యాంకులను జాతీయం చేశారు. బ్యాంకుల జాతీయీకరణ తరువాత, వ్యవసాయ–గ్రామీణ రంగాలను ప్రాధాన్య రంగాలుగా గుర్తిస్తూ, మొత్తం బ్యాంక్ రుణాల్లో కనీసం 40 శాతం ఈ రంగాలకు కేటాయించాలన్న నిబంధనను అప్పటి కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. అంతేకాకుండా, గ్రామీణాభివృద్ధికి మరింత బలమిచ్చే ఉద్దేశంతో 1975లో గ్రామీణ బ్యాంకుల వ్యవస్థను ప్రారంభించింది.

భారతదేశంలో వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి రంగాలకు బ్యాంకుల జాతీయీకరణ అనంతరం పెట్టుబడుల కోసం రుణాలు గణనీయంగా పెరిగినా, ఆ రంగాల కోసం ప్రత్యేకంగా సమన్వయం, నియంత్రణ చేపట్టే జాతీయస్థాయి శిఖరాగ్ర బ్యాంకు లేదు. అప్పటి వరకు ఆర్బీఐలోని ప్రత్యేక విభాగం వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన రుణాలు, పెట్టుబడులను సమన్వయం చేస్తున్నది. ఈ లోపాన్ని గుర్తించిన ఇందిరాగాంధీ 1982 జూలై 12న రూ. 100 కోట్ల మూలధనంతో జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (NABARD)ను ముంబయి కేంద్రంగా స్థాపించి, జూలై 15న జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి నాబార్డ్ ప్రస్థానం నానాటికీ విస్తరించి, నేడు 43 సంవత్సరాల ప్రయాణంలో ఒక మహావృక్షంగా రూపాంతరం చెందింది. 2023–24 నాటికి నాబార్డ్ వివిధ రూపాల్లో వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తొమ్మిది లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు, రుణాలు అందించింది. దేశవ్యాప్తంగా విస్తృతంగా సేవలందిస్తోంది.



భారత గ్రామీణ అభివృద్ధి చరిత్రలో నాబార్డ్ ఒక కీలక మైలురాయిగా నిలిచింది. వ్యవసాయ రంగానికి నిధుల సమకూర్పు, మౌలిక వసతుల నిర్మాణం, సహకార సంస్థల పునరుద్ధరణ, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాల్లో నాబార్డ్ పాత్ర ఎంతో అమోఘమైనది.

సహకార సంఘాల అభివృద్ధిలో నాబార్డ్ పాత్ర అసాధారణమైనది. ఈ బ్యాంకు దేశవ్యాప్తంగా సహకార బ్యాంకులకు అవసరమైన రీఫైనాన్స్ నిధులను అందించింది. తద్వారా సహకార బ్యాంకులు ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు... గ్రామీణ రుణాల పంపిణీకి ప్రధాన కేంద్రాలుగా మారాయి. నాబార్డ్ సమర్థమైన పర్యవేక్షణ, ఆర్థిక మద్దతుతో ఈ సహకార సంఘాలు రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు, వితరణ సేవలు, నిల్వ సదుపాయాలు, సబ్సిడీ విధానాలను అమలు చేశాయి. అంతేకాక, స్వయం సహాయక సంఘాల అభివృద్ధిలో నాబార్డ్ పాత్ర అపూర్వం. 1992లో ప్రారంభించిన స్వయం సహాయక సంఘాలను బ్యాంకులకు అనుసంధానించడం ద్వారా గ్రామీణ మహిళలు సమూహాలుగా ఏర్పడి, బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం సుగమమైంది. నాబార్డ్ శిక్షణ, నిధుల మంజూరు, పర్యవేక్షణతో స్వయం సహాయక సంఘాలు స్థిరమైన ఆర్థిక సంఘాలుగా మారాయి.

గ్రామీణ బ్యాంకింగ్‌ను ఆధునికీకరించడంలో నాబార్డ్ కీలకపాత్ర పోషించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 63వేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను డిజిటలైజ్ చేయడం ద్వారా, రుణాల మంజూరు, నిల్వ నిర్వహణ, పంట నష్టపరిహారాల లింకేజీ వంటి సేవలన్నీ పారదర్శకంగా అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఈ సంస్థలు ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందాయి. నాబార్డ్ దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీఓ) ఏర్పాటుకు నిధులు, శిక్షణ, మార్కెట్ లింకేజీలతో సహకారం అందిస్తోంది. మధ్యవర్తులపై ఆధారాన్ని తగ్గించి, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా నాబార్డ్ ఈ రంగంలో మార్గనిర్దేశక పాత్ర పోషిస్తోంది.

1995లో ప్రారంభించిన రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్‌ఐడిఎఫ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో నాబార్డ్ రుణాలు అందించింది. ఈ నిధులతో గ్రామీణ రహదారులు, చెక్‌డ్యామ్‌లు, మార్కెట్ యార్డులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, శీతల గిడ్డంగులు వంటి మౌలిక వసతుల నిర్మాణం వీలైంది. నీటిపారుదల రంగంలో నాబార్డ్ అందించిన రీఫైనాన్స్ వల్ల చిన్న, మధ్యస్థ సాగునీటి ప్రాజెక్టులు అమలులోకి వచ్చాయి. ఇది సాగు విస్తీర్ణం పెరుగుదలకు దోహదం చేసింది. ప్రాంతీయ వ్యవసాయ వ్యాపార ఇన్క్యుబేటర్ కేంద్రాల ద్వారా యువతకు నాబార్డ్ కొత్త అవకాశాలను అందిస్తోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మద్దతుతో ఏర్పడిన ఈ కేంద్రాలు... యువతకు శిక్షణ, మార్గదర్శకత్వం, మార్కెట్ లింకేజీ వంటి అంశాల్లో సహాయపడుతూ, స్వయం ఉపాధి రంగాన్ని అభివృద్ధి చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తున్నాయి.

ఇలా భారత గ్రామీణ అభివృద్ధి చరిత్రలో నాబార్డ్ ఒక కీలక మైలురాయిగా నిలిచింది. వ్యవసాయ రంగానికి నిధుల సమకూర్పు, మౌలిక వసతుల నిర్మాణం, సహకార సంస్థల పునరుద్ధరణ, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాల్లో నాబార్డ్ పాత్ర ఎంతో అమోఘమైనది. గ్రామీణ బ్యాంకింగ్‌ను డిజిటలైజ్ చేస్తూ, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, వ్యవసాయ స్టార్టప్‌లకు తోడ్పాటుతో నాబార్డ్ గ్రామీణ భారత ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తోంది.

• ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
ఉపకులపతి, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

భూభారతితో 'ధరణి' పాపాల ప్రక్షాళన!

మన దగ్గర భూములకు సంబంధించినన్ని సమస్యలు ఇక మరి దేనిలోనూ ఉండవు. ఈ భూ సమస్యలను పరిష్కరించాలంటే, గతంలో ఉన్నవాటి కన్నా మరింత మెరుగైన భూ చట్టాలను తీసుకురావాలి. ఇందుకోసం ఆ రంగంలో నిపుణులు, అనుభవజ్ఞులైన రెవెన్యూ అధికారులతో కమిటీ వేసి వారి నివేదికను అనుసరించి పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టాన్ని రూపొందించాలి. కానీ, కేసీఆర్‌కు ఎవరినీ ఏ విషయంలోనూ సంప్రదించే అలవాటు లేదు. తానే అపర మేధావినని అనుకుంటారు. అలా అనుకొనే తానే ఇంజనీరు అవతారం ఎత్తి కట్టిన కాళేశ్వరం కుప్పకూలింది. అదేవిధంగా తానే రెవెన్యూ నిపుణుడి అవతారం దాల్చి రూపొందించిన ధరణి లక్షలాది రైతులను అవస్థలపాలు చేసింది.

తెలంగాణ భూ హక్కులు, పట్టాదారు పాస్‌పుస్తకాల చట్టం–2020ను అక్టోబర్ 29న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లిలో అట్టహాసంగా ప్రారంభించారు. తెలంగాణ భూ సంస్కరణల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ఈ సందర్భంగా తెచ్చింది. దీని ద్వారా భూములు కొనుక్కోవాలన్నా, అమ్ముకోవాలన్నా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం తెలిపింది. కానీ ఈ పోర్టల్ తప్పుల కారణంగా రైతుల పరిస్థితి పెనం పై నుంచి పొయ్యిలో పడ్డట్లయింది. లక్షలమంది రైతులు భూములు రిజిస్ట్రేషన్లు గాక, రిజిస్ట్రేషన్ల కోసం కట్టిన డబ్బులు వెనక్కి రాక, రెవెన్యూ ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా ఏళ్ల తరబడి తిరిగినా ఆ సమస్యలు పరిష్కారం కాలేదు. ఆర్ఓఆర్–2020లో అప్పీళ్ల వ్యవస్థ లేకపోవడం వల్ల సామాన్యులు సివిల్ కోర్టులపై ఆధారపడాల్సి వచ్చింది. లాయర్లకు ఫీజులు చెల్లించుకోలేక, కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సివిల్ కోర్టులు మొదలు హైకోర్టు దాకా కేవలం ధరణికి సంబంధించి 2 లక్షలకు పైగా కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి.

రైతుల ఈ సమస్యలను చూసి 'తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతా'మని రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో తెలిపారు. చెప్పినట్లుగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ భూభారతిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో సదస్సులు నిర్వహించి గ్రామాల్లో రైతుల భూ సమస్యలను ప్రత్యేక ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాం. భూభారతి అమలులో భాగంగా ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో అప్పీళ్ల ఏర్పాటు చేశాం. దీనితో ఒక స్థాయిలో కాకపోయినా, రెండో స్థాయిలో సమస్యలకు పరిష్కారం లభిస్తున్నది.

ధరణి పోర్టల్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కన్వీనర్‌తో పాటు నలుగురు సభ్యులను నియమించింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్‌కు కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించింది. ఈ కమిటీ అనేక విడతలుగా జిల్లా కలెక్టర్లతో సమావేశమై ధరణిలో వచ్చిన సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారమార్గాలపై నివేదికను సమర్పించింది. దాని ఆధారంగా ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని రూపొందించింది. ఈ ఏడాది ఏప్రిల్ 14న కొత్త నియమ నిబంధనలతో రెవెన్యూ చట్టం భూ భారతి–2025ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.



ధరణి పోర్టల్ కారణంగా లక్షల మంది రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నా ఆ వ్యవస్థను సరిదిద్దడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేయకుండా అంతా బాగుందని కళ్లు మూసుకుని కూర్చున్నది. అందుకే ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీని బండకేసికొట్టారు. ఇన్నాళ్లూ రైతులు ఎదుర్కొన్న భూ సమస్యలన్నింటిని ప్రస్తుతం మా ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా పరిష్కరిస్తున్నది.

రికార్డుల్లో వేల ఎకరాలు భూమి కనిపిస్తోంది. పట్టా పాస్ పుస్తకాలు ఉంటాయి. కానీ క్షేత్ర స్థాయిలో భూమి కనిపించదు. ఒకవేళ ఉన్నా కొండలు, గుట్టలు, పడావు భూములు ఉంటాయి. అవి ప్రభుత్వ భూములా, అటవీ భూములా? అనేవి తెలియని పరిస్థితి ధరణి వల్ల ఏర్పడింది. కొన్ని జిల్లాల్లో రెవెన్యూ సిబ్బంది మూల సర్వే నంబర్లను మార్చి కొత్త విస్తీర్ణాలను రికార్డుల్లోకి ఎక్కించారు. దీనితో వేలమంది అర్హులైన ఖాతాల్లో భూ విస్తీర్ణాలు తగ్గిపోయాయి. దానికి తగినట్లుగా ఇతరుల భూ ఖాతాల్లో భూమి పెరిగిపోయింది. ధరణిని అడ్డం పెట్టుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలోనే అతిపెద్ద కుంభకోణం చేశారు. 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను నిషేధిత జాబితాలో పెట్టి, ఆ తర్వాత వారికి కావాల్సిన వాళ్లకి కట్టబెట్టినట్లు తేలింది. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఇటువంటి సమస్యలపై 1.70లక్షల దరఖాస్తులు వచ్చాయి. నల్గొండ జిల్లాలో అత్యధికంగా 14,803 మంది తమ భూమి ఏమైందో చెప్పాలంటూ దరఖాస్తు చేశారు. తమ భూమి ఖాతాలో సర్వే నెంబర్లు తొలగించారని, వాటిని చేర్చాలని కోరుతున్నారు. సూర్యాపేటలో 8,580 మందికి చెందిన సర్వే నెంబర్లలోని భూమి నమోదు కాలేదు. ఈ విధంగా అన్ని జిల్లాల్లో రైతులు సమస్యల్ని ఎదుర్కొన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు పరిష్కార వేదికలు లేకపోవడం భూ యజమానులకు ఇబ్బందిగా మారింది. ఆర్ఓఆర్–2020 ద్వారా అంతకు ముందు అమలులో ఉన్న రెవెన్యూ కోర్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తొలగించింది. కనీసం సీసీఎల్ఏ స్థాయిలోనూ సమస్యలకు పరిష్కారం కల్పించలేదు. దీనితో పేరు మార్పులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. చట్టాల్లో మార్గదర్శకాలు లేక పార్ట్–బిలో చేర్చిన 11 లక్షల ఎకరాలకు పరిష్కారం లభించలేదు. సాదా బైనామా కింద 12 లక్షల ఎకరాలకు హక్కుల కల్పన సాధ్యం కాలేదు. జిల్లాల్లో రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే కొందరు సిబ్బంది ఇష్టారీతిన డేటా నమోదు చేయటంతో సమస్యలు ఉత్పన్నమైనట్లు దరఖాస్తులను పరిశీలిస్తే తెలుస్తోంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఆర్ఓఆర్–2025 భూ భారతి చట్టంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 17 నుంచి ఏప్రిల్ 30 వరకు రెండవ విడతలో ప్రతి జిల్లాకు ఒక మండలం చొప్పున, జూన్ 3 నుంచి జూన్ 21 వరకు అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. ఆ సదస్సులలో 8.58 లక్షల దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. వాటిలో అధికంగా భూమి హక్కుల కల్పన (ఆర్ఓఆర్)కు సంబంధించినవే ఉండటం గమనార్హం. రైతులు విన్నవించిన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ కార్యాచరణ రూపొందిస్తోంది. భూభారతి చట్టంలో తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలోనే ఎక్కువ సమస్యలు పరిష్కారమయ్యేలా పలు సెక్షన్లు ఏర్పాటు చేశాం. సీసీఎల్ఏ స్థాయిలోనూ పలు ఐచ్ఛికాలు కల్పించాం. దిగువ స్థాయిలో ఏదైనా సమస్య పరిష్కారం కాలేదంటే తిరిగి ఆర్డీఓకు, కలెక్టర్‌కు, సీసీఎల్ఏకు అప్పీల్ చేసుకొనే అవకాశం కల్పించాం. ప్రభుత్వానికి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పెట్టే ప్రక్రియ పూర్తి కావస్తున్నది. భూ భారతి చట్టంలోను, రూల్స్‌లోను తహసీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు ప్రతి సమస్య/ అప్పీల్ పరిష్కారానికి నిర్దేశిత విధానాన్నీ కాల వ్యవధిని నిర్ధారించాం. తద్వారా దరఖాస్తుదారునికి కచ్చితమైన, నాణ్యమైన పరిష్కారం లభిస్తుంది.



గ్రామ రెవెన్యూ అధికారుల వీఆర్ఓ వ్యవస్థను 2020 సెప్టెంబర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. రెవెన్యూ శాఖలో 5657 మంది వీఆర్ఓలు, 22,053 మంది గ్రామ రెవెన్యూ సహాయకులు అప్పటివరకు ఉన్నారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థ అవినీతి మయమైందని, రెవెన్యూ అధికారులందరూ అవినీతి పరులని వారిపై ముద్రవేసి ఆ వ్యవస్థను రద్దు చేయటంతో గ్రామాలలో రెవెన్యూ రికార్డులను చూసే వారే లేకుండా పోయారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థపై కేసీఆర్ మొదటి నుంచి తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. 2017లో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు నేతృత్వంలో వేసిన రహస్య కమిటీ గ్రామస్థాయిలో ఏదో ఒక పేరుతో రెవెన్యూ వ్యవస్థ ఉండాల్సిందేనని నివేదిక ఇచ్చింది. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో అభిప్రాయం తీసుకోగా, మెజారిటీ అధికారులు వీఆర్ఓ వ్యవస్థ ఉండాలని అప్పటి ముఖ్యమంత్రికి విన్నవించారు. అయినా కేసీఆర్ ఎవరి మాట లెక్కచేయకుండా వీఆర్ఓ వ్యవస్థను రద్దు చేశారు. దీనితో రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించాలో అర్థంకాని పరిస్థితి నెలకొన్నది.

మేము ఇప్పుడు భూముల కార్యకలాపాలపై పర్యవేక్షణకు ప్రతీ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ రైతు భూమికి 'భూధార్' సంఖ్యను ఇవ్వాలని యోచిస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో సర్వే వ్యవస్థ క్షీణించింది. ప్రైవేటు లైసెన్స్ ఉన్న వారిని కూడా కలిపితే ఇతర రాష్ట్రాల్లో 10వేల మంది సర్వేయర్లు ఉంటే, మన రాష్ట్రంలో 382మంది మాత్రమే ఉన్నారు. మా ప్రభుత్వం వచ్చాక వెయ్యి మందిని నియమించే ప్రక్రియను ప్రారంభించాం. వీరికి సర్వే ఆఫ్ ఇండియా సంస్థతో 90 రోజులపాటు శిక్షణను ఇప్పిస్తున్నాం. గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేయాలనే లక్ష్యంతో ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామ పరిపాలనాధికారిని నియమిస్తున్నాం.

ధరణి పోర్టల్ కారణంగా లక్షల మంది రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నా ఆ వ్యవస్థను సరిదిద్దడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేయకుండా అంతా బాగుందని కళ్లు మూసుకుని కూర్చున్నది. పైగా, ధరణి వ్యవస్థను రద్దు చేస్తామని కాంగ్రెస్ చెబితే, ధరణి రద్దయితే రైతుబంధు రాదంటూ ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేశారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీని బండకేసికొట్టారు. ఇన్నాళ్లూ రైతులు ఎదుర్కొన్న భూ సమస్యలన్నింటిని ప్రస్తుతం మా ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా పరిష్కరిస్తున్నది.

▪ పొంగులేటి శ్రీనివాసరెడ్డి
తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి

న్యూయార్క్‌లో కొత్త పొద్దుపొడుపు

'ఆ అబ్బాయి గురించి నేను ఆందోళన పడుతున్నాను' అని ఇటీవల భారతీయ అమెరికన్‌ల సమావేశంలో ఒక మాతృమూర్తి కంపిత స్వరంతో అన్నారు. 'అతడు చాలా జాగ్రత్తగా ఉండాలి. మతిస్థిమితం లేని అనేక మంది తుపాకులతో తెగబడుతున్నారు..' అని కూడా ఆమె అన్నారు. ఆ మాతృమూర్తి ప్రస్తావించిన 'అబ్బాయి' ప్రభవిస్తున్న జనాకర్షక యువనేత జోహ్రాన్ ఖ్వామె మమ్దానీ. న్యూయార్క్ నగర మేయర్ ఎన్నిక డెమొక్రాటిక్ పార్టీ ప్రైమరీలలో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచిన దార్శనిక నాయకుడు. అవును, మమ్దానీ గెలుపు విస్మయపరచడమేకాదు, దిగ్భ్రాంతి పరిచింది కూడా. అనూహ్య విజేత మమ్దానీ. ఆయన ప్రత్యర్థులు ప్రభావశీలురు కాకపోవచ్చు కానీ సొంత పార్టీలోనే చాలా మంది విమర్శకులు ఉన్నారు. మమ్దానీ సైద్ధాంతిక విశ్వాసాలను వారు ప్రశ్నిస్తున్న దృష్ట్యా అంతిమ ఎన్నికలో ఆయన విజయం నల్లేరుపై నడక కాదు, కాబోదు. మేయర్ పదవికి డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని గెలుచుకున్న రోజు, మేయర్ ఎన్నిక జరగనున్న నవంబర్ 4, 2025 మధ్య ఏమైనా సంభవించవచ్చు.

అయితే మమ్దానీ యోధుడు. ఆయన సైద్ధాంతిక చిత్తశుద్ధి శక్తిమంతమైన ప్రభావాన్ని నెరపుతోంది. ఆ ప్రభావానికి చాలా మంది ఇప్పటికే లోనయ్యారు. ఇదే ఆయన్ను తన లక్ష్య సాధనలో ముందుకు సాగేందుకు ప్రేరేపిస్తూనే ఉంటుంది. పార్టీ పరాజయాలు, ప్రజల విముఖతతో నిరుత్సాహంలో మునిగిపోయిన యువ డెమొక్రాట్స్‌ను, ప్రగతిశీలవాదులను ఆయన ఉత్తేజపరచడం కొనసాగుతూనే ఉంటుంది. అధ్యక్ష ఎన్నికలలో కమలాహారిస్ ఓడిపోయిన తరువాత డెమొక్రాటిక్ పార్టీ శ్రేణులు తడబడుతున్నాయి. ఆ దయనీయ స్థితి నుంచి వారిని బయటపడవేసేందుకు మమ్దానీ సకల విధాలా ప్రయత్నిస్తున్నారు. మేయర్ పదవికి పార్టీ అభ్యర్థిత్వాన్ని గెలుచుకోవడం అందులో భాగమే. పార్టీ తనపై పెట్టిన బాధ్యతను అంగీకరిస్తూ నెల్సన్ మండేలా స్ఫూర్తిదాయక మాటలను మమ్దానీ ఉటంకించారు: 'ఏదైనా సాధించేంతవరకు అది అసాధ్యంగానే కనిపిస్తుంది'.

జోహ్రాన్ మమ్దానీ సరైన సమయంలో ప్రభవించారు. వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికలు జరగనున్న దృష్ట్యా, న్యూయార్క్ మేయర్ పదవీ ఎన్నిక ఫలితం భావి ఎన్నికల సంభావ్య జయాపజయాలకు ఒక సూచిక అవుతుంది. న్యూయార్క్ నగరం మిగతా అమెరికా కంటే భిన్నమైనది కావచ్చుకాని తమ కొత్త మేయర్‌పై ఈ మహానగర ప్రజల నిర్ణయం భావి ఎన్నికల ఫలితాలకు ఒక సంకేతం అవుతుంది, సందేహం లేదు. జూలై 4, 2026న అమెరికా 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నది. వచ్చే ఏడాదే భారతీయ అమెరికన్లు తమకు విశేషంగా మేలు చేసిన ఒక ప్రముఖ చారిత్రక సంఘటన 80వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగింపు (1945), భారత స్వాతంత్ర్య విజయం (1947) మధ్య సంవత్సరం (1946) లో అధ్యక్షుడు హ్యారీ ట్రూమన్ లూస్–సెల్లర్ చట్టం (దీనినే ఫిలిప్పీన్స్, ఇండియా ఇమ్మిగ్రేషన్ చట్టం అని కూడా అంటారు)పై సంతకం చేశారు. అమెరికాలోని ఫిలిప్పీనీయులు, భారతీయులకు పౌరసత్వ హక్కులు ప్రసాదించడంతో పాటు ఆ రెండు దేశాల నుంచి అమెరికాకు ఏడాదికి 100 మంది చొప్పున వలస రావడానికి ఈ చట్టం అనుమతించింది. అలా వలసవచ్చినవారు సహజసిద్ధంగా అమెరికా పౌరులుగా మారే హక్కును కూడా ఆ చట్టం కల్పించింది. ఈ చట్టానికి ఆమోదాన్ని పొందడంలో వలసదారు క్రియాశీలురు కీలకపాత్ర నిర్వహించారు. ద్వితీయ యుద్ధ ప్రపంచంలో మిత్ర రాజ్యాల విజయానికి ఫిలిప్పీన్స్, భారత్ ప్రజల నుంచి లభించిన సహాయసహకారాలకు గాను ప్రత్యుపకారంగా అమెరికా ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. ఆసియా జనాభాపై వివక్ష చూపుతున్న వలస విధానాలకు స్వస్తి చెప్పేందుకు ఈ చట్టం విశేషంగా దోహదం చేసింది.



ట్రంప్ ప్రభుత్వం వలసదారులను అవమానకరంగా స్వదేశాలకు తరలించివేస్తున్న తరుణంలో న్యూయార్క్ మేయర్ ఎన్నిక ప్రైమరీలలో డెమొక్రాటిక్ పార్టీ విజేత జోహ్రాన్ క్వామే మమ్దానీ ఆ అభాగ్యుల తరపున నిలబడి అమెరికా అధ్యక్షుడికి భయానక దుస్స్వప్నంగా పరిణమించారు. నవంబర్ 4న జరిగే ఈ మేయర్ ఎన్నిక ఫలితం వచ్చే ఏడాది కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలలో రిపబ్లికన్, డెమొక్రాటిక్ పార్టీల జయాపజయాలను సూచించనున్నది. దక్షిణాసియావాసుల అమెరికన్ స్వప్నానికి మమ్దానీ ఒక సంకేతం.

న్యూయార్క్ నగర సమస్యల పరిష్కారానికి మమ్దానీ అనుసరించే 'డెమొక్రాటిక్ సోషలిస్ట్' దృక్పథం ఆచరణీయత, సార్థకతపై మద్దతుదారుల అనుమానాలు ఎలా ఉన్నప్పటికీ ఒకటి మాత్రం వాస్తవం. జోహ్రాన్ మమ్దానీ నిర్భయస్తుడు. ఆయన ఎట్టి పరిస్థితులలోను వలసదారుల హక్కుల పరిరక్షణకు సుస్థిరంగా నిలబడతారు. ట్రంప్ పాలన రెండో హయాంతో వలసదారుల హక్కుల పరిరక్షణకు నిబద్ధమవడమనేది కచ్చితంగా ఎన్నికల ప్రచారంలో ఒక ప్రధాన ఆకర్షణ అవుతుంది. న్యూయార్క్ వాసులలో 60 శాతం మంది వలస దారులు లేదా వారి బిడ్డలే అని 2024లో మేయర్ నివేదిక ఒకటి పేర్కొనడం గమనార్హం. ఈ వాస్తవం దృష్ట్యా వలసదారుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్య మిచ్చిన మమ్దానీ ఎన్నికల ప్రచారం ఓటర్ల హృదయాలను గెలుచుకోవడంలో ఆశ్చర్యమేముంది?

గత తరాలలో వలసదారుల తరపున పోరాడిన వారికి మమ్దానీ సమున్నత వారసుడు. లూస్–సెల్లర్ చట్టం అమలులోకి రావడంలో అనుపమేయ కృషి చేసిన వ్యక్తి జేజే సింగ్. న్యూయార్కర్ మ్యాగజైన్ ఈయన్ని 'వన్ మ్యాన్ లాబీ' (ఒక నిర్దిష్ట సమస్య పరిష్కారానికి ఎవరూ కలిసిరాకున్నా పూర్తిగా సొంత ప్రయత్నాలు, పలుకుబడి ద్వారా కృషి చేసిన వ్యక్తి)గా అభివర్ణించింది. వ్యాపారవేత్త అయిన జేజే సింగ్ 1946లో లూస్–సెల్లర్ బిల్లుపై సంతకం చేసినప్పుడు ఓవల్ ఆఫీసులో ఉన్న ఇద్దరు భారతీయులలో ఒకరు (మరొకరు ఎమ్ఓఏ బైగ్ ఆ తరువాత పాకిస్థాన్ ఎంబసీలో చేరారు). ఆ కాలంలో వలసవాదుల హక్కుల పరిరక్షణకు కృషి చేసిన వారిలో తారక్‌నాథ్ దాస్, ముబారక్ అలీ ముఖ్యులు. ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన మరో ప్రముఖుడు దిలీప్‌సింగ్ సాంధ్ (1899–1973). కేలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందిన సాంధ్, కాంగ్రెస్ దిగువ సభ ప్రతినిధుల సభకు ఎన్నికైన ప్రప్రథమ ఆసియన్ అమెరికన్. 1957 నుంచి వరుసగా రెండుసార్లు ఆయన కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. ఇప్పుడు ప్రతినిధుల సభలో ఆరుగురు భారతీయులు ఉన్నారు. సాంధ్ మాదిరిగా అందరూ డెమొక్రాట్లే.

వర్తమాన అమెరికా సమాజం సాంధ్ కాలం నాటి దానికి చాలా సుదూరమైనదీ, భిన్నమైనదీ అయినప్పటికీ మమ్దానీ లాంటి శ్వేతజాతీయేతర మైనారిటీ అభ్యర్థులకు పూర్తిగా ఈ నాటివైన సమస్యలు, సవాళ్లను విసురుతున్నది. అమెరికాలో నిరంకుశాధికార తత్వం ప్రబలిపోతోన్న పరిస్థితుల్లో కరడుగట్టిన మితవాద రాజకీయ పక్షంగా పరిణమించిన అమెరికా పురాతన రాజకీయ పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ మమ్దానీ లాంటి మైనారిటీ, శ్వేతజాతీయేతర అభ్యర్థులు డెమొక్రాటిక్ పార్టీకి చెందిన వారయితే మరింతగా తీవ్ర విమర్శలకు పాల్పడుతోంది. వారి పట్ల నిస్సిగ్గుగా దుర్నీతితో వ్యవహరిస్తోంది.

'మమ్దానీ అక్రమ వలసదారు అని అనేక మంది చెబుతున్నారు' అంటూ ఆ యువనేత అమెరికా పౌరసత్వ చట్టబద్ధతను ట్రంప్ ప్రశ్నించారు. మమ్దానీ సహజీకరణ (అమెరికా పౌరుడు కాని వ్యక్తి చట్టబద్ధమైన మార్గాల ద్వారా అమెరికా పౌరుడు అయ్యే ప్రక్రియ) ద్వారా అమెరికా పౌరసత్వాన్ని పొందారు. బరాక్ ఒబామా, కమలా హారిస్‌లు అధ్యక్ష పదవికి పోటీపడిన తరుణంలో కూడా వారిపై ట్రంప్ ఇటువంటి తప్పుడు విమర్శలే చేశారు. ఈ మొరటు దాడులు అనూహ్యమైనవి ఏమీకావు. మేయర్ పదవికి పోటీలో మమ్దానీ ఎదుర్కొంటున్న, ఓటర్ల విదేశీ ద్వేష ధోరణులను ముమ్మరం చేస్తాయి. సాంధ్ ఎదుర్కొన్న వివక్షలు, అవరోధాలు తీవ్రమైనవి. అయితే ఆయన ఎన్నడూ 'చంపివేస్తామనే' బెదిరింపులకు గురికాలేదు. తుపాకీ హింసాకాండకు బాధితుడు కాలేదు. ఇప్పుడు అమెరికన్ పౌరులు మొత్తం 500 మిలియన్ (50 కోట్లు) మారణాయుధాలకు యజమానులుగా ఉన్నారు. ఇదే 1950ల్లో ఈ ప్రైవేట్ ఆయుధాల సంఖ్య కేవలం 54 మిలియన్ (5 కోట్ల 40 లక్షలు) మాత్రమేనని ఒక అంచనా. సాంధ్ కాలంలో బ్రౌన్ మైనారిటీ (శ్వేత జాతీయేతరులు కాని అమెరికా పౌరులు. ఆఫ్రికన్– అమెరికన్లను ఈ మైనారిటీ వర్గంలోని వారుగా పరిగణించరు. దక్షిణాసియా, పశ్చిమాసియా, తూర్పు ఆసియా, లాటిన్ అమెరికా దేశాల నుంచి వలస వెళ్లిన వారిని మాత్రమే బ్రౌన్ మైనారిటీగా పరిగణిస్తారు) ప్రజలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. శ్వేతజాతీయులు అభద్రతా భావానికి లోనుకావలసిన పరిస్థితులు ఏ మాత్రం లేవు. అయితే ప్రస్తుత పరిస్థితులు పూర్తిగా భిన్నమైనవి. వలసదారులకు కాకుండా స్థానిక ప్రజలకే అగ్రప్రాధాన్యమివ్వాలనే ధోరణులు, ప్రబలుతోన్న నిరంకుశాధికారతత్వం, రాజకీయ వదరుబోతుతనం దశాబ్దాలుగా ఉన్న పరిస్థితులను పూర్తిగా తలకిందులు చేశాయి.

ఇదొక నిరాశామయ కాలం. 'అమెరికన్ స్వప్నం' (స్వయం కృషితో మెరుగైన, సమున్నత, సంపూర్ణ జీవితాన్ని సాధించుకోవచ్చనే దృఢవిశ్వాసం, ఇందుకు అవకాశాలు లభిస్తాయనే నమ్మకం) 'అమెరికన్ దుస్స్వప్నం' (అమెరికా సమాజంలో అందరికీ సమ అవకాశాలు లభిస్తాయనే విషయమై భ్రమలు తొలగిపోవడం, వ్యక్తిగత శ్రేయస్సును అసాధ్యం చేస్తున్న సామాజిక సమస్యలు ప్రబలిపోవడం)గా మారిపోతోందని పలువురు అంటున్నారు. అయితే మమ్దానీ వెనకడుగు వేయలేదు. తన వైయక్తిక విశ్వాసాలకు ఆయన కట్టుబడి ఉన్నారు. 'ట్రంప్ ప్రకటనలు మన ప్రజాస్వామ్యంపై దాడులు మాత్రమే కాదు, మీ అభిప్రాయాలు ఏమైనప్పటికీ వాటిని గోప్యంగా ఉంచుకోవాలని, వాటిని బహిరంగంగా వ్యక్తం చేస్తే 'వారు' మీ వద్దకు వస్తారనే సందేశాన్ని ప్రతి న్యూయార్క్ ఓటరుకు పంపే ప్రయత్నమని' మమ్దానీ అన్నారు. ట్రంప్ మాటల దాడికి దీటుగా ప్రతిస్పందిస్తూ 'ఇటువంటి బెదిరింపులను మనం ఎట్టి పరిస్థితులలోను అంగీకరించకూడదు. వాటికి భయపడకూడదు' అని మమ్దానీ దృఢంగా అన్నారు.

• మురళి కమ్మ
అట్లాంటాలోని 'ఖబర్' మాసపత్రిక ఎడిటర్
(క్వింట్ సౌజన్యం)



అటకెక్కిన పావలా వడ్డీ

పథకం అమలులో ఉన్నట్టా ? లేనట్టా ?

పావలా వడ్డీ పథకం అమలులో ఉందా ? లేక ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడిందా ? ఏడేళ్లుగా ఈ పథకం ఊసే లేదు. దీని అమలుపై రైతుల్లో అయోమయం నెలకొన్నది. వడ్డీ చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ధనం చెల్లించడం లేదని కేంద్రం కూడా తన వాటా డబ్బులు ఇవ్వడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పంచాయితీ మధ్య రైతులు నలిగిపోతున్నారు. బ్యాంకులు, ప్రాథమిక వ్యసాయ సహకార సంఘాల్లో పంట రుణాలు తీసుకొని నిర్ణీత వ్యవధిలో తిరిగి చెల్లించే రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పావలా వడ్డీ పథకాన్ని అమల్లోకి తెచ్చాయి. ఈ పథకం అమలులో రాష్ట్ర సర్కార్ అనుసరిస్తున్న తీరు రైతులకు శాపంగా మారింది.

- బ్యాంకులకు ఏడేళ్లుగా నిలిచిన వడ్డీ బకాయి చెల్లింపులు
- ఉమ్మడి జిల్లాలో రూ. 805 కోట్లపైనే
- సహకార సంఘాలకు రూ. 187 కోట్లు
- రాష్ట్రం వాటా ధనం ఇవ్వక పోవడంతో కేంద్రం వెనక్కి
- రాష్ట్ర సర్కార్ తీరుతో సహకార సంఘాలకు వడ్డీ భారం
- సకాలంలో రుణాలు చెల్లించినా రైతులకు దక్కని ఫలితం

హనుమకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు ప్రారంభం కావడంతో పంట రుణాలను పునరుద్ధరించుకోవడానికి రైతులు బ్యాంకులబాట పడుతున్నారు. మరో వైపు రుణాలకు పావలా వడ్డీని వర్తింప చేసే విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో బ్యాంకులు తీసుకున్న రుణాలపై వడ్డీ వసూలు చేస్తున్నారు. దీనితో ఉమ్మడి జిల్లా రైతులపై ఏటా రూ. 115 కోట్ల భారం పడుతోంది. రైతులు బ్యాంకు నుంచి పంట రుణం తీసుకున్న రోజు నుంచి ఏడాది లోపు వడ్డీ సహా పూర్తిగా చెల్లిస్తే రూ. లక్ష వరకు పావలా వడ్డీ వర్తింపజేస్తారు. వ్యవసాయ రుణాలకు బ్యాంకులు 7శాతం వడ్డీ వసూలు చేస్తుండగా ఇందులో 3 శాతం కేంద్ర ప్రభుత్వం, 4 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. కేంద్రం 3 శాతం వడ్డీ రాయితీని సక్రమంగా అందిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వడం లేదు. దీంతో బ్యాంకులు, సహకార సంఘాలు రైతుల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ మాఫీ జీవో, నిధులు విడుదల చేయకపోవడంతో తాము వడ్డీ వసూలు చేస్తున్నట్టు బ్యాంకర్లు పేర్కొంటున్నారు.

తెలంగాణ ఏర్పాటయ్యాక..

ఉమ్మడి రాష్ట్రంలో పక్కాగా అమలైన ఈ పథకం తెలంగాణ ఏర్పడిన తర్వాత అడ్రస్ లేకుండా పోయింది. 2014-15 సంవత్సరం వరకు ఈ ఉమ్మడి ప్రక్రియ సజావుగా సాగింది. ఆ తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ధనాన్ని ఎగ్గొట్టడంతో పథకం అమలు అటకెక్కే పరిస్థితి ఏర్పడింది. 2025-16,2016-17 సంవత్సరాలకు సంబంధించి రూ. 415 కోట్ల వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించలేదు. ఈ రెండేళ్లకు సంబంధించిన వాటా ధనాన్ని కేంద్రం చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వం వాటా ధనాన్ని చెల్లించకపోవడంతో మరుసటి ఏడాది (2017-18) నుంచి కేంద్రం కూడా వాటా నిధులు ఇవ్వడం లేదు. దీంతో రాష్ట్రంలో ఏడేళ్లుగా పావలా వడ్డీ పథకం అ మలు కావడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో రూ. 805 కోట్ల మేర వడ్డీ బకాయిలు పేరుకుపోయాయి.

జీరో వడ్డీ అమలూ జీరో..

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పావలా వడ్డీ పథకాన్ని కాస్త జీరో వడ్డీ పథకంగా మారుస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. రైతు చల్లించాల్సిన ఒక శాతం కలిపి మొత్తం 4 శాతం వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని (మిగతా 8వ పేజీలో)

రూ 805 కోట్ల బకాయిలు

ఉమ్మడి జిల్లాలో 9.35 లక్షల మంది రైతులు వానా కాలం, యాసంగి సీజన్లలో రూ. 13,584 కోట్ల పంట రుణాలను రూ. 18,235 సాగు అనుబంధ రుణాలను తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 4శాతం వడ్డీని ముందుగా ఇవ్వకున్నా తదుపరి బ్యాంకులకు రీయింబర్స్‌మెంట్ గానైనా ఇవ్వాల్సి ఉండగా కొన్నేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం ఇవ్వపోవడంతో భారం తమపై పడుతుందని బ్యాంకర్లు రైతల నుంచి అసలు తోపాటు వడ్డీని తీసుకుంటున్నారు. వడ్డీ వసూలుతో జిల్లా రైతులపై ఏటా రూ. 115 కోట్ల అదనపు భారం పడుతోంది. మరో వైపు జిల్లాలోని ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రూ. 187 కోట్ల వరకు రాయితీ సొమ్ము రావలసి ఉంది.

వైద్యవర్గాల్లో విషాదం

- గుండె శస్త్ర చికిత్స నిపుణుడు అల్లాడి సృజన్ భార్య ప్రత్యూష ఆత్మహత్య
- భర్త ఓ మహిళా 'ఇన్‌ఫ్లూయెన్సర్' మోజులో పడటంతో మనస్తాపం
- ఎవరూ లేని సమయంలో ఇంట్లోనే ఉరి
- మృతురాలు దంత వైద్యురాలు
- భార్యాపిల్లలు ఉండగానే వైద్యుడు ప్రవర్తించిన తీరుపై విమర్శలు
- పచ్చని కుటుంబంలో చిచ్చు రేపిన 'ఇన్‌ఫ్లూయెన్సర్'



ఇన్‌ఫ్లూయెన్సర్‌తో మాట్లాడుతున్న వైద్యుడు సృజన్ కుమార్



ప్రత్యూష

వరంగల్ క్రైం/హసన్‌పర్తి/వరంగల్ మెడికల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పచ్చని సంసారంలో ఓ ఇన్‌స్టాగ్రామ్ 'ఇన్‌ఫ్లూయెన్సర్' చిచ్చు రేపింది. భార్యా పిల్లలు వున్న వైద్యుడితో ఆమె కొనసాగించిన సంబంధం నిండు ప్రాణాన్ని బలితీసుకున్నది. తన భర్త 'ఇన్‌ఫ్లూయెన్సర్' మోజులో పడటంతో మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు దంత వైద్యురాలు కాగా, ఆమె భర్త గుండె శస్త్ర చికిత్స నిపుణుడు. ఈ ఘటన వరంగల్ వైద్య వర్గాల్లో కలకలం రేపింది. ఉన్నత విద్యావంతులు, ప్రొఫెషనల్స్‌లో క్షీణిస్తున్న విలువలకు ఈ ఘటన మరోసారి అద్దం పట్టింది.

ములుగు జిల్లా కమలాపూర్‌కు చెందిన అల్లాడి సృజన్‌రెడ్డి కార్డియో థొరాసిక్ సర్జన్. ప్రస్తుతం కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. అలాగే నగరంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో కన్సల్టెంట్‌గా వున్నాడు. ఆయనకు 2017లో హసన్‌పర్తికి చెందిన దంత వైద్యురాలైన ప్రత్యూష(35)తో వివాహం జరిగింది. వీరికి జానూష సృజన్(7), జెస్సికాస్ సృజన్(7 నెలలు) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం హసన్‌పర్తి కాకతీయ వింటేజ్ వెంచర్‌లో నివాసం ఉంటున్నారు. ప్రత్యూష ఎన్ఎస్ఆర్ ఆస్పత్రిలో దంతవైద్యురాలిగా పనిచేస్తోంది. సృజన్ తల్లిదండ్రులు కూడా వారితో కలిసి ఉంటున్నారు. అన్యోన్యంగా, సంతోషంగా సాగుతున్న వీరి జీవితంలో కి ఓ మహిళా 'ఇన్‌ఫ్లూయెన్సర్' ప్రవేశించి చిచ్చు రేపింది. 9 నెలల క్రితం సృజన్‌రెడ్డికి ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్, ప్రమోషన్స్, వీడియోలు చేసే ఇన్‌ఫ్లూయెన్సర్‌తో పరిచయం అయింది. ఆమెకు ఇన్‌స్టాలో దాదాపు 2.33లక్షల ఫాలోవర్లు ఉన్నారు.

డిజిటల్ ప్రమోషన్‌లో భాగంగా ఆమె సృజన్‌రెడ్డితో ఇంటర్వ్యూ కూడా చేసి తన ఇన్‌స్టాలో పోస్టు చేసింది. ఈ క్రమంలో వారి పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. భార్యాపిల్లలను పట్టించుకోకుండా ఎక్కువ సమయం మహిళా 'ఇన్‌ఫ్లూయెన్సర్'తో గడపడం మొదలు పెట్టాడు. ఇది భార్య ప్రత్యూషకు తెలియడంతో ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. ఆమె ప్రశ్నించిన ప్రతీసారి శారీరకంగా వేధించేవాడు. తాను ఆమెనే పెళ్లి చేసుకుంటానని, నీకు విడాకులు ఇస్తానని సృజన్ తన భార్యను బెదిరించేవాడు. భర్తతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న 'ఇన్‌ఫ్లూయెన్సర్' సైతం ప్రత్యూషకు ఫోన్ చేసి బెదిరింపులకు గురిచేసింది. ఈ క్రమంలో మానసికంగా (మిగతా 8వ పేజీలో)

మార్కెట్‌లో కలకలం

అధికారులకు చార్జిమెమోలు.. అడ్తిదారులకు నోటీసులు

వరంగల్ వ్యవసాయం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో ఏడుగురు అడ్తిదారులకు నోటీసులు, అధికారులకు చార్జి మెమోలు జారీ అయ్యాయి. వివరాల్లోకి వెళితే... 2022-23 సంవత్సరంలో పత్తి కొనుగోళ్లలో రైతుల నుంచి ఏడుగురు అడ్తిదారులు అధిక కమీషన్ తీసుకున్నట్లు 14 తక్ పట్టీలతో సహా రైతు సంఘం నాయకులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

దీంతో మార్కెట్‌ను సందర్శించిన విజిలెన్స్ అధికారులు రైతులతో వాగ్మూలం తీసుకుని వెళ్లారు. దీనికి సంబంధించిన ఫైల్‌ను పరిశీలించిన మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ అప్పటి మార్కెట్ కార్యదర్శి వెంకటేశ్ రాహుల్, విశ్రాంత గ్రేడ్2 కార్యదర్శి బియాబానీ, గ్రేడ్2 కార్యదర్శి తోట చందర్‌రావు, అసిస్టెంట్ సెక్రటరీ క్రిష్ణమీనన్, సూపర్‌వైజర్స్ భూక్యా వెంకన్న నాయక్, ఘటాల గంగాధర్, స్వప్నలకు సోమవారం చార్జి మెమోలు జారీ చేశారు. కాగా, అప్పుడు ఇక్కడ పనిచేసిన సూపర్‌వైజర్లకు ప్రస్తుత మార్కెట్ కార్యదర్శులు చార్జి మెమోలు జారీ చేశారు. అదే విధంగా ఏడుగురు అడ్తిదారులకు మార్కెట్ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు.

'ప్రజావాణి' ఫిర్యాదులపై అలక్ష్యం తగదు

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ స్నేహా హెచ్చరిక
- ప్రజల నుంచి స్వయంగా ఫిర్యాదుల స్వీకరణ
- రికార్డుస్థాయిలో 206 వినతులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై అధికారులు దృష్టి పెట్టి సమస్యలు వెంటనే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో వినతులు వచ్చాయి. ప్రజావాణి చరిత్రలోనే 206 సమస్యలు వచ్చాయి. ఉదయం 10:30గంటలకు ప్రారంభమైన ప్రజావాణి 1:30గంటలకు ముగియాల్సి ఉండగా పెద్ద సంఖ్యలో బాధితులు సమస్యలు చెప్పుకోవడానికి రావడంతో 2:30గంటల వరకు ప్రజావాణి కొనసాగింది. కలెక్టర్ స్నేహ శబరీష్ ఓపికగా ప్రజల నుండి సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత అధికారులను పిలిచి బాధితుల సమస్యను ఎంక్వైరీ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు అత్యధికంగా 23 వినతులు రాగా, హనుమకొండ ఆర్డీఓ కార్యాలయానికి 20, హౌసింగ్‌కు 18వినతులు వచ్చాయి. మిగతా వినతులు వివిధ సమస్యలపై వచ్చాయి.

ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ మాట్లాడుతూ వెంటనే ప్రజావాణి తీరును మార్చాలని సంబంధిత అధికారులపై మండిపడ్డారు. గత వారం ప్రజల నుండి వచ్చిన వినతులు పరిష్కరించారా అని ప్రతి ఒక్క అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకుని సమస్య పరిష్కారం చేయని అధికారి తీరుపై మండిపడ్డారు. పోయిన వారం వచ్చిన వినతులు మళ్లీ ప్రజవాణి వారం రోజు వరకు పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బాధితుల నుండి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్నేహ శబరీష్

లాదెళ్ల భూములు కాపాడాలి...

దామెర మండలం లాదెళ్ల గ్రామంలో ప్రభుత్వ భూములు, పాఠశాల స్థలం, దేవాలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని గ్రామ ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో గ్రామానికి చెందిన భీమారపు రాజయ్య అక్రమంగా నిర్మాణాలు చేపట్టి హోటల్ పేరుతో బెల్ట్‌షాపు నడుపుతున్నాడని, గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలనిర్మాణం కోసంపెసరు సూర్యప్రకాశ్ రెడ్డి 1.34గుంటల భూమిని పాఠశాల కోసం భూదానం చేయగా, పక్క రైతులు ఆక్రమించారని, కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ మాదాసు వెంకటేశ్వర్లు, భీమారపు రాజు, జెల్లా ప్రవీణ్ ఫిర్యాదు చేశారు. కాగా, అన్యాక్రాంతం అవుతున్న కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ భూములను కాపాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

నిట్ క్యాంపస్‌కు బాంబు బెదిరింపు

- తనిఖీలు చేసి బాంబు లేదని తేల్చిన పోలీసులు
- ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

కాజీపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నిట్ క్యాంపస్‌లో బాంబు ఉందన్న వార్త క్యాంపస్ వర్గాలను ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురిచేసింది. క్యాంపస్ వర్గాలు , పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిట్ క్యాంపస్ మెయిన్ బిల్డింగ్‌లో బాంబు ఉందంటూ నిట్ క్యాంపస్‌కు సంబంధించిన ఓ వాట్సాప్ గ్రూప్‌లో సోమవారం పోస్టు వచ్చింది. దీంతో క్యాంపస్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న కాజీపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి, బాంబ్ స్క్వాడ్ బృందాలతో క్యాంపస్ మెయిన్ బిల్డింగ్‌లోకి వెళ్లి తనిఖీలు చేశారు. బాంబు లేదని తేలడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఎవరో ఓ ఆకతాయి వాట్సాప్‌లో పోస్టింగ్ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఏ వాట్సాప్ గ్రూప్ నుంచి ఈ పోస్టు వచ్చిందనే విషయాలపై క్యాంపస్ వర్గాలు గోప్యంగా ఉంచుతున్నారు. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ ఎవరు అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

భట్టి వ్యాఖ్యలపై గరం గరం

దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నాయకులు



డిప్యూటీ సీఎం భట్టి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గిర్మాజిపేట(వరంగల్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.రామచందర్‌రావు తగడంటూ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం సాయంత్రం వరంగల్‌లో భట్టి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు పోలేపాక మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో బీజేపీ, ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ వద్ద రోడ్డుపై నిరసన తెలిపారు. డిప్యూటీ సీఎం క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్, ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఆర్.బాబురావు, జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, బీజేపి రాష్ట్ర నాయకులు వన్నాల వెంకట రమణ మాట్లాడుతూ.. సెంట్రల్ వర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య విషయంలో సైతం రామచందర్‌రావుపై ఆరోపణలు చేసిన భట్టి దళిత ద్రోహి అంటూ మండిపడ్డారు. వేముల రోహిత్ దళితుడు కాదన్న కాంగ్రెస్ పార్టీకిఇ స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. నిరసన అనంతరం డిప్యూటీ సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధం అవుతుండగా ఇంతేజార్‌గంజ్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. చివరికి బీజేపీ నాయకులు భట్టి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుసుమ సతీష్, రత్నం సా, రఘునారెడ్డి, రంజిత్, బైరి శ్యామ్, కూచన క్రాంతి, గందె నవీన్, బాకం హరిశంకర్, మధు పాల్గొన్నారు.

ఆలయ భూముల కబ్జా

- లోకాయుక్తలో జరిగిన విచారణ
- హాజరుకాని దేవాదాయ శాఖ డీసీ, ఏసీ

హనుమకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పద్మాక్షి, సిద్దేశ్వరాలయం భూముల కబ్జాపై లోకాయుక్తలో సోమవారం విచారణ జరిగింది. ఈ విచారణకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ హాజరు కాలేదు. వరంగల్ వేణుగోపాల స్వామి ఆలయ ఈవో రత్నాకర్ రెడ్డి హాజరయ్యారు. ఫిర్యాదుదారుడు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి హాజరై లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డికి ఫిర్యాదులోని వివరాలను అందచేశారు. గతంలో లోకాయుక్త ఆదేశాల మేరకు నిర్వహించిన సర్వే ప్రకారం అసిస్టెంట్ కమిషనర్ 2023 మే 31న లోకాయుక్తకు ఇచ్చిన రిపోర్టులో పద్మాక్షి దేవాలయానికి సంబంధించిన సర్వే నెంబర్ 890,890/బిలో 2.5 ఎకరాల భూమి కబ్జా జరిగిందనీ, ఈ భూమిలోని అక్రమ నిర్మాణాలను తొలగించడంలో గత రెండు సంవత్సరాలుగా అధికారులు కాలాయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. దీనితో ఆలయ భూమి మరింత కబ్జా జరుగుతోందని తెలిపారు. దేవాదాయ శాఖ భూమిలో అక్రమ నిర్మాణాలకు మునిసిపాలిటీ ఇచ్చిన అనుమతులు, ఇంటినెంబర్లను రద్దు చేయాలని కోరారు. అలాగే సర్వేనెంబర్‌లు 918,922,898,877లలో సర్వే పూర్తి చేసేలా ఆదేశించాలని కూడా లోకాయుక్తను అభ్యర్థించారు. ఫిర్యాదును లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి తదుపరి విచారణను వచ్చే నెల 8వ తేదీకి వాయిదా వేసారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు తదుపరి వాయిదాకు తప్పనిసరిగా హాజరుకావాలని, ఇదే విషయాన్ని దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శికి తెలుపాలని ఆదేశించారు.



నల్లబెల్లిలో యూరియా గోదాం వద్ద విచారణ చేస్తున్న అధికారులు

యూరియా నిల్వలు.. రైతుల అవస్థలు

ఫర్టిలైజర్ షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు

నల్లబెల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను, గోదాంలను ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఏవో రజిత, ఎస్సై గోవర్ధన్‌లు సోమవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని కర్ర మల్లారెడ్డి ఫర్టిలైజర్ షాపులో రిజిస్టర్‌ను ఏడీఏ పరిశీలించారు. అనంతరం గోదాం వద్దకు వెళ్లి పరిశీలించారు. గోదాంలో 1286 యూరియా బస్తాలను నిల్వ ఉంచినందున ఫర్టిలైజర్ షాపు యజమాని కర్ర కృష్ణరెడ్డిపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలియజేశారు. రైతులకు యూరియాను అమ్మకుండా గోదాంల్లో నిల్వ ఉంచే ఫర్టిలైజర్ షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ తెలిపారు. డీలర్లు యూరియాను రైతులకు అమ్మకుండా నిల్వ ఉంచుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారని రైతులు నిలదీశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి రంగంలోకి దిగి నల్లబెల్లిలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను రైతులకు ఇప్పించాలని రైతులు కోరారు.

మృతికి కారణమైన ఆరుగురిపై కేసు నమోదు

- ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితులు
- మిస్టరీని ఛేదించిన పోలీసులు

ఎల్కతుర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యుతాఘాతానికి గురై మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని వ్యవసాయ బావిలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించబోయిన నిందితులు పోలీసుల దర్యాప్తుతో పట్టుబడ్డారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గండికోట సాంబరాజు (32), అదే గ్రామానికి చెందిన శీలం బాలరాజు, ఊదరి రాజులు కలిసి శనివారం అర్ధరాత్రి గ్రామ శివారులోని వచ్చునూరి ప్రవీణ్ పొలం వైపు పావురాల శిఖారుకు వెళ్లారు. అప్పటికే అక్కడ అడవి పందుల కోసం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి చందర్‌రావు ప్రోద్బలంతో అదే గ్రామానికి చెందిన పెండ్యాల తిరుపతి, ఎల్కతుర్తికి చెందిన బొజ్జ స్వామి, బొజ్జ సతీష్‌లు అడవి పందులను సంహరించడానికి వచ్చునూరి ప్రవీణ్ పొలంలో ఉన్న విద్యుత్ పోలు నుంచి తక్కళ్లపెల్లి నర్సింగారావు చేను వరకు విద్యుత్ సరఫరాతో కూడిన వైర్లను అమర్చారు. అక్కడ అమర్చిన వైర్లను గమనించని సాంబరాజు విద్యుత్ వైర్లకు తగులగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆ సమయంలో వెంట ఉన్న ఉన్న శీలం బాలరాజు, ఊదరి రాజులు విషయాన్ని గమనించి అక్కడినుంచి పారిపోయారు. ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ వైర్లు అమర్చిన పెండ్యాల తిరుపతి, బొజ్జ స్వామి, బొజ్జ సతీష్‌లు నేరం తమపైకి రాకుండా ఉండేందుకు మృతదేహాన్ని పక్కనే ఉన్న గ్రామ మాజీ సర్పంచ్ మాసిపెద్ది భాస్కర్‌రావు వ్యవసాయ బావిలో పడేసి ప్రమాదానికి కారణమైన ఆనవాళ్లను తొలగించి గుట్టు చప్పుడు కాకుండా ఇంటికి చేరుకున్నారు. ఉదయం మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ మృత దేహాన్ని బావిలోంచి బయటకు తీసి శవ పంచనామ నిర్వహించారు.

దీంతో మృతుడి కాలికి విద్యుత్ షాకు తగిలి ఏర్పడిన గాయాన్ని గుర్తించి దర్యాప్తును వేగవంతం చేశారు. మృతికి కారణమైన తక్కళ్లపెల్లి చందర్‌రావు, పెండ్యాల తిరుపతి, బొజ్జ స్వామి, బొజ్జ సతీష్, శీలం బాలరాజు, ఊదరి రాజులను గుర్తించి మిస్టరీని ఛేదించారు. అనంతరం మృతురాలి భార్య మమత ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితులు పరారీలో ఉండగా ప్రత్యేక పోలీస్ బృందంచే గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. అలాగే మృతుని బంధువులు నిందితుల ఇంటి వద్ద ఆందోళన చేసే పరిస్థితులు ఉండటంతో గోపాల్‌పూర్ గ్రామంలో సీఐ పులి రమేష్ ఆదేశాల మేరకు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

వైద్య కళాశాలలో నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి 19 వరకు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు-9, అసోసియేట్ ప్రొఫెసర్-16, అసిస్టెంట్ ప్రొఫెసర్-21, సీనియర్ రెసిడెంట్-36, ట్యూటర్స్ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

అధునాతన సౌకర్యాలతో కార్యాలయాలు

ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు

మహాముత్తారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అధునాతన సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మించి ప్రజలకు ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలో ఎంపీడీవో, పీఏసీఎస్ నూతన కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. రూ. కోటి 20లక్షలతో ఎంపీడీవో భవనాన్ని నిర్మించగా, రూ. 73లక్షల 50వేలతో పీఏసీఎస్ భవనాన్ని నిర్మించారు. వీటిని మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో, పీఏసీఎస్ కార్యాలయాలకు అధునాతన సౌకర్యాలతో భవనాలను నిర్మించామని, దీంతో పరిపాలన సౌలభ్యం మెరుగుపడుతుందని అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు సమర్థంగా అమలయ్యేలా కృషి చేయాలన్నారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. కలెక్టర్ రాహుల్ శర్మ, కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీసీవో వాలియ నాయక్, పీఆర్ ఎస్ఈ చక్రవర్తి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ డి.శ్రీనివాస్, ఎఫ్ఆర్వోలు రాజేశ్వర్, రమేష్, పీఏసీఎస్ సీఈవో శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహాముత్తారం ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో గివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సౌజన్యంతో 650 మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పాఠశాలలను బలోపేతం చేసేందుకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. ప్రతి నియోజవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని, టీచర్ల కొరత లేకుండా నోటిఫికేషన్ వేసి పోస్టులు భర్తీ చేస్తున్నారని అన్నారు. మహదేవపూర్ పాఠశాలకు మంచి చరిత్ర కలిగి ఉందని, దీన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.15 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దీనికి ముందు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, గివ్ ఫౌండేషన్ ప్రతినిధి అరుణ్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, మధు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

- వెంకటేశ్వర్లపల్లిలో ఘటన

చిలుపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో బీహార్‌కు చెందిన కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన సోమవారం వెంకటేశ్వర్లపల్లిలో చోటు చేసుకుంది. జనగామ రూరల్ సీఐ (రఘునాథపల్లి) ఎడవెళ్లి శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. బీహార్ రాష్ట్రంలోని బాగులబడికి చెందిన అర్షద్ ఆలీ(25) వెంకటేశ్వర్లపల్లిలో హైటెన్షన్ విద్యుత్ స్థంభాల నిర్మాణానికి సంబంధించి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వైర్లు లాగడం కోసం సమీపంలో ఉన్న విద్యుత్ పోల్ పైకెక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు.

సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీ ఎంకు తరలించారు. కాగా, ఆ సమయంలో మల్లికుదుర్ల నుంచి వెంకటేశ్వర్లపల్లికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మృతదేహాన్ని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.

త్వరలో ముఖ గుర్తింపు హాజరు

కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడి

కేయూ క్యాంపస్ జూలై 14, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పనిచేసే ఉద్యోగులందరికీ త్వరలోనే ముఖగుర్తింపు హాజరును తెస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లతో కలిసి కాన్వకేషన్ సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి పలు కీలక అంశాలను వెల్లడించారు. వచ్చే నెలలో ఉద్యోగులందరికీ ముఖగుర్తింపు హాజరు అమలు చేస్తామని, హ్యాక్‌థాన్ నిర్వహిస్తామని తెలిపారు. క్యాంపస్‌లో వైఫై సౌకర్యాలను మరింత సమర్థవంతంగా వచ్చేలా చేస్తామని, మౌలిక వసతులను కల్పిస్తామని స్పష్టం చేశారు. యూజీ కోర్సుల్లోనూ ఆన్‌స్క్రీన్ కంప్యూటరైజ్డ్ మూల్యాంకనం చేపడుతామని అన్నారు. క్యాంపస్‌లోని 14 సెమినార్ హాళ్లను అధునీకరిస్తామని ప్రకటించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ ప్రోగ్రాంను సక్సెస్ చేసుకుందామని చెప్పారు. కె-హాబ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుందామని అన్నారు. కాకతీయ యూనివర్సిటీ వరంగల్ చానల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెబ్‌సైట్ ఇన్‌చార్జి డాక్టర్ రమేశ్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, డీన్లు ప్రొఫెసర్‌గాదె సమ్మయ్య, హన్మంతు, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల ఎదుట మావోయిస్టుల లొంగుబాటు

ములుగు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఐదుగురు మావోయిస్టులు ములుగు ఎస్పీ శబరీశ్ ఎదుట సోమవారం లొంగిపోయారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన ఏరియా కమిటీ సభ్యుడు శ్యామల రాజేష్ అలియాస్ ఐత (22), అదే ఏరియాకు చెందిన సభ్యులు కద్తిల్‌దుమా (20), బీజాపూర్ జిల్లాకు చెందిన ఊకె జోగి (18), బాడిషె భీమా (21), ముచాకి జోగి (16) ఉన్నారని వివరించారు. ములుగు జిల్లా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు సంయుక్తంగా చేపట్టిన 'పోరుకన్నా.. ఊరుమిన్న', 'మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఎస్పీ అన్నారు. పోలీసు శాఖ కల్పిస్తున్న పునరావాస సదుపాయాలు నచ్చి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

వివిధ కేడర్లలో పనిచేసిన 73 మంది మావోయిస్టులు ఏడు నెలల కాలంలో పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలిపారు. అధినాయకత్వ తీరు నచ్చక కిందిస్థాయి కేడర్ అజ్ఞాత వాసాన్ని వీడవి శాంతియుత జీవితం గడపడానికి లొంగిపోతున్నారని తెలిపారు. ఆదివాసీ గ్రామాల ప్రజలు మావోయిస్టులకు సహకరించకపోవడంతో ఆహార పానీయాలు అందక కేడర్ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లలేనంతగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. 90శాతానికి పైగా కేడర్ నిరుపేద ఆదివాసీలన్నారు. కుటుంబాల అభివృద్ధి కోసం చాలా మంది పార్టీని వీడుతున్నారన్నారు. ఇది శుభ పరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి పట్ల నిబద్ధతను కలిగి ఉందని తెలిపారు. సోమవారం లొంగిపోయిన ఐదుగురు మావోయిస్టులకు తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున రూ. 1.25 లక్షలు అందించామన్నారు. వారి పేరుపై ఉన్న రివార్డులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివంఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



లొంగిపోయిన మావోయిస్టుకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

- నానమ్మ మెడలో నుంచి బంగారు నగ చోరీ చేసిన మనవళ్లు
- నిందితుల్లో ఒక బాలుడు
- ఆభరణం రికవరీ, బైక్ స్వాధీనం

జఫర్‌గఢ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నానమ్మ మెడలో నుంచి బంగారు ఆభరణాన్ని దొంగిలించిన ఇద్దరిని (ఒకరు మైనర్) పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. జఫర్‌గఢ్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ బానోత్ రాంచరణ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్ధన్నపేట సీఐ కె.శ్రీనివాసరావు ఘటనా వివరాలను వెల్లడించారు. ఓబులాపూర్‌కు చెందిన చీపురు యాకస్వామి బతుకు దెరువు కోసం భార్యా పిల్లలతో కలిసి కొన్నేళ్లుగా హైద్రాబాద్‌లోని చర్లపల్లిలో ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇతడి తల్లి వృద్ధురాలైన సులోచన ఓబులాపూర్‌లోని సొంత ఇంటిలో ఉంటోంది. యాకస్వామి పెద్ద కుమారుడు అఖిల్ జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటు పడ్డాడు. తన నానమ్మ మెడలోని బంగారు గోపి తాడుపై కన్నేసి బాలుడైన తమ్ముడిని వెంటపెట్టుకుని ఈనెల 11న తెల్లవారుజామున బైక్‌పై అఖిల్ ఓబులాపూర్‌కు చేరుకున్నాడు.

నిద్రిస్తున్న నానమ్మ సులోచన మెడలో నుంచి 30గ్రాముల గోపి తాడును అన్నదమ్ములు బలవంతంగా తెంపుకుని పారిపోతుండగా వృద్ధురాలు మేల్కొని గట్టిగా కేకలు వేసింది. దీంతో ఆమెను నెట్టివేసి బైక్‌పై పారిపోతూ ఇదే మండలం తమ్మడపల్లి (జి) క్రాస్ వద్ద గల చెట్లపొదల్లో బంగారు నగను దాచి చర్లపల్లికి వెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో దాచిన బంగారు గోపితాడును సోమవారం నిందితులైన యాకస్వామి, బాలుడు వచ్చి తీసుకుని బైక్‌పై వెళతుండగా జఫర్‌గఢ్ క్రాస్ నల్లబండ వద్ద పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి దొంగిలించిన 30 గ్రాముల గోపి తాడును, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అఖిల్‌పై పలు పోలీసు స్టేషన్లలో నాలుగు దొంగతనాల కేసులు ఉన్నాయన్నారు. దర్యాప్తులో ప్రతిభ కనబరిచి నిందితులను చాకచక్యంగా పట్టుకుని ఆభరణాన్ని రికవరీ చేసిన జఫర్‌గఢ్ ఎస్ఐ రాంచరణ్‌నాయక్, పోలీసు సిబ్బందిని వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం అభినందించారు.



నిందితుడిని అరెస్ట్ చేసి, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాన్ని చూపుతున్న వర్ధన్నపేట పోలీసులు

వాకింగ్ చేస్తుండగా విద్యార్థికి పిట్స్

- గ్రౌండ్‌లో కిందపడిపోవడంతో ఆస్పత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ ఎంజీఎంలో మృతి
- మృతుడు ఇంటర్ విద్యార్థి





మృతి చెందిన విద్యార్థి మణితేజ, కరుణాపురం జ్యోతిబాపూలే పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు

ధర్మసాగర్ , జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తోటి విద్యార్థులందరితో కలిసి మెలసి ఉంటూ వాకింగ్ చేస్తుండగా ఓ విద్యార్థికి పిట్స్ వచ్చి కిందపడిపోయాడు. పాఠశాల ఉపాధ్యాయులు పరిశీలించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన స్టేషన్‌ఘపూర్ మహాత్మాజ్యోతి బాపూ లే రెసిడెన్షియల్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక విద్యార్థులు తెలిపిన కథనం ప్రకారం. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన మహాత్మజ్యోతి బాపూలే రెసిడెన్షియల్ బాలుర సంక్షేమ పాఠశాల, కళాశాలను ఘన్‌పూర్‌లో సరైన వసతులు లేకపోవడంతో గత కొన్నేళ్ల క్రితం ధర్మసాగర్ మండలం కరుణాపురానికి తరలించారు. పదోతరగతి నుంచి ఇంటర్ వరకు 700 మంది విద్యార్థులతో పాఠశాల కొనసాగుతోంది. సోమవారం ఉదయం 6.45 గంటల సమయంలో పాఠశాలలోని విద్యార్థులందరూ పాఠశాల సమీపంలోని గ్రౌండ్‌లో రోజువారీగా వాకింగ్ చేస్తున్నారు.

ఈ క్రమంలో శాయంపేట మండలం ప్రగతి సింగరం గ్రామానికి చెందిన బత్తిని కుమారస్వామి విశాల దంపతులు కుమారుడు మణి తేజ(17) అనే విద్యార్థి ఇంటర్ సెకండియర్ ఎంపీసీ చదువుతున్నాడు. రోజువారిగా గ్రౌండ్‌లో వాకింగ్ మొదటి రౌండ్ పూర్తి చేసి, రెండవ రౌండ్ నడుస్తున్న క్రమంలో మణితేజకు ఆకస్మాత్తుగా పిట్స్ వచ్చి కిందపడ్డాడు. దీంతో ఆందోళనకు గురైన విద్యార్థులతో పాటు అక్కడే ఉన్న పీఈటీలు ఎం.రాజు, టి.రాజు ఇద్దరు కలిసి మణితేజను తమ ద్విచక్రవాహనంపై కొంత దూరంలో ఉన్న ప్రధాన రోడ్డు మీదికి తీసుకెళ్లారు. వెంటనే 108.కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మణి తేజ మృతి చెందాడు. పాఠశాల నుంచి తల్లి విశాలకు,తండ్రి కుమారస్వామికి మణితేజకు పిట్స్‌వచ్చిందని సమాచారాన్ని అం దించారు. కుటుంబసభ్యులు ఎంజీఎంకు వచ్చి మణితేజను చూసేసరికి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. దీంతో వారి రోదనలు మిన్నంటాయి. సీఐ ప్రవీ ణ్ కుమార్ పాఠశాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహోపకరణాల దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్ పూర్‌లో సెలెక్ట్ మొబైల్ ఎదురుగా ఉన్న 33కేవీ లైన్ తీగలు ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కావడంతో మూడు ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. దీంతో రూ.2లక్షల దాక ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. మహాలక్ష్మి బేకరి వద్ద ఉన్న 33 కేవీ లైన్ తీగల్ని కాకులు తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరిగిందని ఇంటి యజమాని ప్రతాపగిరి సుగుణ వాపోయింది. దీంతో ఇంటిలోని స్మార్ట్ టీవీ, సీసీ కెమెరాలు, ఫ్రిడ్జి, వైరింగ్, స్విచ్‌లు కాలిపోయాయి. అలాగే బాలాజీ క్లాత్ స్టోర్‌లో సర్వీస్ వైరు, రవళి కంగన్ హాల్‌లో టీవీ కాలిపోయిందని మొత్తంగా రూ.2 లక్షల వరక ఆస్తినష్టం వాటిల్లినట్టు పేర్కొంది. ఇదే లైన్‌తో మే 20న కె.కృష్ణకుమారి ఇంటిపై పిడుగు పడి ఇంట్లోని విద్యుత్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయి రూ.1.5 లక్షల దాక నష్టం వాటిల్లింది. ఇదే ఇంటిలో 2022లో, 2023లో వర్షాకాలంలో పిడుగు పడి వస్తువులు కాలిపోయాయి. జనావాసాల నడుమ ఉన్న 33కేవీ లైన్‌ను మార్చాలని లేదా బేకరి వద్ద టవర్ వేసారని, ఆ తర్వాత టవర్ వేయక పోవడం వల్ల లైన్ తీగలు కిందకు ఉండడం వల్ల కూడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బాధితులు చెబుతున్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు గుంజె హన్మంతు మృతి

నివాళులర్పించిన జేఏసీ, వివిధ పార్టీలు, సంఘాల నేతలు



హన్మంతు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణానికి చెందిన తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు గుంజె హన్మంతు(86) ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. తన స్వగృహంలో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం. కాగా, గుంజె హన్మంతు తెలంగాణ రాష్ట్ర తొలి, మలి దశ ఉద్యమాలతో పాటు జిల్లా ఏర్పాటు, కుల, సామాజిక, సాంస్కృతిక, ప్రజా ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. స్వరాష్ట్ర ఉద్యమంలో కేసులపాలై జైలు జీవితం కూడా గడిపారు. తన వయసు మళ్లినప్పటికి తుది శ్వాస విడిచేంతవరకు ప్రజా ఉద్యమాల్లో చురుకుగ్గా పాల్గొన్నారు. గుంజె హన్మంతు మృతి వార్త తెలుసుకున్న జేఏసీ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ, నేతలు ఎమ్డీ.ఫరీద్, పిల్లి సుధాకర్, శంతన్‌రామరాజు, గుగ్గిళ్ల పీరయ్య, కొండ్ర ఎల్లయ్య, సామ పాపయ్య, కమ్మగాని కృష్ణమూర్తి, ఇ.ఉప్పలయ్య, కంబాలపల్లి సత్యనారాయణ, బోడ లక్ష్మణ్, ఎమ్మెల్యే మురళీనాయక్ సతీమణి ఉమ, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, బి.విజయసారథి, బి.అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, పద్మం ప్రవీన్, హరిసింగ్, మార్నేని రఘు, మామిడాల సత్యనారాయణ, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, నారోజు సత్యమనోరమ, నారాయణసింగ్ తదితరులు పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో హన్మంతు భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. కాగా, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఫోన్‌లో హన్మంతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మానుకోట మాజీ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు.

అమరవీరుల స్థూపం వద్ద నివాళులు..

మహబూబాబాద్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ నుంచి సిగ్నల్ కాలనీలోని శ్మశానవాటిక వరకు ఉద్యమకారుడు గుంజె హన్మంతు అంతిమ యాత్ర కొనసాగింది. ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద గుంజె హన్మంతు మృతదేహంతో తెలంగాణ ఉద్యమకారులు నివాళులర్పించి మౌనం పాటించారు. కళాకారులు పాటలు పాడి హన్మంతు పోరాట స్మృతులను స్మరించుకున్నారు. అక్కడి నుంచి సిగ్నల్ కాలనీ శ్మశాన వాటిక వద్దకు తీసుకుని వెళ్లి క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ పూర్వ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ.. గుంజె హన్మంతు అకాల మృతి సామాజిక ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2405	1521
పల్లికాయ (సూక)	5800	3450
పల్లికాయ (పచ్చిది)	4350	1575
కందులు	6122	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7500	5300
పసుపు (కాడి)	11920	9534
పసుపు (గోల)	10309	9700
తేజ మిర్చి	9500	8500
తేజ ఏసీ	13000	11500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	12200	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఇందిరమ్మ ఇళ్లకు ధరాఘాతం

దేవరుప్పుల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సొంతింటి కల నెరవేరుతుందన్న ఆనందంకంటే, నిర్మాణ భారం పెరుగుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. నిర్మాణ సామగ్రి, కూలి రేట్లు పెరగడంతో లబ్ధిదారులకు ఆర్థిక భారం తప్పడం లేదు. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు సరిపోవడం లేదని వాపోతున్నారు. చేసేది లేక కొందరు అప్పు చేస్తుంటే, మరి కొందరు బంగారం తాకట్టు పెడుతున్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షలతో నివసించేందుకు సరిపడేలా ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకొవచ్చని, అదనపు వసతుల పేరుతో అప్పులపాలు కావద్దని పేర్కొంటున్నారు.

- పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు
- సిమెంట్, స్టీల్‌ది అదే దారి
- సమస్యగా మారిన కూలీల కొరత
- లబ్ధిదారులపై ఆర్థిక భారం

పెరిగిన ధరలు ఇలా..

సామగ్రి	పాత ధర	కొత్తధర
ట్రాక్టర్ రాయి	రూ.2,000	రూ. 2,500
ట్రాక్టర్ దొడ్డు కంకర	రూ.2,000	రూ.2,500
ట్రాక్టర్ సన్న కంకర	రూ.3,700	రూ.4,500
స్టీల్ కేజీ	రూ.48	రూ. 55
సిమెంట్ బస్తా	రూ.300	రూ. 380
ట్రాక్టర్ ఇసుక	రూ.2,000	రూ. 4,000
ఇటుక ఒకటి	రూ.12	రూ. 14
లేబర్ (రోజుకు)	రూ.600	రూ. 800
తాపీమేస్త్రీ (రోజుకు)	రూ.900	రూ.1,200
బిల్డర్స్ స్క్వేర్ ఫీట్	రూ.1,600	రూ.1,650

పెరిగిన ధరలు

ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభమైన నాటి నుంచి నిర్మాణ సామగ్రి, తాపీమేస్త్రీ, లేబర్ కూలి ధరలు అమాంతం పెరిగాయి. ఖరీఫ్ సీజన్ కావడంతో కూలీల కొరత ఏర్పడుతోంది.

పత్తి కలుపు తీయడానికి, ఇతర వ్యవసాయ కూలి పనులకు వెళ్తున్నారు. బీహార్ నుంచి వలస వచ్చిన తాపీమేస్త్రీ, కూలీలు కూడా వర్షాకాలం కావడంతో పాటు అక్కడ ఎన్నికల నేపథ్యంలో కొంత మంది ఇప్పటికే స్వగ్రామాలకు వెళ్లిపోయారు. ఒప్పుకున్న సమయానికి ఇల్లు నిర్మించి ఇచ్చే విషయంలో కూలీల కొరతతో బిల్డర్లు తంటాలు పడుతున్నారు.



సీతారాంపురంలో పిల్లర్ల దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

ఇసుక పాలసీ ఇలా..

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో అది సాధ్యమవడం లేదు. ఉచిత ఇసుక అనగానే ఇంటికి సరిపడా ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని లబ్ధిదారులంతా భావించారు. అందుబాటులో ఉన్న వాగుల నుంచి ఇసుకను ఉచితంగా తెచ్చుకునేందుకు ట్రాక్టర్ల కిరాయి ఖర్చులు అధికమవుతున్నాయి. వాగు పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలకు రూ. 2వేలు, మండల పరిధిలోని కొన్ని దూరపు గ్రామాలకు రూ.4వేలు, ఇతర మండలాలలోని గ్రామాలకు రూ. 6వేలు చొప్పున ట్రాక్టర్ ఇసుకను విక్రయిస్తున్నారు. 400ఫీట్ల ఇంటి నిర్మాణానికి 6 ట్రిప్పులు, 500ఫీట్ల ఇంటి నిర్మాణానికి 9ట్రిప్పులు, 600ఫీట్ల ఇంటి నిర్మాణానికి 12ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక రవాణాకు స్థానిక తహసీల్దార్ కార్యాలయాలు అనుమతులు ఇస్తున్నాయి. దీంతో ఇసుక భారం తప్పడం లేదు.

తప్పని అప్పు

లబ్ధిదారుల్లో మెజారిటీ పేదలే ఉన్నారు. కొద్దిమంది మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. 400-600 ఫీట్లలోపే ఇందిరమ్మ ఇంటిని నిర్మించాలని నిబంధనలు స్పష్టం చేస్తుండగా, ప్రభుత్వం ఇస్తున్న రూ.5లక్షలకు మరింత జోడిస్తే ఇంకాస్త సౌకర్యంగా నిర్మించుకోవచ్చని ఆశపడుతున్నారు. దీంతో బంగారాన్ని బ్యాంకులు, ఇతర ప్రైవేటు సంస్థల్లో తాకట్టు పెడుతున్నారు. కొందరు అధిక వడ్డీతో అప్పు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలకు అదనంగా రూ.4 లక్షల నుంచి రూ.7లక్షల వరకు అదనంగా ఖర్చు అవుతోందని తెలుస్తోంది.

అప్పు చేయక తప్పడం లేదు
బస్వ అనసూర్య, లబ్ధిదారు, సీతారాంపురం



ప్రభుత్వం ఇల్లు నిర్మాణం కోసం రూ.5 లక్షలు కేటాయించినా సరిపోవడం లేదు. ఇంకో ఐదారు లక్షల వరకు అప్పు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే అప్పు తెచ్చాం. పాత పెంకుటిల్లుతో చాలా ఇబ్బందులు పడ్డాం. కోతులు పెంకులు పీకడంతో వర్షాకాలంలో ఇళ్లంతా కురిసేది. పెంకుటిళ్లు కూలగొట్టి స్లాబ్ వేసుకుంటున్నాం. కానీ ఖర్చులు పెరుగుతున్నాయి.

నిబంధనల ప్రకారమే ఇల్లు నిర్మించుకోవాలి
సురేష్‌కుమార్, ఎంపీడీవో, దేవరుప్పుల



ప్రభుత్వ నిబంధన ప్రకారమే ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవాలి. 400-420 స్క్వేర్ ఫీట్స్‌లో ఇల్లు పిల్లర్లు లేకుండా కట్టుకుంటే ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు సరిపోతాయి. అదనపు వసతుల కోసం హంగులు, ఆర్భాటాలకు పోయి 600 స్క్వేర్ ఫీట్స్ వరకు ఇల్లు నిర్మించుకుని రూ.10లక్షల నుంచి రూ.12 లక్షలు ఖర్చు చేసి అప్పులపాలు కావద్దు. ముగ్గు పోసుకునే ముందు మా కార్యదర్శులకు సమాచారం ఇస్తే రూ. 5లక్షల వ్యయంతో 400స్క్వేర్ ఫీట్స్ వరకు దగ్గరుండి పోయిస్తారు.



నెల్లుట్ల గ్రామ పంచాయతీ

ఎర్రకోటలో స్వాతంత్ర్య వేడుకలకు నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి

- ప్రత్యేక అతిథి జాబితాలో రొండ్ల శ్రీనివాస్‌రెడ్డికి చోటు
- కేంద్రానికి సిఫారసు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

లింగాలఘణపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తెలంగాణ నుంచి ప్రత్యేక అతిథులుగా పంపేందుకు పలువురి అధికారుల జాబితాను తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి నామినేట్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జాబితాలో జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ప్రతీ ఏటా ఎర్రకోటపై భారత రక్షణ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించడం ఆనవాయితీ. ఈమేరకు 2025 వేడుకల కోసం రాష్ట్రాల నుంచి హాజరుకావాల్సిన ప్రత్యేక అతిథుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. కేంద్ర పథకాలను సంపూర్ణంగా అమలు చేసి అవార్డులను అందుకున్న గ్రామపంచాయతీల ప్రతినిధులను ఎంపిక చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ కేంద్రానికి సిఫారసు చేసింది.

ఈ జాబితాలో 2023 ఏప్రిల్ 6న నీటి సమృద్ధి పథకంలో జాతీయ స్థాయి పురస్కారం నెల్లుట్ల గ్రామపంచాయతీకి దక్కింది. దీంతో అప్పటి సర్పంచ్ చిట్ల స్వరూపారాణిభూపాల్‌రెడ్డి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది తెలంగాణ నుంచి పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారితోపాటుగా మరో ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను నామినేట్ చేస్తూ కేంద్రానికి పంపింది. జాబితాలో నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి చోటు దక్కడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం సిఫారసు చేసినట్లుగా నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శిని ప్రత్యేక అతిథిగా గుర్తిస్తూ కేంద్రం తుది నిర్ణయం తీసుకుంటే పంచాయతీకి అరుదైన గౌరవం దక్కినట్లు అవుతుందని జిల్లావాసులు పేర్కొంటున్నారు.



సంపత్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

చాకలి ఐలమ్మ ముని మనవడి మృతి

కొద్ది రోజులుగా అనారోగ్యంతో సతమతమవుతున్న సంపత్



సంపత్ (ఫైల్)

పాలకుర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ముని మనవడు చిట్యాల సంపత్ (45) అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. చాకలి ఐలమ్మ రెండో కుమారుడు పిచ్చయ్యకు భార్య భారతమ్మ, నలుగురు కుమార్తెలుండగా, ఏకైక కుమారుడు సంపత్. పిచ్చయ్య గతంలో చనిపోయాడు. పదేళ్ల క్రితం కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లి ఎలక్ట్రీషియన్‌గా సంపత్ పని చేశాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మూడేళ్లుగా సంపత్ పాలకుర్తిలోనే ఉంటున్నాడు. సంపత్ భార్య గౌరీశ్వరీ, కుమారుడు ఐటీఐ పూర్తి చేసి ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా, కుమార్తె ఎంబీఏ చదువుతుంది. కాగా, సంపత్ సీపీఐ(ఎం)లో పని చేశారు. 1981, 1994 జీపీ ఎన్నికల్లో సీపీఎం బలపరిచిన అభ్యర్థిని గెలిపించడంలో కీలకపాత్ర పోషించాడు.

పలువురి నివాళి

సంపత్ మరణవార్త తెలుసుకుని పలువురు సోమవారం ఆయన ఇంటికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంతాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదునూరి మదార్, చిట్యాల సమ్మయ్య మృతదేహానికి నివాళులర్పించారు. సోమవారం పాలకుర్తిలో సంపత్ అంత్యక్రియల్లో ప్రజాసంఘాలు, ఐలమ్మ వాసులు పాల్గొన్నారు.

11 ఏళ్ల నిరీక్షణకు తెర

- కొత్త రేషన్ కార్డుల మంజూరు
- జిల్లాలో ఇప్పటి వరకు 2,31,516 కార్డులు
- కొత్త కార్డుల సంఖ్య 14,541



హనుమకొండ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు అందనున్నాయి. ప్రజాపాలనతో పాటు విడిగా మీ-సేవ సెంటర్ల ద్వారా నిరుపేదలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో కొత్త సభ్యుల చేర్పుతో పాటు ఇతర మార్పులు, చేర్పులకు సంబంధించి కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. రేషన్‌కార్డు దరఖాస్తు నిరంతరం ఉంటుందని ప్రభుత్వం చెప్పడంతో ఇంకా దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. వీటన్నింటిని రెవెన్యూ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపి ధృవీకరిస్తున్నారు. ధృవీకరించిన దరఖాస్తులను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు కమిషనర్ కార్యాలయానికి పంపించడం, కార్డులు మంజూరు కావడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు కార్డులు అందడంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు కూడా అందనున్నాయి.

సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించడంతో ఇక హనుమకొండ జిల్లాలో కూడా కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు కూడా అందనున్నాయి. ఇప్పటికే కొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు మంజూరైన విషయం తెలిసినప్పటికీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో ఇక వారికి కార్డులు అందనున్నాయి.

హనుమకొండ జిల్లాలో 2,31,516 కార్డులు

హనుమకొండ జిల్లాలో మొత్తంగా 2,31,516 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇలా ఉండగా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల్లో 16,541 కార్డులు మం జూరయ్యాయి. వీరందరికి కూడా రేషన్ కార్డులు అందుతాయి. కార్డు మంజూరును మీ-సేవా లేదా ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చని అధికారులు చెబు తున్నారు. లబ్ధిదారులకు ఆహార భద్రతా కార్డు స్లిప్ రూపంలోనే రేషన్ కార్డులు అందుతున్నాయి. ఇకపై ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేయ నుంది. అయితే జిల్లా అధికారులు మాత్రం ఇంకా ప్రభుత్వం నుంచి నిర్దిష్ట ఆదేశాలు రాలేదంటున్నారు. జిల్లాలో కొత్త లబ్ధిదారుల ఎంపిక నిరంతరం ఉంటుందంటున్నారు. అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలన పూర్తి కాగానే కార్డు మంజూరు అవుతుందంటున్నారు. ఇక కొత్తగా మం జూరైన కార్డుదారులందరికి సెప్టెంబరు నుంచి సన్న బియ్యం అందనున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల బియ్యం కోటాను లబ్ధిదారులకు అందచేసింది. ఈ క్రమంలో సెప్టెంబరు నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ జరుగనుంది.

నెరవేరిన కల

రేషన్ కార్డు కోసం 11 ఏళ్ల కిందటే దరఖాస్తులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్వీకరించింది. కార్డు కోసం కొత్తగా వేల సంఖ్యలో దరఖాస్తులు జిల్లా అధికార గణానికి అందాయి. మార్పులు, చేర్పుల దరఖాస్తులు కూడా సమర్పించారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణతోనే సరిపెట్టింది. పదేళ్ల ఆ ప్రభుత్వ హయాంలో కార్డులు కల గానే మిగిలాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలం గడిచిన తరువాత ప్రజాపాలన ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించింది. మీ-సేవ సెంటర్ల ద్వారా దరఖాస్తులు నమోదు అయ్యాయి. ప్రతీ ఒక్కరికి కార్డులు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంతే కాకుండా లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని కూడా పంపిణీ చేస్తోంది. ఈ మేరకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తంగా 11 ఏళ్ల రేషన్ కార్డు నిరీక్షణకు తెరపడింది.

యూరియా దొరికేనా ?

- పీఏసీఎస్‌ల వద్ద రైతుల బారులు
- సరిపడా పంపిణీ చేయని అధికారులు
- నానో యూరియాపై అవగాహన కరువు
- పంట దిగుబడులపై ప్రభావం
- ప్రభుత్వంపై రైతాంగం మండిపాటు



నల్లబెల్లి పీఏపీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు



చెన్నారావుపేటలో యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు

వరంగల్ వ్యవసాయం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు వేసిన రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. పీఏసీఎస్, ప్రైవేటు ఫర్టిలైజర్స్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. పుష్కర కాలంగా రైతులు ఏనాడూ యూరియా కొరతను ఎదుర్కోలేదు. కాని ఈసారి ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పరిస్థితులే పునరావృతం అవుతున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాష్ట్రానికి కావాల్సినంత యూరియా పంపిణీ చేయాలని కేంద్రాన్ని కోరినా ఉపయోగం కనిపించడం లేదు. ఇదిలా ఉంటే వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖాధికారులు మాత్రం జిల్లాలో సాగుకు సరిపడా యూరియాను ఇప్పటికే పంపిణీ చేయడంతో పాటు అదనంగా 70 వేల బస్తాలను పంపిణీ చేసినట్లు చెబుతుండడం విడ్డూరంగా ఉంది.

రైతులు ఆగ్రహం

సకాలంలో యూరియా వాడకపోతే దాని ప్రభావం పంట దిగుబడిపై పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలంలో ఎన్నడూ యూరియా కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్న ప్రభుత్వం ఈ దఫా మాత్రం యూరియా కోసం ఎదురు చూడాల్సి వస్తోందని మండి పడుతున్నారు.

నానో యూరియాపై అవగాహన లేమి

పంట సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ద్రవ రూపంలో నానో యూరియాను అందుబాటులోకి తెచ్చింది. దీనివల్ల పంటకు త్వరగా నత్రజని అందుతుంది. కిరణజన్య సంయోగక్రియ పెరుగడంతో పాటు అధిక దిగుబడి వస్తుంది. ద్రవ రూపంలో ఉన్న అర లీటర్ నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాతో సమానంగా పనిచేస్తుంది. యూరియా బస్తాకు రూ.266లు ఉండగా ద్రవ రూపంలో ఉన్న అర లీటరు నానో యూరియా రూ.225లకే మార్కెట్లో దొరుకుతోంది. నానో యూరియా పైపాటుగా పంటసాగుపై స్ప్రే చేయడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుంది. అయితే వ్యవసాయశాఖ అధికారులు నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించకపోవడంతో రైతులు అసక్తి చూపించడం లేదు. దీంతో యూరియాకు డిమాండ్ పెరిగింది.

రోజంతా క్యూలో ఉంటే రెండు బస్తాలిచ్చారు..
- కందకట్ల సాంబయ్య, రైతు, చెన్నారావుపేట



రోజంతా లైనులో నిల్చుంటే రెండు యూరియా బస్తాలు ఇచ్చారు. నానో యూరియా కొంటేనే యూరియా బస్తాలు ఇస్తామన్నారు. నాకు ఉన్న రెండెకరాలకు గతంలో ఎంతో సులువుగా యూరియా దొరికేది. యూరియాను పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుని రైతాంగాన్ని ఆదుకోవాలి.

ముందుగానే దిగుమతి చేసుకోవాల్సింది..
- బొందిరెడ్డి ప్రతాపరెడ్డి, రైతు, కన్నారావుపేట



ఖరీఫ్ ప్రారంభం కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కావాల్సిన యూరియా దిగుమతి చేసుకోవాల్సింది. యూరియా సకా లంలో అందకపోతే దిగుబడి తగ్గిపోతుందని రైతాంగం ఆందోళన చెందుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా యూరియా పంపిణీపై దృష్టి పెట్టాల్సింది. ఇప్పటికైనా వెంటనే రైతాంగానికి కావాల్సినంత యూరియాను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

ఆందోళన వద్దు..
కె.అనురాధ, వ్యవసాయశాఖ జిల్లా అధికారి



జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు అవసరానికి మించి అదనంగా 70 వేల యూరియా బస్తాలను పంపిణీ చేశాం. జిల్లాలో ఇప్పటి వరకు పత్తి 1,09,360 ఎకరాలు, వరి 6,500, మొక్కజొన్న 11,500, కందులు 40, పత్తి 40, మినుములు 40, ఎర్ర జీలుగ 10,200 ఎకరాలు సాగైంది. వాటికి సరిపోను యూరియాను ఇప్పటికే పంపిణీ చేశాం. సోషల్ మీడియాలో కథనాలను నమ్మవద్దు. వాస్తవానికి యూరియా కొరత లేదు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

బాధ్యత లేకుండా భట్టి మాట్లాడటం సరికాదు

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి



భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం స్థాయిలో ఉన్న భట్టి విక్రమార్క బీజేపీ చీఫ్‌పై బాధ్యత లేకుండా మాట్లాడటం సరికాదని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భట్టి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం హనుమకొండ అదాలత్ జంక్షన్‌లో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు ఆధ్వర్యంలో భట్టి విక్రమార్క దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొలను సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి, న్యాయవాదిగా, నాయకుడిగా నిరంతరం ప్రజా సేవలో ఉంటున్న రాంచదర్‌రావుపై పాత సంఘటనల పేరుతో బురదజల్లే ప్రయత్నం చేయడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. హెచ్‌సీయూ ఘటనకు రాంచందర్‌రావుకు ఏలాంటి సంబంధం లేదని పోలీసులు, హైకోర్టు స్పష్టం చేయడం జరిగిందన్నారు. రోహిత్ వేముల దళితుడు కాదని బీసీ వర్గానికి చెందిన వాడని కోర్టు తేల్చి చెప్పడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ దళిత ముసుగులో ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. కోర్టు తీర్పులను అంగీకరించలేని నేతలు అధికారంలో ఉండటం ప్రమాదకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుందన్నారు. భట్టి విక్రమార్క వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు బన్నా ప్రభాకర్, ఎస్టీ మోర్చా నాయకుడు నానునాయక్, వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, ఉపాధ్యక్షుడు శ్రీనువాస్, కార్యదర్శులు శివకుమార్, వెంకటేశ్, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడికతీత

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన బల్దియా అధికారులు

హనుమకొండ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాల సముద్రంతో పాటు పలు కాలనీల్లో డ్రెయినేజీ కాలువల్లో మురుగునీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం 'మురుగు పారదు- దోమలు వదలవు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీంతో బల్దియా అధికారులు స్పందించి బాలసముద్రంలోని పలు కాలనీల్లో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బాల సముద్రం వద్ద డ్రెయినేజీలో పూడిక తీస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది ←

ఫిర్యాదులపై దృష్టి సారించండి

- నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- గ్రేటర్ ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ
- 119 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చే ప్రజా ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ హాజరై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన న్యాయం చేయాలని అన్నారు. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలపై గతంలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలని, తిరిగి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసిన వారి ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే అనుమతులు జారీ చేయాలని ఆర్‌ఐలను ఆదేశించారు. కాగా, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 119 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, హెచ్‌వోలు రమేష్, లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ, వెటర్నరీ అధికారి డాక్టర్ గోపాల్‌రావుతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ - 29, హెల్త్, శానిటేషన్ - 12, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 14, టౌన్‌ప్లానింగ్ - 62, తాగునీటి సరఫరా - 1, హార్టికల్చర్- 1 ఇలా



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

మొత్తం 119 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ప్రజలు అందించిన ఫిర్యాదులు ఇలా..

- గ్రేటర్ 31వ డివిజన్ రాజీవ్‌గృహకల్ప సమీపంలోని మల్లు స్వరాజ్యం నగర్‌లో సుమారు 450 కుటుంబాలు నివసిస్తున్నాయి, అక్కడి ప్రజలకు కాలసిన మౌలిక సదుపాయాలు అందడం లేదని కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

- వరంగల్ నగరంలోని 29వ డివిజన్ పాపయ్యపేట్ మసీద్ లైన్‌లో మూడు మాసాల క్రితం సీసీ రోడ్డు వేయడం జరిగింది, రోడ్డుకు అడ్డంగా ఉన్న మెట్లను తొలగించిన అధికారులు వేస్టేజ్‌ని అక్కడే ఉంచడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు.

- హనుమకొండ గుడిబండల్ ప్రాంతంలోని బావి గల్లీలో మూడు మాసాల క్రితం సీసీ రోడ్డును నిర్మిస్తామని ఇసుక, కంకర పోసి వదిలేశారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభించక పోవడంతో రోడ్డుపైని ఉన్న మెటీరియల్ ఇండ్లలోకి వస్తోందనీ కమిషనర్ స్పందించిన వెంటనే సీసీ రోడ్డు పనులు ప్రారంబించి అక్కడి ప్రజలకు సహకరించాలని కోరారు.

- హనుమకొండ 59వ డివిజన్ ఎక్సైజ్‌కాలనీలో నూతనంగా త్రిస్టార్స్ బేకరి అనుమతులు లేకుండా, సెట్‌బ్యాక్ కాకుండా, సెల్లార్ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నారని స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

పర్మిషన్ ఇస్తారా.. డబ్బులు వాపస్ ఇస్తారా?

శంభునిపేట (ఆంధ్రజ్యోతి): ఇల్లుకట్టుకునేందుకు మూడేళ్ల క్రితం ఫీజు చెల్లిస్తే ఇప్పటివరకు పర్మిషన్ ఇవ్వడం లేదంటూ బాధితుడు బల్దియా కమిషనర్‌కు మొరపెట్టుకున్నారు. రంగశాయిపేట విశ్వనాథకాలనీకి చెందిన కర్నె రవీందర్ 2022లో రంగశాయిపేట నాయుడు పంపు వెంకటేశ్వర కాలనీలో తనకున్న 140 గజాల స్థలంలో ఇల్లు నిర్మించుకుందామని ఆన్‌లైన్‌లో రూ. 92,529 చెల్లించారు. అప్పటి నుంచి ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పర్మిషన్ ఇవ్వకపోవడంతో సోమవారం బల్దియాలో జరిగిన ప్రజావాణిలో కమిషనర్ చహత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నిబంధనల ప్రకారమే దరఖాస్తు చేసుకున్నానని, లోన్ కోసం బ్యాంకుకు వెళితే పర్మిషన్ అడుగుతున్నారని, ఇప్పటికైనా ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇప్పించి ఇంటి నెంబర్‌ను కేటాయించాలని, లేదంటే తాను చెల్లించిన ఫీజు తిరిగి ఇప్పించాలని వినతి పత్రంలో కోరారు.



బల్దియా ఎదుట నిరసన తెలుపుతున్న గుడిసెవాసులు

తాగు నీటి సమస్యను పరిష్కరించాలి

గ్రేటర్ కార్యాలయం ఎదుట గుడిసెవాసుల నిరసన

వరంగల్ కార్పొరేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలోని 31, 2, 54 డివిజన్లలో నివసించే ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే కమిషనర్ స్పందించిన సమస్యలు పరిష్కరించాలని సీపీఎం, వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీ నాయకులతో పాటు స్థానిక కాలనీల గుడిసెవాసులు సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమం జరుగుతుండగా గుడిసెవాసులు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మట్టెవాడ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు వచ్చి వారిని శాంతింపజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సింగారపు బాబురావు, జన్ను ప్రకాశ్, గన్నారపు ప్రభాకర్, అప్పాజీ, సాంబమూర్తి, వాణి, ఉపేందర్, దివ్య, సదానందం, మురళీ, కిరణ్, మహబూబ్ పాషా, గుడిసెవాసులు పాల్గొన్నారు.

మోసం.. కాంగ్రెస్ పార్టీ నైజం

» బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినయభాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు

హనుమకొండ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా మోసం చేస్తున్నదని, కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి మాట తప్పిందని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో తలపెట్టిన 'హలో బీసీ - చలో హైదరాబాద్' పోస్టర్లను సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ బీసీలతో కాంగ్రెస్ పార్టీ ఓట్ల రాజకీయం చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీసీలందరు ఏకమై సమరశంఖారావం పూరించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పులి రజినీకాంత్ ముదిరాజ్, నరెడ్ల శ్రీధర్, దూలం వెంకన్నగౌడ్, గండు అశోక్ యాదవ్, మోటిక రాజు యాదవ్, గండ్రకోట రాకేష్ యాదవ్, బుద్దె వెంకన్న, రామ్మూర్తి, గుళ్లపెల్లి వీరస్వామి పాల్గొన్నారు.


కర్రీ పాయింట్ యజమానికి జరిమానా

వరంగల్ కార్పొరేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ నయీం నగర్‌లోని చైతన్య కర్రీ పాయింట్ యజమానికి సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అధికారులు రూ. 15 వేల జరిమానా విధించారు. కర్రీ పాయింట్ నుంచి సేకరించిన చెత్తను ప్రతీ రోజు ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కేసీ కెనాల్ ప్రాంతంలో పోస్తున్నట్టు విశ్వసనీయంగా సమాచారం అందుకున్నారు. సోమవారం కర్రీపాయింట్ యజమానితో పాటు వర్కర్లు చెత్తను కెనాల్ పక్కను డంప్ చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బహిరంగ ప్రదేశంలో చెత్తను డంప్ చేసినందుకు రూ. 15 వేల జరిమానా వేసినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పి. అనిల్‌కుమార్, భాషానాయక్ తెలిపారు. కార్యక్రమంలో జవాన్‌లు నాగరాజు, నరేష్, రాజు, ఇక్బాల్ పాల్గొన్నారు.

కేయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ

కేయూ క్యాంపస్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో సోమవారం పరిశోధక విద్యార్థులు ఘర్షణ పడ్డారు. నూతనంగా పరిశోధక విద్యార్థులు నూతన (కుర్సా) సంఘాన్ని ఎన్నుకునేందుకు సోమవారం కేయూ గెస్ట్ హౌజ్ వద్ద సమావేశమయ్యారు. అధ్యక్ష స్థానంతో పాటు ఇతర స్థానాలకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల పేర్లను స్వీకరించారు. అధ్యక్షస్థానాలతో పాటు ఇతర స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థుల మధ్య మాట మాట పెరిగి పరస్పరం దూషణలకు దిగారు. సీనియర్ స్కాలర్లు ఉండగా జూనియర్లు స్కాలర్లు సంఘానికి సారథ్యం వహిస్తారనే విషయంలో గొడవ పడినట్టు తెలిసింది. అదే క్రమంలో సైన్స్ విభాగానికి చెందిన స్కాలర్ కోపోద్రిక్తుడై మరో స్కాలర్‌ను నెట్టివేశారు. దీంతో తననే నెట్టివేస్తావా అంటూ పూలకుండీని ఎత్తారు. ఘర్షణ పెద్దది కావడంతో మిగతా స్కాలర్లంతా భయాభ్రాంతులకు గురై పరుగుపెట్టారు. అదే క్రమంలో విద్యార్థులు ఘర్షణ పడి దాడి చేశారు. ఒక్కరిద్దరూ విద్యార్థులకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. గొడవ ఎక్కడికి దారితీస్తోందోనని తోటి స్కాలర్లు గెస్టహౌస్ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. అయితే గొడవకు దిగిన స్కాలర్ల మధ్య కొందరు విద్యార్థులు రాజీ కుదిర్చి కుర్సా కొత్త కార్యవర్గ ఎంపిక ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. దీనిపై బాధిత విద్యార్థులెవరూ వర్సిటీ ఉన్నతాధికారులను కానీ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

రైల్వే ఓబీసీ అడిషనల్ జీఎస్‌గా రేండ్ల రమేశ్ నియామకం



కాజీపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఓబీసీ అడిషినల్ జనరల్ సెక్రటరీగా కాజీపేట జంక్షన్‌కు చెందిన రేండ్ల రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగిన ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. రేండ్ల రమేశ్ ఇంతకు ముందు బ్రాంచ్ సెక్రటరీగా, సికింద్రాబాద్ డివిజనల్ అధ్యక్షుడిగా, రైల్వే కార్మికులకు సేవలందించారు. నిత్యం కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని, తనకు సహకరించిన వారికి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌సీఏ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

టీసీఏ జిల్లా అధ్యక్షుడు విజయ్‌చందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కొన్ని ఏళ్లుగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి. విజయ్‌చందర్‌రెడ్డి, టి. జయపాల్‌లు వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...హెచ్‌సీఏ రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి (డబ్ల్యూసీఏ) సీహెచ్. శ్రీనివాస్ పై గత కొన్నేళ్లుగా చేస్తున్న అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై తక్షణమే విచారణ చేపట్టి, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం జరిగిందని వారు తెలిపారు. గత 20వ సంవత్సరాలుగా బోర్డ్ ఆఫ్ క్రికెట్ కంట్రోల్ ఇన్ ఇండియా (బీసీసీఐ)హెచ్‌సీఏ అభివృద్ధి కోసం మంజూరి చేసిన నిధులను జిల్లాలోని క్రికెట్ క్లబ్‌ల అభివృద్ధికి గాని, క్రీడాకారుల సంక్షేమం కోసం ఉపయోగించకుండా డబ్ల్యూసీఏ కార్యదర్శి శ్రీనివాస్ దుర్వినియోగానికి పాల్పడినట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయన్నారు. హెచ్‌సీఏ బాధ్యుల అవినీతి, అక్రమాల వలన యువ క్రికెటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థలు కలుగజేసుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న జగన్‌మోహన్‌రావు, శ్రీనివాస్‌లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు విజయచందర్‌రెడ్డి, జయపాల్‌లు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి

జూలైవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 59వ డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జీడబ్ల్యుఎంసీ ప్రజావాణిలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయికి కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని ఇందిరానగర్, కేయూ ఎంప్లాయీస్ కాలనీ, స్నేహనగర్‌లలో డ్రెయినేజీ, ఐమాక్స్ లైట్ల ఏర్పాటుపై కాలనీవాసులతో కలిసి కమిషనర్ వినతిపత్రం సమర్పించారు.

భూతగాదాల్లో జోక్యం చేసుకోవద్దు

వరంగల్ క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు భూతగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు ఉంటాయని హనుమకొండ ఏసీపీ నరసింహారావు హెచ్చరించారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శివకుమార్, ఎస్సైలు కిశోర్, సతీష్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు జారీ చేయాలి

వడ్డెపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న బ్యాండ్ వాయిద్య కళాకారులందరికీ గుర్తింపు కార్డులు జారీచేసి, వృత్తిని రక్షించాలని బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం (బీవీకేఎస్) రాష్ట్ర కన్వీనర్ గుమ్మడి రాజుల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు బ్యాండ్ వాయిద్య కళాకారులపై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో పాటు సంక్షేమ పథకాలను అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిపై ఆధారపడి జీవిస్తూ 50 ఏళ్లు దాటిన కళాకారులందరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. వాయిద్య పనిముట్ల కొనుగోలు కోసం బ్యాండ్ మేళానికి రూ. 10 లక్షల వడ్డీలేని రుణాన్ని అందించడంతోపాటు 90 శాతం సబ్సిడీ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందు కోసం ఈ నెల 16న ఉదయం 11 గంటలకు హనుమకొండ బొక్కలగడ్డలోని సిటిజన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సులో బ్యాండ్ వాయిద్య కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య యాదవ్, బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాష, ఉపాధ్యక్షుడు మడి పెద్ది వెంకన్న, హనుమకొండ సిటీ కోశాధికారి ఎండీ.చాంద్‌పాష, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ రాజా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

'రాపిడో వాహనాలతో ఉపాధి కోల్పోతున్నాం'

వడ్డెపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాపిడో, ఓలా, ఉబర్ వంటి వాహనాలతో తాము ఉపాధి కోల్పోతున్నామని కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రఘు, రాష్ట్ర ముఖ్య సలహాదారులు మొగుసాల దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ గౌస్ పాష అన్నారు. రాపిడో, ఓలా, ఉబేర్ వంటి వాహనాలను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లేబర్ అడ్డా వద్ద సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాపిడో, ఓలా, ఉబర్ వాహనాల యూనిట్ల తయారీని నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ వాహనదారులు ఆర్టీఏ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు యాసిన్, ఎండీ షఫిల్ అహ్మద్, భూక్యా రామకృష్ణ, ఖాజా పాషా, ఆనంద్, కాకతీయ ఆన్‌లైన్ ఆటో డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎండీ.జహంగీర్, అధ్యక్షుడు ఎండి ఖాజా పాష, కోశాధికారి రాజు, క్రాంతి, సునీల్, దేవేందర్, శ్రీశైలం, సీఐటీయూ నేత భానునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన 'పావలా వడ్డీ'

(5వ పేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. అంటే రైతులు నయాపైసా వడ్డీ చెల్లించాల్సిన అవసరం ఉండదు. అసలు చెల్లిస్తే సరిపోతుంది. కానీ జీరో వడ్డీ పథకానికీ మోక్షమే కలుగలేదు. పైగా రాష్ట్ర ప్రభుత్వం పావలా వడ్డీ పథకాన్ని పూర్తిగా అటకెక్కించింది. ప్రభుత్వం నుంచి సహకార సంఘాలకు రాయితీ రాకపోవడంతో లాభాలను రైతులకు బదలాయించడం లేదు. దీంతో రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారు. బ్యాంకులతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కూడా రైతులకు పంట రుణాలు ఇస్తుంటాయి. 2015-17సంవత్సరాలకు సంబంధించిన వడ్డీ బకాయిలు రూ.187 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ మంజూరు చేయకపోవడంతో బ్యాంకులు ప్రత్యామ్నాయ చర్యలకు దిగాయి. ఏ సొసైటీ పరిధిలో ఎంత బకాయిలు ఉన్నాయో లెక్కలు తీసి ఆ సొసైటీ ఖాతాల్లో అప్పుగా జమ చేశాయి.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేటాయింపులు లేకపోవడం, రైతుల నుంచి వసూలు చేసే పరిస్థితి లేకపోవడంతో సొసైటీలు ఇరకాటంలో పడ్డాయి. ఈ నేపథ్యంలో వడ్డీ వసూలు చేయకుండా ఆర్థిక అసరా కల్పించాలని, పంట రుణం తీసుకున్న వారందరికి కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేసి పెంచిన పరిమితి మేరకు రూ. 5 లక్షల రుణాన్ని ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. వడ్డీ రాయితీ, వడ్డీ రీయింబర్స్‌మెంట్, ప్యాక్స్‌లకు రాయితీ సొమ్ము చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించినట్లు జిల్లా వ్యసాయాధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు.

రుణమాఫీ చేస్తున్నందుకేనా.?

రైతుల పంట రుణాలకు పావలావడ్డీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా చెల్లించాల్సిన మూడు శాతం చెల్లించకపోవడం వెనుక కారణం పంట రుణాల మాఫీ, రైతు బంధు వంటి రాయితీలే కారణమై ఉండవచ్చునన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇవి ఇస్తున్నందు వల్ల ఇక పావలా వడ్డీ డబ్బులు ఎందుకు ఇవ్వాలని భావిస్తుందేమోనన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదిపైకి చెప్పకుండా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ అమలు చేయటం లేదేమోనని అంటున్నారు.

వైద్య వర్గాల్లో విషాదం

(5వ పేజీ తరువాయి)

కుంగిపోయిన ప్రత్యూష అదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. భర్త సృజన్‌రెడ్డి వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా అచేతనంగా కనిపించింది. వెంటనే ఎస్‌ఎస్‌ఆర్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో సృజన్ సమాచారం మేరకు హసన్‌పర్తి పోలీసులు చేరుకొని దర్యాప్తును ప్రారంభించారు. మృతురాలి తల్లి తంజావూర్ పద్మావతి ఫిర్యాదు మేరకు సృజన్‌రెడ్డి, అత్తామామలు మధుసూదన్, పుణ్యవతి, మహిళా యూట్యూబర్‌పై కేసు నమోదు చేశామని, సృజన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని సీఐ చేరాలు తెలిపారు.

కాగా, మహిళా యూట్యూబర్‌తో పరిచయం అయిన తర్వాతే సృజన్ మారాడని ప్రత్యూష తల్లి ఆరోపించింది. ఆమెను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరింది. ప్రత్యూష మృతదేహానికి సోమవారం ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి తల్లి పద్మావతి నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో సూపరింటెండెంట్ కావడంతో ఉద్యోగ సంఘాల నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ప్రత్యూష అంత్యక్రియలు సోమవారం సాయంత్రం హసన్‌పర్తిలో జరిగాయి. ఈ సందర్భంగా హసన్‌పర్తిలో సృజన్ ను విమర్శిస్తూ పోస్టర్‌లు వెలిశాయి. అల్లాడి సృజన్ అరాచకం.. అతడిని శిక్షించాలి, భార్యను చంపిన అల్లాడి సృజన్‌ను వెంటనే శిక్షించాలని పోస్టర్‌లో పేర్కొన్నారు. సృజన్ చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీకి చెప్పులదండ వేశారు. ఈ సంఘటన వైద్యవర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. మహిళా 'ఇన్‌ఫ్లూయెన్సర్' మోజులో డాక్టర్ సృజన్ అందమైన జీవితాన్ని నాశనం చేసుకున్నాడని పలువురు ఆవేదన చెందుతున్నారు. తల్లిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులను చూసి కంటతడి పెట్టుకున్నారు.

'బహుజన గణమన' దీర్ఘ కవిత ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ తెలంగాణ కవి జూలూరి గౌరీశంకర్ రూపొందించిన బీసీ కవిత్వ చరిత్ర బహుజన గణ మన కవిత సంపుటిని సోమవారం కేయూ దూరవిద్య కేంద్రం వద్ద ఆవిష్కరించారు. కేయూ జేఏసీ చైర్మన్ బహుజన రాష్ట్ర నేత కత్తెరపల్లి దామోదర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్, దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్‌లు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బహుజన బీసీవాద నేతలు మాట్లాడారు. బీసీల అస్తిత్వాన్ని ఆలోచన విధానాన్ని రాజకీయ భావాలను కవిత సంపుటిలో విశ్లేషించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ కర్రె సదాశివ్, జెట్టి రాజేందర్, ఏ రంజిత్, పిన్నింటి విజయ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, చంద్రమౌళి, తిరుపతి, రవి యాదవ్, కమలాకర్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొట్టే భాస్కర్, శ్రీనివాస్, దామోదర్

పారదర్శకంగా యూజీడీ పనులు

- బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష

వరంగల్ కార్పొరేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో త్వరలో ప్రారంభమయ్యే యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు పారదర్శకంగా జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు చొరవ చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. సోమవారం జీడబ్ల్యుఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగ ళవారం హైదరాబాద్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, కమిషనర్లు పాల్గొనే సమీక్ష సమావేశానికంటే ఒక రోజు ముందు గ్రేటర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ యూజీడీ పనుల డీపీఆర్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. యూజీడీ బడ్జెట్, ఎక్కడ ఎన్ని జోన్లు ఏర్పాటు చేయాలి ? ఎన్ని వాల్వ్ ఏర్పాటు చేయాలని అనే అంశాలపై మాట్లాడారు. 9 జోన్లు, 13 సబ్‌జోన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాజస్తాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీ పనులు చేయడానికి కాంట్రాక్ట్ దక్కించుకోవడంతో సంస్థ గతంలో పని చేసిన ప్రాజెక్టుల వివరాలు కావాలని కమిషనర్ అన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, ఈఈలు రవికుమార్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, డీఈలు, ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా నల్లాల సర్వే చేయండి

వరంగల్ నగరంలో ఇంటింటి నల్లాలు పారదర్శకంగా సర్వే చేయాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రేటర్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులకు తగు సూచనలు చేసి మాట్లాడారు. నగరంలో ఇప్పటికే 70 వేలకు పైగా సమస్యాత్మక నల్లా కలెక్షన్లు ఉన్నట్టు గుర్తించామని అన్నారు. నల్లా కలెక్షన్ల సర్వే కోసం 11 బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం గ్రీవెన్స్‌కు నగరంలోని నల్లాలకు సంబంధించిన ఫిర్యాదులు తరుచుగా వస్తున్నాయని సర్వే చేసిన తర్వాత ఈ సమస్యకు స్పష్టిపలకవచ్చని అన్నారు. వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అన్నారు. నల్లాలకు సంబంధించిన ప్రొఫార్మా ఐటీ అధికా రులు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, పన్నుల విభాగం అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఈఈ మాధవీలత, ఏఈలు, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

భద్రకాళి ఆలయం సమీపంలోని మాడవీదుల అభివృద్ధి పనులతో పాటు భద్రకాళి చెరువుకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం సాయంత్రం భద్రకాళి మాడవీధులతో పాటు భద్రకాళి చెరువు మధ్యలో ఉన్న హైల్యాండ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. రూ. 30 కోట్లతో మాడవీదుల పనులు చివరి దశకు చేరుకున్నాయని ఇంకా మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కుడా సీపీవో అజీత్‌రెడ్డి, కుడా ఈఈ భీంరావు, భద్రకాళి శేషు, ఈవో భారతి తదితరులు పాల్గొన్నారు.

గర్భధారణ



వేర్వేరు ఊళ్లలో ఉద్యోగాలు, ఉరుకులు పరుగుల జీవితాలు... కారణాలు ఏవైనా, దంపతుల మధ్య లైంగిక దూరం పెరుగుతోంది. దాంతో గర్భం దాల్చే వెసులుబాట్లను వెతుక్కోవలసిన అవసరత ఏర్పడి, పలు రకాల సంతానోత్పత్తి పరికరాలు వాడుకలోకొచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లో దొరుకుతున్న ఆ ఉత్పత్తుల ప్రామాణికత ఏ మేరకు? వాటితో లాభ నష్టాలేంటి? వైద్యులేమంటున్నారు? తెలుసుకుందాం!

సంతానోత్పత్తి సాధనాల సారం ఎంత?

వ్యక్తిగత కారణాలతో పెళ్లి, పిల్లలను వాయిదా వేసే ధోరణి పెరిగింది. దాంతో ప్రత్యేకించి మహిళల్లో అండాల కొరత ఏర్పడి, గర్భధారణ అవకాశాలు క్షీణిస్తున్నాయి. దురలవాట్లు, ఒత్తిళ్లు, పర్యావరణ మార్పులు, ఆహారపుటలవాట్లు కూడా స్త్రీపురుషుల్లోని పునరుత్పత్తి వ్యవస్థలను నీరుగారుస్తున్నాయి. దాంతో పెళ్లవగానే పిల్లలు పుట్టే పరిస్థితులు అడుగంటాయి. ఇది నాణేనికి ఒక పార్శ్వం మాత్రమే! ఉదయం లేచినప్పటి నుంచి ఇంటి పనులు, ఉద్యోగ బాధ్యతలతో తీరిక లేకుండా గడపడం, రాత్రయ్యేటప్పటికి అలసిపోయి పడక మీద వాలిపోవడం పరిపాటైపోయింది. వారాంతాల్లో తీరిక దొరికినా, ఆ సమయాన్ని ఇతరత్రా పనులకు కేటాయిస్తూ ఉండడంతో, దంపతులు దాంపత్య జీవితానికి సరిపడా సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. వేర్వేరు ఊళ్లలో ఉద్యోగాలు చేస్తూ, దీర్ఘ సెలవుల్లోనే కలుసుకునే దంపతుల పరిస్థితి మరీ దారుణం. ఇన్ని ప్రతికూలతలు నెలకొని ఉన్నప్పుడు, పరిస్థితులన్నీ అనుకూలించి గర్భం దాల్చడం కష్టమే! కాబట్టే గర్భధారణ అవకాశాలను మెరుగు పరచడం కోసం పలు రకాల పరికరాలు అందుబాటులోకొచ్చాయి. అవేంటంటే...

ఎవరి కోసం?

గర్భధారణకు అడ్డుపడే ఆరోగ్య సమస్యలేవీ లేవని వైద్యులు నిర్ధారించిన దంపతులు గర్భధారణ సాధనాలను ఆశ్రయించడంలో తప్పు లేదు. ఈ కోవకు చెందిన దంపతులతో పాటు...

- వేర్వేరు ఊళ్లలో ఉంటూ, తరచూ శారీరకంగా కలుసుకునే వీలు లేని దంపతులు
- అరుదుగా కలిసే సందర్భాల్లో పర్ఫార్మెన్స్ ప్రెషర్ వల్ల అంగస్తంభన సమస్యను ఎదుర్కొంటున్న వాళ్లు
- భాగస్వామిలో ఒకరు ఆరోగ్య కారణాలతో మంచానికే పరిమితమై, ఆ ఖాళీ సమయంలో గర్భధారణ ప్రయత్నం చేయాలనుకునే దంపతులు
- దంపతుల్లో ఒకరు రాత్రి వృత్తి, మరొకరు పగటి వృత్తి చేస్తూ, లైంగికంగా దగ్గరయ్యే వీలు లేని దంపతులు

ఓవ్యులేషన్ కిట్

ఊపిరి పీల్చుకోలేని పనులతో సతమతమయ్యే మహిళలకు నెలసరిని గుర్తుపెట్టుకుని, అండం విడుదలయ్యే రోజును కచ్చితంగా కనిపెట్టే తీరిక ఉండకపోవచ్చు. ఇలాంటి మహిళల కోసం అందుబాటులోకొచ్చినదే ఓవ్యులేషన్ కిట్. ఇది ప్రెగ్నెన్సీ కిట్ లాంటిదే! సాధారణంగా అండం విడుదలకు ముందు ల్యూటినైజింగ్ అనే హార్మోన్ మూత్రంలోకి విడుదలవుతూ ఉంటుంది. కాబట్టి మూత్రాన్ని పరీక్షించడం ద్వారా అండం విడుదలను కనిపెట్టే గ్యాడ్జెట్ ఇది. ఈ కిట్‌లో ఉండే స్ట్రిప్స్‌ను మూత్రంలో ముంచి, మారిన రంగును బట్టి తర్వాతి 24 గంటల్లో అండం విడుదల కాబోతున్నట్టు నిర్ధారించుకోవచ్చు. ఆ సమయంలో కలిస్తే గర్భధారణ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో పాటు, ఓవ్యులేషన్ కిట్‌ను ఎప్పుడు వాడుకోవచ్చో తెలిపే యాప్ కూడా అందుబాటులో ఉంది. అదే ఓవ్యులేషన్ ట్రాకర్. ఈ యాప్, మూడు నెలల నెలసరి వివరాలను అందించడం ద్వారా అండం విడుదలయ్యే రోజును కచ్చితంగా లెక్కించి అప్రమత్తం చేస్తుంది.



ఇన్‌సెమినైజేషన్ కిట్

నిర్దిష్ట రోజుల్లోనే కలిసి తీరే పరిస్థితి ఉన్నప్పుడు కొందరు పురుషుల్లో పర్‌ఫార్మెన్స్ ప్రెషర్ పెరిగిపోయి, అంగస్తంభన సమస్య తలెత్తుతుంది. ఇంకొందరికి స్వతహాగానే అంగ స్తంభన సమస్య ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లో వీర్యాన్ని సేకరించి, జననావయవంలోకి ప్రవేశపెట్టుకునే వీలుండే కిట్ ఇది. అండం విడుదలయ్యే రోజు ఇలా ఈ కిట్‌ను వాడుకోవడం ద్వారా గర్భం దాల్చే అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చు. ఈ కిట్‌లో, వీర్యాన్ని సేకరించే కప్పు, నీడిల్ లేని సిరంజి ఉంటాయి. శుభ్రత పాటించని సందర్భాల్లో మహిళలకు ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి కిట్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలి.

కన్‌సెప్షన్ కప్స్

అంగ ప్రవేశం తదనంతరం, వీర్యం బయటకు రాకుండా గర్భాశయ ముఖద్వారం దగ్గరే ఎక్కువ సమయం పాటు నిలిపి ఉంచే పరికరం ఇది. దీన్ని ఉపయోగించుకున్నప్పుడు, గర్భాశయ ముఖద్వారం దగ్గరే వీర్యం నిలిచి ఉంటుంది కాబట్టి వీర్య కణాలు అండాన్ని చేరుకునే అవకాశాలు సులభతరమవుతాయి.

గర్భధారణ కాలం ఎప్పుడు?

మహిళల్లో గర్భధారణ సజావుగా జరగడానికి అండాల విడుదల సక్రమంగా జరగాలి. నెలసరి అయిన రోజు మొదలు 14 నుంచి 16వ రోజు మధ్య ఎప్పుడైనా అండం విడుదల జరగవచ్చు. సాధారణంగా కొందరు నెలసరి ఆగినప్పటి నుంచి రోజులను లెక్కబెట్టి లైంగికంగా కలుస్తూ ఉంటారు. ఫలితంగా గర్భధారణ సాధ్యపడదు. కాబట్టి అండం విడుదలయ్యే రోజును కచ్చితంగా లెక్కించి అప్రమత్తం చేసే ఉపకరణాలు ఇలాంటి మహిళలకు ప్రయోజనాన్నిస్తాయి.

ఎవరికి నిష్ప్రయోజనం?

గర్భధారణ ఉపకరణాలు ఇన్‌ఫెర్టిలిటీని సరిదిద్దే మందులు కావు. ఇవి కేవలం గర్భధారణ అవకాశాలను మెరుగు పరిచే ప్రత్యామ్నాయాలు మాత్రమే అనే విషయం దంపతులు గుర్తు పెట్టుకోవాలి. కాబట్టి గర్భధారణ కోసం వీటి మీదే గుడ్డిగా ఆధారపడడం అవివేకం! ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేవని వైద్యులు నిర్ధారించిన తర్వాత, గర్భధారణ కోసం నిర్దిష్ట కాలం పాటు మాత్రమే వీటి మీద ఆధారపడి, ఫలితం లేనప్పుడు, వైద్యులను సంప్రతించాలి. అలా కాకుండా, పునరుత్పత్తి సమస్యలు ఉన్నాయని తెలుసుకోకుండా, వాటిని సరిదిద్దుకోకుండా వీటి మీదే ఆధారపడడం వల్ల విలువైన గర్భధారణ సమయం వృథా అయిపోతుంది. ఉదాహరణకు థైరాయిడ్, పిసిఒడిల వల్ల నెలసరి సమస్యలు ఉన్న మహిళలు ఈ పరికరాలనే వాడుకుంటూ ఉండిపోవడం వల్ల ఆ సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వైద్యులు సూచించకుండా వీటిమీదే ఆధారపడడం అవివేకం.


డాక్టర్ రాహుల్ రెడ్డి
ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్.

అప్రమత్తం

కృత్రిమ చక్కెర చేటు

కృత్రిమ చక్కెర అస్పర్టేమ్, పేగుల్లోని బ్యాక్టీరియాతో పాటు, జియోబ్లాస్టోమా అనే క్యాన్సర్‌తో సంబంధమున్న జన్యువుల రూపురేఖలను మార్చేస్తుందని తాజా పరిశోధనలో తేలింది. మరిన్ని వివరాలు... గతంలో అనుకున్నట్టు కృత్రిమ చక్కెర, అస్పర్టేమ్ ఇక మీదట ఏమాత్రం సురక్షితం కాదు. ఈ చక్కెరతో పేగులు, మెదడు, పునరుత్పత్తి వ్యవస్థ, రక్తం... ఇలా బహుళ క్యాన్సర్ల ముప్పు పెరిగే ప్రమాదముందని పలు



అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ చక్కెరతో తలనొప్పులు పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా క్షీణిస్తుంది. డైట్ పానీయాలు, రక్త క్యాన్సర్ ముప్పుకూ అత్యధిక అస్పర్టేమ్ మోతాదులకూ మధ్య ఉన్న సంబంధాన్ని కనిపెట్టడంలో తొలినాళ్ల అధ్యయనాలు విఫలమైనప్పటికీ, అస్పర్టేమ్ పేగుల్లోని మైక్రోబియంను నేరుగా ప్రభావితం చేసి, గ్లయోబ్లాస్టోమా అనే క్యాన్సర్ ముప్పును పెంచుతుందని తాజా అధ్యయనాల్లో వెల్లడైంది. తాజా ఆధారాలు గ్లయోబ్లాస్టోమా చికిత్స వ్యూహాలను అంచనా వేయడంలో వైద్యులకు సహాయపడతాయనీ, జీన్ టార్గెటెడ్ థెరపీలతో పాటు, మైక్రోబియం ఆధారిత చికిత్సలకు కొత్త మార్గాలు తెరుస్తాయనీ పరిశోధకులు భావిస్తున్నారు.

చికిత్స



ఆధునిక వైద్యం విప్లవాత్మకమైన అభివృద్ధి సాధిస్తోంది. ఈ క్రమంలో మధుమేహానికి కూడా కొత్త మందులు, పరికరాలు అందుబాటులోకొచ్చాయి. వాటి గురించి అవగాహన పెంచుకుందాం!

మధుమేహం మన చేతుల్లో..

అత్యధిక మధుమేహులున్న భారతదేశాన్ని మధుమేహ ప్రపంచ రాజధానిగా పేర్కొంటూ ఉంటారు. కాబట్టి అంతకంతకూ పెరుగుతున్న మధుమేహంతో పాటు, రోగులు వారి చక్కెర మోతాదులను ఎప్పటికప్పుడు పరీక్షించుకునే వీలుండే సాంకేతికత కూడా అభివృద్ధి చెందుతోంది. ధరించే వీలుండే సెన్సార్లు మొదలు, ఇన్సులిన్ పెన్‌ల వరకూ అనేక రకాల వినూత్నమైన పరికరాలెన్నో తాజా గా అందుబాటులోకొచ్చాయి. వాటి సామర్థ్యం, లోటుపాట్ల గురించి తెలుసుకుందాం!

ఫ్రీస్టైల్ లిబ్రె 3

చేతికి ధరించే వీలున్న పరికరమిది. చర్మం అడుగున ఉండే సెన్సార్, రక్తంలోని గ్లూకోజ్ మోతాదులను రోజులో 24 గంటల పాటు పరీక్షిస్తూనే ఉంటుంది. ఈ పరికరంలోని ట్రాన్స్‌మీటర్, గ్లూకోజ్ ఫలితాలను సెల్ ఫోన్‌కు నిరంతరం పంపిస్తూనే ఉంటుంది. కాబట్టి తేలికగా గ్లూకోజ్‌లోని హెచ్చుతగ్గులను గమనిస్తూ ఉండవచ్చు.

- **భారతదేశంలో:** దొరుకుతుంది
- ధర: 14 రోజుల సెన్సార్ 4,500 - 5,000 రూ/
- అనుకూలతలు: సమర్థంగా పని చేస్తుంది. నీటిలో తడిచినా పాడవదు
- **ప్రతికూలతలు:** రక్తంలో వేగంగా మారే చక్కెర మోతాదులను అంతే వేగంగా కనిపెట్టలేకపోవచ్చు. తీవ్ర డీహైడ్రేషన్, షాక్‌కు గురైన సందర్భాల్లో, డయాలసిస్ రోగుల్లో కచ్చితమైన ఫలితాలను కనబరచకపోవచ్చు.

సైనోకేర్ ఐక్యాన్ ఐ3

శరీరానికి అమర్చుకునే వీలుండే సెన్సార్ ఇది. రక్తంలోని చక్కెర మోతాదులను లెక్కిస్తూ సమాచారాన్ని సేకరిస్తూ ఉంటుంది.

- **భారతదేశంలో:** దొరుకుతుంది
- **ధర:** ఒక సెన్సార్ 4,500- 5,500 రూ/
- **అనుకూలతలు:** అందుబాటు ధర, నీటిలో తడిచినా పాడవదు, స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానించుకోవచ్చు
- **ప్రతికూలతలు:** ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయదు, ఎవరికి వారు చక్కెర హెచ్చుతగ్గులను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుండదు. దీన్ని వైద్యులే అమరుస్తారు. కాబట్టి 14 రోజుల తర్వాత వైద్యులే డాటాను డౌన్‌లోడ్ చేసుకుని చక్కెర మోతాదులను పర్యవేక్షించి మందులను మారుస్తారు.

ఇన్సులిన్ పంప్స్, పాడ్స్

- **భారతదేశంలో:** దొరుకుతుంది
- **ధర:** 5 నుంచి 6 లక్షలు
- **అనుకూలతలు:** రక్తంలోని గ్లూకోజ్ మోతాదు ఆధారంగా ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది
- **ప్రతికూలతలు:** అధిక ధర, శిక్షణ అవసరత

స్మార్ట్ ఇన్సులిన్ పెన్స్

స్మార్ట్‌ఫోన్ యాప్‌తో అనుసంధానమై పని చేసే ఈ పరికరం ఎప్పటికప్పుడు రోగులను అప్రమత్తం చేస్తూ ఉంటుంది.

- **భారతదేశంలో:** దొరుకుతుంది
- **ధర:** 2,500 నుంచి 3,500 రూ/
- **అనుకూలతలు:** మోతాదులను లెక్కిస్తుంది, పిల్లలకూ ఉపయోగపడుతుంది, బ్యాటరీలతో పని లేదు
- **ప్రతికూలతలు:** గ్లూకోజ్ డాటాకు లింక్ చేయదు

గార్డియన్ కనెక్ట్

ఇదొక నిరంతర చక్కెర పర్యవేక్షక వ్యవస్థ. రక్తంలోని చక్కెర మోతాదులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఆ సమాచారాన్ని సెల్ ఫోన్ యాప్‌కు చేరవేస్తూ ఉంటుంది.

- **భారతదేశంలో:** విస్తృతంగా దొరకదు
- **ధర:** 60 నుంచి 75 వేలు
- **అనుకూలతలు:** హైపో/హైపర్‌గ్లైసీమియాలను కనిపెట్టి అప్రమత్తం చేస్తుంది
- **ప్రతికూలతలు:** ఖరీదైనది, కచ్చితమైన ఫలితాన్ని తెలుసుకోవడం కోసం క్రమం తప్పక పరికరాన్ని పరీక్షిస్తూ ఉండాలి.

ఇన్‌పెన్

- **భారతదేశంలో:** దొరకదు పలుమార్లు ఉపయోగించుకునే వీలున్న పరికరమిది. రక్తంలోని చక్కెర మోతాదులను పర్యవేక్షించి, తీసుకోవలసిన ఇన్సులిన్ మోతాదులను మొబైల్ యాప్‌కు చేరవేస్తుంది.
- **భారతదేశంలో:** దొరకదు
- **ధర:** ఏడాదికి 50 వేలు
- **అనుకూలతలు:** బ్లూటూత్ ట్రాకింగ్, యాప్ ద్వారా మందు మోతాదులను లెక్కిస్తుంది
- **ప్రతికూలతలు:** భారతదేశంలో దొరకదు, దీనికి సభ్యత్వం కూడా అవసరమే!


డాక్టర్ శ్రీ నగేష్
కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ అండ్ డయాబెటాలజిస్ట్,
శ్రీ నగేష్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైన్ క్లినిక్,
టోలిచౌకి, హైదరాబాద్.

పోషకాహారం



ఏ నూనె మేలు?

మార్కెట్లో రకరకాల వంట నూనెలు దొరుకుతున్నాయి. వీటికి తోడు గానుగ నూనెలు కూడా అందుబాటులోకొచ్చాయి. ఇన్ని నూనెల్లో, దేన్ని వాడుకోవడం ఉత్తమం? ఏ నూనె ఆరోగ్యకరం? పోషకాహార నిపుణులేమంటున్నారో తెలుసుకుందామా?

మార్కెట్లో ఎన్నో రకాల వంట నూనెలు అందుబాటులో ఉన్నాయి. అయితే వాటిలో జరిగే కల్తీలు, నాణ్యతా లోపాల వల్ల ఇటీవలి కాలంలో గుండె రక్తనాళాల్లో అడ్డంకులు, అధిక కొలెస్ట్రాల్ సంబంధిత గుండెపోట్లు పెరుగుతున్నాయి. ఇలాంటి నూనెల వాడకం వల్లే 20 ఏళ్ల యువతలో సైతం చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ పెరిగిపోతున్నాయి. కాబట్టి ఎంచుకునే నూనెల్లో జాగ్రత్తలు పాటించాలి. సాధారణంగా వాణిజ్య ప్రకటనల్లో కనిపించే బ్రాండ్లకే ఎక్కువ గిరాకీ ఉంటుంది. కానీ ధర ఎక్కువే ఉన్నా, పరిశోధనాధారిత నూనెలు, దీర్ఘకాలంగా మన్నుతున్న బ్రాండ్లనే ఎంచుకోవాలి. పొద్దుతిరుగుడు నూనెకు గిరాకీ ఎక్కువ కాబట్టి దాన్లోనే ఎక్కువ కల్తీ జరుగుతూ ఉంటుంది. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.

ఇళ్లలో బజ్జీలు, పకోడీల కోసం ఉపయోగించిన నూనెను, చల్లారిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో నిల్వ ఉంచుకుని, కూరలు, తాలింపుల కోసం వాడుకోవచ్చు. కానీ అదే నూనెను మళ్లీ మళ్లీ డీప్ ఫ్రైలకు వాడడం సరి కాదు. కానీ హోటళ్లలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. హోటళ్లలో వాడిన నూనెలో పదే పదే వాడుతూ ఉంటారు. నిజానికి హోటళ్లు, ఇలాంటి నూనెలను క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిదారులకు విక్రయించాలనే నిబంధన ఉంది. క్రూడ్ ఆయిల్ ఉత్తత్తిదారులు ఇలా సేకరించిన నూనెలతో ఇంజన్ ఆయిల్, గ్రీజ్ లాంటి పెట్రోలియం ఉత్పత్తులను తయారుచేస్తారు.

గానుగ నూనెలు మేలే!

కొంతకాలంగా సర్వత్రా వేరుశనగ, నువ్వుల నూనెల పట్ల మక్కువ పెరిగింది. ఇవే నూనెలు ప్యాకెట్ల రూపంలో సూపర్‌మార్కెట్లలో దొరుకుతున్నప్పటికీ, వీటి తయారీలో మూడు, నాలుగో గ్రేడ్ వేరుసెనగలనే వాడతారు. అలాగే గానుగల్లో తయారయ్యే శనగ నూనెల్లో కూడా కల్తీ జరగలేదని చెప్పలేం! కాబట్టి స్వచ్ఛమైన నూనెలు కావాలనుకునేవారు, నువ్వులు, లేదా వేరుశనగలను కొని, వాటితో గానుగలో నూనె పట్టించి తీసుకోవాలి. వీటికి బదులుగా కుసుమ నూనె, రైస్ బ్రాన్, సన్‌ఫ్లవర్ నూనెలు వాడుకోవాలనుకునేవాళ్లు, ధర ఎక్కువైనా, నాణ్యమైన మన్నికైన బ్రాండ్ నూనెలనే ఎంచుకోవాలి.

నూనెలో ముంచి వేయించే పూరీలు, బజ్జీలు లాంటి వాటి కోసం స్మోకింగ్ పాయింట్ ఎక్కువగా ఉండే వేరుశనగ, పొద్దుతిరుగుడు, రైస్ బ్రాన్ నూనెలను వాడుకోవాలి. నువ్వుల నూనె, ఆలివ్ నూనె, అవిసె గింజల నూనెలు ఇలాంటి వేపుళ్లకు వాడకూడదు.

రైస్ బ్రాన్ కూడా...

ఈ నూనె వంటకు మంచిదే! చెడు కొలెస్ట్రాల్ వల్ల గుండె జబ్బులతో బాధపడేవారు ఈ నూనె వాడుకోవడం మంచిది. ఈ నూనెలో ఉండే ఒరైజనాల్ అనే ఫైటోకెమికల్ గుండె రక్తనాళాల్లో అడ్డంకులు తొలగిపోడానికి సహాయపడుతుంది. కాబట్టి వంటనూనెల జాబితాలో దీన్ని కూడా చేర్చుకోవాలి.

నూనెలు మార్చి మార్చి

రక రకాల నూనెల్లో భిన్నమైన పోషకాలుంటాయి. కాబట్టి ఎప్పుడూ ఒకే నూనెకే పరిమితమైపోకుండా, తరచూ మారుస్తూ ఉండాలి. నువ్వుల నూనె, వేరుశనగ, కుసుమ, రైస్ బ్రాన్, పొద్దుతిరుగుడు.. ఇలా వీటిని మారుస్తూ వాడుకుంటూ ఉండాలి. గుండె జబ్బులున్న వాళ్లు పొద్దుతిరుగుడు నూనె మినహా మరే నూనె వాడడానికైనా భయపడుతూ ఉంటారు. కానీ ఏ నూనె అయినా పరిమితంగా వాడుకోవచ్చు. మనం తినే ఆహారంలో కూడా నూనెలుంటాయి. తాలింపుల్లో, పచ్చళ్లలో వేరుశనగలు, నువ్వులు, కొబ్బరిల ద్వారా కొంత నూనె శరీరంలోకి చేరుకుంటూ ఉంటుంది. కాబట్టి వాటి పరిమాణాన్ని లెక్కించుకుని, వంటల్లో వాడే నూనెను పరిమితం చేసుకోగలిగితే, శనగ, నువ్వుల నూనెలను కూడా వాడుకోవచ్చు.


డాక్టర్ సుజాత స్టీఫెన్
క్లినికల్ న్యూట్రిషనిస్ట్,
యశోద హాస్పిటల్స్,
మలక్ పేట, హైదరాబాద్.

పరిశోధన

కంటి చికిత్స కొత్తగా...

కంటి చికిత్స క్షీణించిన కంటిచూపును మరింత దెబ్బతీసేలా ఉండకూడదు. మరీ ముఖ్యంగా రెటీనా జబ్బుల్లో చేసే చికిత్సల్లో ఇదే జరుగుతూ ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించే, శస్త్రచికిత్సతో పని లేని ఒక సరికొత్త చికిత్సా విధానం త్వరలో అందుబాటులోకి రానుంది. అదేంటో తెలుసుకుందాం!

మాక్యులర్ డీజెనరేషన్, రెటీనైటిస్ పిగ్మెంటోసా లాంటి కంటి సమస్యలతో కంటిచూపును కోల్పోయిన వారి చికిత్స కోసం రెటినల్ ప్రోస్థెసిస్‌ను రూపొందించారు. సాధారణంగా ఈ కంటి సమస్యల్లో అనుసరించే సంప్రదాయ శస్త్రచికిత్సల్లో భాగంగా ఎలక్ట్రోడ్స్‌ను కంట్లో అమర్చడం లేదా జన్యు ఆధారిత చికిత్సలను ఎంచుకుంటూ ఉంటారు. ఈ చికిత్సలతో కంటిచూపు స్పష్టత, మెరుగుదల పరిమితంగానే ఉంటుంది. అయితే ఈ సమస్యకు పరిష్కారంగా బ్రౌన్ యూనివర్శిటీ పరిశోధకులు శస్త్రచికిత్సతో పని లేని ఒక కొత్త చికిత్సా విధానాన్ని అభివృద్ధి చేశారు. సాధారణంగా నానో పార్టికల్స్ ఉపయోగించే చేసే చికిత్సా విధానంలో, మిరుమిట్లు గొలిపే వెలుగు అవసరమవుతూ ఉంటుంది. ఆ వెలుగుతో కంట్లో మిగిలి ఉన్న కంటిచూపు కూడా దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయంగా పరిశోధకులు 'ప్లాస్మోనిక్ గోల్డ్ నానోరాడ్స్' అనే సూక్ష్మ బంగారు కడ్డీలను రూపొందించారు. ఇవి అతినీలలోహిత వెలుగుకు మాత్రమే ప్రతిస్పందిస్తాయి. కాబట్టి కంటిచూపు సురక్షితంగా ఉంటుందని పరిశోధకులు అంటున్నారు. ఈ కడ్డీలు కంటిచూపును ఏమాత్రం దెబ్బ తీయకుండా నాడీ కణాలను ప్రేరేపించగలుగుతాయని కూడా పరిశోధకులు అంటున్నారు. బ్రౌన్ యూనివర్శిటీ అభివృద్ధి చేసిన తాజా చికిత్సా విధానం, కంటిచూపు దెబ్బతిన్న రోగులకు శస్త్రచికిత్సతో పని లేని సురక్షితమైన పరిష్కారాన్ని అందించగలుగుతుంది.




డీఆర్‌డీఎల్ తయారు చేసిన కార్బన్ ఫైబర్ కృత్రిమ పాదాలను ధరించి నడుస్తున్న వ్యక్తి

రూ.20 వేలకే కార్బన్ ఫైబర్ కృత్రిమ పాదాలు

- దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన డీఆర్‌డీఎల్
- 125 కిలోల బరువును తట్టుకోగల సామర్థ్యం

అల్వాల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాలు విరిగిన లేదా పాదం కోల్పోయిన వారికి శుభవార్త! హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్) దేశీయ పరిజ్ఞానంతో అత్యాధునిక కార్బన్ ఫైబర్ కృత్రిమ పాదాలను (కార్బన్ ఫైబర్ ప్రొస్థెటిక్ ఫూట్) అభివృద్ధి చేసింది. ఇది విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పాదాలతో పోలిస్తే దాదాపు పదిరెట్లు తక్కువ ధరకే, అంటే కేవలం 20 వేలకే అందుబాటులోకి రానుంది. బీబీనగర్ ఎయిమ్స్‌లో డీఆర్‌డీఎల్ డైరెక్టర్, శాస్త్రవేత్త జీఏ శ్రీనివాసమూర్తి, ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతేమ్ శాంతసింగ్‌తో కలిసి సోమవారం ఈ కృత్రిమ పాదాలను ఆవిష్కరించారు. రక్షణమంత్రిత్వశాఖకు చెందిన డీఆర్‌డీఎల్- డీఆర్‌డీవో సంయుక్తంగా ఈ'ఆప్టిమైజ్ కార్బన్ ఫుట్ ప్రొస్థెసిస్'ను రూపొందించాయి. దీనిని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేశారు. ఈ కృత్రిమ పాదం 125 కిలోల బరువు ఉన్న వ్యక్తులను కూడా మోయగలిగే సామర్థ్యం కలిగి ఉంది. వేగంగా నడిచేవారు, పరిగెత్తేవారు, దైనందిన పనులు చేసుకునే వారికి అనుకూలంగా 3 రకాలుగా దీనిని రూపొందించారు. తక్కువ ధరకే అందించడం దీని ప్రధాన ఉద్దేశం అని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఏకే సింగ్

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టులకు బదిలీ అయిన జస్టిస్ సీ సుమలత, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ ఏ అభిషేక్‌రెడ్డిలను మళ్లీ తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసినప్పటికీ ఆ సిఫార్సును ఇంకా కేంద్రం ఆమోదించలేదు. హైకోర్టులో మొత్తం జడ్జీల సంఖ్య 42 కాగా ప్రస్తుతం 26 మంది పనిచేస్తున్నారు. ఇద్దరు జడ్జీల బదిలీ.. ఒకరి చేరికతో ఆ సంఖ్య 25కు తగ్గనుంది.

జస్టిస్ అపరేశ్‌ది న్యాయకోవిదుల కుటుంబ వారసత్వం

న్యాయకోవిదుల కుటుంబంలో మూడో తరానికి చెందిన జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 1965 జూలై 7న డాక్టర్ రాంగోపాల్‌సింగ్, డాక్టర్ శ్రద్ధ సింగ్ దంపతులకు జన్మించారు. ఆయన తల్లివైపు కుటుంబానికి చెందిన తాత జస్టిస్ బీపీ సిన్హా సుప్రీంకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తిగా, మరో తాత అయిన జస్టిస్ శంభుప్రసాద్ సింగ్ పట్నా హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సమీప బంధువులైన జస్టిస్ బిశ్వేశ్వర్ ప్రసాద్, జస్టిస్ శివకీర్తి సింగ్ సుప్రీంకోర్టు జడ్జీలుగా పనిచేశారు. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందిన ఏకే సింగ్ 1990లో


జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ సుజోయ్‌పాల్

ఉమ్మడి పట్నా హైకోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1990 నుంచి 2000 వరకు పట్నా హైకోర్టులో, 2001 నుంచి 2012 వరకు జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా పలు కీలక కేసులు వాదించారు. 2012లో జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయయమూర్తిగా, 2014లో శాశ్వత న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2022లో జార్ఖండ్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా సేవలు అందించి, 2023లో త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి పొందారు. తాజాగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై రానున్నారు.

త్రిపురకు జస్టిస్ రామచందర్ రావు

త్రిపుర హైకోర్టు సీజేగా తెలుగువాడైన జస్టిస్ ఎంఎస్ రామచందర్ రావును నియమించారు. ఆయనను ఝార్ఖండ్ నుంచి బదిలీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన జస్టిస్ రామచందర్ రావు ఏపీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా, తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత పంజాబ్-హరియాణా కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం ఝార్ఖండ్ హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు.

రాజస్థాన్ హైకోర్టు సీజే జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాత్సవను మద్రాస్ హైకోర్టు సీజేగా, మద్రాస్ హైకోర్టు సీజే జస్టిస్ కె.పి.శ్రీరామ్‌ను రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ చేశారు. మధ్యప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక సీజేగా ఉన్న జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్‌ను అక్కడే శాశ్వత ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఢిల్లీ న్యాయమూర్తి జస్టిస్ విభు బఖ్రును, గౌహతి సీజేగా పట్నా హైకోర్టు తాత్కాలిక సీజే జస్టిస్ అశుతోష్ కుమార్‌ను నియమించారు. పట్నా హైకోర్టు సీజేగా అదే కోర్టులో జడ్జిగా ఉన్న జస్టిస్ విపుల్ మనోభాయి పంచోలిని, ఝార్ఖండ్ సీజేగా హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తార్లోక్ సింగ్ చౌహాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఇంజనీరింగ్ ఫీజు పెంపు పిటిషన్లు
చీఫ్ జస్టిస్ బెంచ్‌కు బదిలీ

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపు అంశంపై దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఏకసభ్య ధర్మాసనం ఆదేశించింది. ఇంతకు ముందు ఫీజుల పెంపుపై రెండు ఏకసభ్య ధర్మాసనాలు పరస్పర విరుద్ధ ఉత్తర్వులు ఇచ్చాయి. ఫీజు తక్షణ పెంపునకు ఒక ధర్మాసనం అనుమతి ఇచ్చింది. మరొకటి మాత్రం సత్వర ఉపశమనానికి నిరాకరించింది. ఆరు వారాల్లో ఫీజులను నిర్ణయించాలని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టిఏఎఫ్ఆర్ సి)ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ కాలేజీల ఫీజు పెంపు పిటిషన్లపై తాను విచారణ చేపట్టడం సమంజసం కాదని జస్టిస్ బీ విజయ్ సేన్‌రెడ్డి తెలిపారు. ఫీజు పెంపు పిటషన్లను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచాలని ఆదేశించారు. అవంతి ఇంజనీరింగ్ కాలేజీ తదితర కాలేజీలు ఈ పిటిషన్‌లు దాఖలు చేశాయి. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఫీజు పెంపునకు అనుమతిస్తూ సీబీఐటీకి ఇదే కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, దీనిపై రివ్యూ పిటిషన్ వేస్తామని తెలిపారు. మరో న్యాయమూర్తి వద్ద పలు కాలేజీలు పిటిషన్లు దాఖలు చేయగా, తక్షణ పెంపును నిరాకరిస్తూ సమగ్ర ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. అందువల్ల తాజాగా దాఖలైన పిటిషన్లపై తాను వాదనలు వినడం సరికాదని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి తెలిపారు.

చిత్రజ్యోతి
SINCE 1965

సహజమైన అందం... అరుదైన అభినయం



ఒకప్పుడు తెలుగు, తమిళ, కన్నడ భాషలను ఏలిన అందాల కథానాయిక బి.సరోజాదేవి. మిగిలిన రెండు భాషలతో పోలిస్తే తెలుగులో తక్కువ సినిమాలే చేసినా తన ముద్దు ముద్దు మాటలతో, సౌందర్యంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు సరోజాదేవి. తెలుగులో ఎన్టీఆర్, ఏయన్నార్, తమిళంలో ఎమ్జీఆర్, శివాజీగణేశన్, కన్నడంలో రాజ్‌కుమార్.. ఇలా మూడు భాషల్లో దిగ్గజ నటులతో నటించి ప్రేక్షకుల అభిమానం పొందారామె. ముఖ్యంగా 1955 నుంచి 84 వరకూ 29 ఏళ్ల పాటు వరుసగా 161 చిత్రాల్లో ప్రధాన పాత్రలు పోషించి చరిత్ర సృష్టించారు సరోజాదేవి. ఇవాళ షష్టి పూర్తి చేసుకున్న మగమహారాజులకు వాళ్ల యవ్వన కాలంలో ఆకట్టుకొని అలరించిన కథానాయిక సరోజాదేవి.

నటన అన్నా, సినిమాలు అన్నా ఆసక్తి లేని సరోజాదేవి నటిగా పరిచయం కావడం, గ్లామర్ కథానాయికగా పేరు తెచ్చుకోవడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. కానీ వాళ్ల నాన్నగారికి నాటకాలంటే ఇష్టం కావడంతో సరోజాదేవితో ఓ నాటకంలో బాలకృష్ణుని వేషం వేయించారు. చక్కగా అలంకరించుకుని ముద్దు ముద్దు మాటలతో సరోజాదేవి అందరినీ ఆకట్టుకున్నారు. ఒకసారి స్కూల్ వార్షికోత్సవంలో 'ఏ జిందగీ' అని పాడుతూ అభినయించడం ప్రేక్షకుల్లో ఉన్న హోన్నప్ప భాగవతార్‌కు నచ్చింది. ఆయన ఆ సమయంలో (1955)లో మహాకవి కాళిదాస' చిత్రం తీసే సన్నాహాల్లో ఉన్నారు. అందులో కథానాయిక విద్యాధరి పాత్ర సరోజాదేవితో వేయించాలని నిర్ణయించుకున్నారు. సరోజకు ఇష్టం లేకపోయినా తల్లితండ్రుల బలవంతం మీదే తన 13వ ఏట ఆ చిత్రంలో నటించారు. ఆ తర్వాత వరుసగా సినిమాల్లో అవకాశాలు రావడంతో సరోజ కూడా నటన పట్ల ఆసక్తి పెంచుకున్నారు.

ఆ పదేళ్లు ఏలేశారు

ఎన్టీఆర్ నటించి, నిర్మించిన 'పాండురంగ మహాత్మ్యం' చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఎన్టీఆర్ సరసన ఎక్కువ చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. అలాగే ఏయన్నార్ సరసన ఐదు చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏయన్నార్ కలసి నటించిన 'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో నటించే అవకాశం ఆవి



డకు వచ్చింది. ఆ సినిమాలో ఎన్టీఆర్‌కు సోదరిగా నటించి 'చిన్నన్నయ్యా' అని ముద్దు ముద్దుగా పిలవడం ఆ రోజుల్లో ఆడపిల్లలకు పెద్ద క్రేజ్. సరోజాదేవి కెరీర్‌లో మరపురాని కాలం అరవయ్యవ దశాబ్దం. ఆ పదేళ్ల కాలంలో దక్షిణాదిన మకుటం లేని మహారాణిలా వెలిగారు. ఆ రోజుల్లో ఆమెను అంధ్రుల అందాల తార అని, 'ఆంధ్రా క్లియోపాత్ర' అని పిలిచేవారు. ఆ సమయంలో దక్షిణాదిలో ఆవిడ హయ్యెస్ట్ పెయిడ్ హీరోయిన్ కూడా. తదనంతర కాలంలో ముఖ్యమంత్రులైన ఎన్టీఆర్, ఎమ్జీఆర్, జయలలితతో సరోజాదేవి కలసి నటించడం ఒక విశేషం. హీరోయిన్‌గా అవకాశాలు తగ్గిన తర్వాత హీరో కృష్ణ నిర్మించిన 'పండంటి కాపురం' చిత్రంతో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఆవిడ కొనసాగారు. హీరో



కృష్ణంరాజు నిర్మించిన 'యమధర్మరాజు' చిత్రంలోనూ సరోజాదేవి కీలక పాత్ర పోషించారు.

అభినయ సరస్వతి

తమిళ సినీ ప్రేక్షకుల హృదయాల్లో 'అభినయ సరస్వతి'గా చెరగని ముద్ర వేసుకున్న బి.సరోజాదేవి కోలీవుడ్‌లోనూ అగ్రనటిగా కొనసాగారు. ఎంజీ రామచంద్రన్, నడిగర్ తిలగం శివాజీ గణేశన్‌లతో కలిసి అత్యధిక చిత్రాల్లో నటించారు. ఎంజీఆర్‌తో 26 చిత్రాలు, శివాజీ గణేశన్‌తో 22 చిత్రాల్లో నటించిన సరోజాదేవి ఆ తర్వాత జెమిని గణేశన్, ఎస్ఎస్ రాజేంద్రన్, ముత్తురామన్, ఏవీఎం రాజన్, రవిచంద్రన్ వంటి ప్రముఖ నటులతో అనేక చిత్రాల్లో నటించారు. ఎంజీఆర్‌తో కలిసి ఆమె నటించిన చివరి చిత్రం 'అరస కట్టలై' (1967). 1960-70 దశకంలో పద్మిని, సావిత్రి, సరోజాదేవి అగ్రహీరోయిన్లుగా కొనసాగారు. సరోజాదేవి నటించిన తన వందో చిత్రం 'పెణ్ ఎండ్రాన్ పెణ్' తమిళంలో రూపుదిద్దుకోవడం గమనార్హం. తమిళంలో ఆమె చివరిసారిగా 2009లో వచ్చిన 'ఆదవన్' అనే చిత్రంలో నటించారు. ఈ చిత్రంలో సూర్య - నయనతార జంటగా నటించారు..

ఆ ఇద్దరితో వాన పాట

ఎన్టీఆర్, ఏయన్నార్ నటించిన చిత్రాల్లో వాన పాటల్లో మురిపించిన తారగా సరోజాదేవి నిలిచారు. 'ఆత్మబలం' (1964)లోని చిటపట చినుకులు పడుతూ ఉంటే' పాటలో ఏయన్నార్‌కు జోడీగా నటించిన సరోజాదేవి తన అందంతో ప్రేక్షకులను కట్టి పడేశారు. ఆ తర్వాత ఎన్టీఆర్ నటించిన 'భాగ్యచక్రం' (1968)లో 'వాన కాదు వాన కాదు.. వరదా రాజా' పాటలోనూ సరోజాదేవి అందం ప్రేక్షకులకు బంధాలు వేసింది. 'చిటపట చినుకులు' పాట చిత్రీకరించే సమయానికి సరోజాదేవికి 104 డిగ్రీల జ్వరం. అంత జ్వరంలోనూ ఆవిడ ఆ పాట చిత్రీకరణలో పాల్గొన్నారు. ఈ పాటలో సరోజాదేవి వర్షంలో పెద్దగా తడవకుండా ఓ పెద్ద కర్చీఫ్ తలకు చుట్టారు. సినిమా విడుదలయ్యాక అలా కర్చీఫ్‌ను తలకు చుట్టుకోవడం ఓ ఫ్యాషన్‌గా భావించి ఆ రోజుల్లో చాలా మంది యువతులు ఫాలో కావడం విశేషం.

పదవులు.. పురస్కారాలు

బి.సరోజాదేవికి 1969లో కేంద్రప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం లభించింది. 1992లో ఆమెను పద్మభూషణ్‌తో సత్కరించింది. ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాల నుంచి నాలుగుసార్లు ఉత్తమ నటిగా అవార్డులు అందుకొన్నారు సరోజాదేవి. 1989లో కర్నాటక ప్రభుత్వం నుంచి రాజ్యోత్సవ అవార్డు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ అవార్డ్‌తో, తమిళనాడు ప్రభుత్వం ఎమ్జీఆర్ అవార్డ్‌తో ఆవిడను సత్కరించాయి. 1989లో కేంద్రప్రభుత్వం ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా అవార్డ్‌తో గౌరవించింది. బెంగళూరు యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఇక సరోజాదేవిని వరించిన పదవుల విషయానికి వస్తే.. 1981లో కర్నాటక చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే కంఠీరవ స్టూడియోకు ఛైర్మన్‌గా ఆవిడ వ్యవహరించారు. అప్పట్లో ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ మాండ్యా లోక్‌సభ స్థానానికి పార్టీ టికెట్ ఇస్తామని ఆఫర్ చేసినా, రెండు పడవల ప్రయాణం తనకు ఇష్టం లేదని సున్నితంగా తిరస్కరించారు సరోజాదేవి. ఆవిడకంటే అందగత్తెలు, గ్లామర్ నటీమణులు ఎవరూ లేరా అంటే.. ఉండొచ్చు కానీ ఓ తరం వారి హృదయాల్లో రోజా దీపం వెలిగించిన ఘనత మాత్రం కచ్చితంగా సరోజాదేవిదే! ఆవిడ చిలుక పలుకులు, కన్నులు తిప్పే తీరు ఇప్పటికీ వెంటాడుతునే ఉంటాయి.

అభినయ సరస్వతి బి. సరోజాదేవి ఇక లేరు

● నేడు దశవారలో అంత్యక్రియలు



తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో 200కి పైగా చిత్రాల్లో నటించి 'అభినయ సరస్వతి' గా పేరొందిన బి. సరోజాదేవి(87) కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఒకప్పటి మైసూరు సంస్థానం చన్నపట్టణ పరిధిలోని దశవార గ్రామంలో 1938 జనవరి 7న ఒక్కలిగ కుటుంబంలో సరోజాదేవి జన్మించారు. తండ్రి బైరప్ప మైసూరులో పోలీసు అధికారి కాగా తల్లి రుద్రమ్మ గృహిణి. దంపతులకు నాల్గో సంతానంగా సరోజాదేవి జన్మించారు. 13వ ఏట కన్నడ సినిమాలో అడుగు పెట్టారు. 'మహాకవి కాళిదాస' 1955లో నటించడం ద్వారా ఆమెకు ఎంతో పేరు వచ్చింది. ఓవైపు కన్నడ సినిమాలలో నటిస్తూనే తెలుగు, తమిళ భాషల్లోనూ కొనసాగారు. కన్నడలో డాక్టర్ రాజ్‌కుమార్, కల్యాణ్‌కుమార్, ఉదయ్‌కుమార్, తెలుగులో ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, తమిళంలో జెమినీ గణేశన్, శివాజీ గణేశన్, ఎంజీ రామచంద్రన్‌తోపాటు హిందీలో దిలీప్‌కుమార్, రాజేంద్ర కుమార్, షమ్మీకపూర్, సునీల్‌దత్‌లతో కలసి నటించారు. సరోజాదేవి 1967 మార్చి 1న జర్మనీలో మెకానికల్ ఇంజనీర్ అయిన శ్రీహర్షను పెళ్లి చేసుకున్నారు. అప్పటికే దాదాపు వంద చిత్రాల్లో నటించిన సరోజాదేవి. భర్త శ్రీహర్ష ప్రోత్సాహంతో నటిగా కొనసాగారు. 1986లో శ్రీహర్ష గుండె పోటుతో కన్నుమూశారు.. వారికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు కాగా పెద్దకుమార్తె మృతి చెందారు.

బి.సరోజాదేవి మృతికి ఆంధ్ర, కర్ణాటక ముఖ్యమంత్రుల సంతాపం

బి.సరోజాదేవి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ప్రతిపక్షనేత ఆర్ అశోక్, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, సభాపతి హొరట్టి, ప్రముఖ నటులు రజనీకాంత్, కిచ్చా సుదీప్, ఖుష్బూ సుందర్, సిమ్రాన్ సహ పలువురు సంతాపం తెలిపారు.


బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

ఆ ప్రత్యేకత ఆమె సొంతం
- బాలకృష్ణ


ఎన్టీఆర్ అవార్డు స్వీకరిస్తూ...

సరోజాదేవి మృతిపై నందమూరి బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. 'దక్షిణ భారత సినీ పరిశ్రమలో ఒకప్పుడు ధ్రువతారగా వెలుగొందిన బి.సరోజాదేవి ఇక లేరు అన్న వార్త ఎంతో బాధాకరం. మా తండ్రి ఎన్టీఆర్‌తో దాదాపు 20 చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. ఆయనతో శ్రీరాముడి పక్కన సీతాదేవిగా, రావణాసురుడి పక్కన మండోదరిగానూ నటించిన ప్రత్యేకత ఆమె సొంతం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు

సెన్సార్ సర్టిఫికెట్ వచ్చేసింది



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏ.ఎం. రత్నం నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. ఈ నెల 24న చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. పవన్ తొలిసారి చారిత్రక యోధుడి పాత్రను పోషించడంతో సినిమాపై అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. ఇప్పటి వరకూ విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. రెండు గంటలా 42 నిమిషాల నిడివి ఉన్న ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్‌ను ఇచ్చింది సెన్సార్ బోర్డ్. త్వరలోనే ఈ చిత్రం నుంచి మేకింగ్ వీడియోను, ఓ శక్తిమంతమైన పాటను విడుదల చేయనుంది చిత్రబృందం. అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రీ రిలీజ్ వేడుకను ఈ నెల 20న వైజాగ్‌లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్.

ఆద్యంతం వినోదం



'ఈ సినిమా ఆద్యంతం వినోదం పంచుతుంది. ప్రేక్షకులు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. అవుట్ అండ్ అవుట్ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది' అని అన్నారు హీరో మనోజ్ చంద్ర. ఆయన కథానాయకుడిగా ప్రవీణ పరుచూరి దర్శకత్వంలో నటించిన 'కొత్తపల్లిలో ఒకప్పుడు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మనోజ్ చంద్ర మీడియాతో మాట్లాడుతూ 'ఇది ఒక ఊరి కథ. ఇందులో నేను రామకృష్ణ అనే పాత్రలో కనిపిస్తాను. అప్పన్న అనే ఒక వడ్డీ వ్యాపారి దగ్గర పనిచేస్తుంటాను. అప్పులు వసూలు చేయడం నా పని. రామకృష్ణకి ఒక రికార్డింగ్ స్టూడియో కూడా ఉంటుంది. అలాగే సావిత్రి అంటే రామకృష్ణకు ఇష్టం. ఒక రోజు ఆమెను కలవడానికి గడ్డి వాము దగ్గరకు వెళ్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందనేది తెరపై చూడాల్సిందే. రామకృష్ణ పాత్ర సవాలుతో కూడుకొన్నది. సినిమా అద్భుతంగా వచ్చింది' అని అన్నారు.



సందేశాత్మక చిత్రం

సన్ని అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, షాయాజీ షిండే తదితరులు నటించిన చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో తూలికా తనిష్క్ క్రియేషన్స్ బేనర్‌పై బెల్లి జనార్దన్ నిర్మించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిత్రం తొలి టికెట్‌ని లాంచ్ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మట్టి కవి బెల్లి యాదయ్య మాట్లాడుతూ 'సినిమాలోని సన్నివేశాలను రియల్ లొకేషన్స్‌లో చిత్రీకరించారు. ఈ చిత్రం సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుంది' అని అన్నారు. నిర్మాత బెల్లి జనార్దన్ మాట్లాడుతూ 'మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. చిత్ర దర్శకుడు బాబ్జి మాట్లాడుతూ 'రొటీన్ చిత్రాలకు భిన్నంగా మా సినిమా ఉంటుంది. ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు మంచి సందేశాన్ని ఇవ్వబోతున్నాం' అని అన్నారు.

నూతన చిత్రం షురూ!



విశాల్ హీరోగా ఓ నూతన చిత్రం ప్రారంభమైంది. 'విశాల్ 35' వర్కింగ్ టైటిల్. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిల్మ్స్ పతాకంపై ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్నారు. ఇది వారు నిర్మించే 99వ చిత్రం కావడం విశేషం. రవి అరసు దర్శకత్వం వహిస్తున్నారు. 'వీర ధీర శూరన్', 'రాయన్' ఫేమ్ దుషార విజయన్ కథానాయిక. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హీరోలు కార్తీ, జీవా, దర్శకులు వెట్రిమారన్, శరవణ సుబ్బయ్య తదితరులు హాజరయ్యారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఎన్‌బీ శ్రీకాంత్, సినిమాటోగ్రాఫర్: రిచర్డ్ ఎం.నాథన్, సంగీతం: జీవి ప్రకాశ్‌కుమార్.

అందర్నీ ఆకట్టుకుంటుంది



టీఎస్‌ఆర్ నటిస్తూ నిర్మించిన చిత్రం 'మిస్టర్ రెడ్డి'. వెంకట్ వోలాద్రి దర్శకత్వం వహించారు. మహదేవ్, అనుపమ ప్రకాశ్, దీప్తి శ్రీరంగం ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ శుక్రవారం సినిమా థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో, నిర్మాత టీఎస్‌ఆర్ మాట్లాడుతూ 'ఇది నా జీవితంలో జరిగిన కథే. ఇందులోని ప్రేమ కథ అందర్నీ ఆకట్టుకుంటుంది' అని అన్నారు. దర్శకుడు వెంకట్ వోలాద్రి మాట్లాడుతూ 'మహదేవ్, అనుపమ, దీప్తి అందరూ అద్భుతంగా నటించారు. రాజన్న ఓ ఫైట్ సీక్వెన్స్‌ను బాగా తీశారు. సినిమా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. హీరో మహదేవ్ మాట్లాడుతూ ' మూవీని థియేటర్లలో అందరూ తప్పకుండా చూడాలి' అని కోరారు.

కిరీటి మరో ప్రామిసింగ్ హీరో అవుతాడు

- శివరాజ్‌కుమార్



వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా రాధాకృష్ణ తెరకెక్కించిన చిత్రం 'జూనియర్'. శ్రీలీల హీరోయిన్. రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ నెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ "కిరీటి రూపంలో పరిశ్రమకు మరో ప్రామిసింగ్ హీరో దొరికాడు. లీడ్ పెయిర్ కెమిస్ట్రీ బాగుంది. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "కిరీటికి చిన్నప్పటి నుంచి యాక్టింగ్, డ్యాన్స్ అంటే ఇష్టం. నా తనయుడిపై అందరి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను" అని గాలి జనార్ధన్ రెడ్డి అన్నారు. "ఇంత మంచి సినిమాతో లాంచ్ కావడం ఆనందంగా ఉంది. విజువల్‌గా సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది" అని కిరీటి రెడ్డి చెప్పారు.

బిజినెస్

వరంగల్ ● మంగళవారం 15 జూలై 2025

ఎల్ఐసీ చీఫ్‌గా దొరైస్వామి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) కొత్త సారథిగా ఆర్ దొరైస్వామి నియమితులయ్యారు. మూడు సంవత్సరాల కాలానికి ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా ఆయనను నియమిస్తూ ఆర్థిక సర్వీసుల శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2028 ఆగస్టు 28 వరకు అంటే 62 సంవత్సరాల వయసు వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. ఎల్ఐసీలో ఎండీ, సీఈఓతో పాటు నలుగురు మేనేజింగ్ డైరెక్టర్లుంటారు.



ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.444.79 కోట్ల డివిడెండ్‌ను అందించింది. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు యూకో బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు.

ఐటీ కొలువుల్లో చిన్న నగరాల హవా

జాబితాలో విశాఖపట్నం, వరంగల్.. 50 శాతానికి పైగా వృద్ధి: టీమ్‌లీజ్



న్యూఢిల్లీ: ఐటీ కొలువుల నియామకాల వృద్ధి రేటులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, తెలంగాణలోని వరంగల్ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు.. మెట్రో నగరాలను మించిపోతున్నాయి. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో ఈ నగరాల్లో ఐటీ నియామకాలు, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 50 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో ఐటీ కొలువుల నియామకాల వృద్ధి రేటు 12 నుంచి 15 శాతం మించలేదు. కంపెనీలకు నియామక సేవలు అందించే టీమ్‌లీజ్ డిజిటల్ సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ప్రధాన ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు అన్నిటిలోనూ ఇదే ట్రెండ్ కనిపిస్తోందని ఆ సంస్థ పేర్కొంది.

ఇతర ప్రధానాంశాలు

- కొవిడ్ తర్వాత ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపై ఐటీ కంపెనీల దృష్టి
- కోయంబత్తూరు, నాగ్‌పూర్, నాసిక్ నగరాల్లో 20-25 శాతం పెరిగిన నియామకాలు
- ఇండోర్, జైపూర్‌లలో 30 నుంచి 40 శాతం పెరిగిన ఐటీ నియామకాలు
- సహాయ ఉద్యోగుల నియామకాలు ప్రధాన నగరాల్లో 8-15% పెరిగితే.. చిన్న నగరాల్లో 24-31% పెరుగుదల
- మైసూరులో జెనరేటివ్ ఏఐతో సహా డిజిటల్ టెక్నాలజీల నియామకాలు 32 శాతం అప్
- ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఐటీ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, అంతర్జాతీయ ప్రముఖ సంస్థల రాకతో పుంజుకున్న చిన్న నగరాలు.
- ప్రధాన నగరాల్లో స్టార్టప్‌ల పోటీని తట్టుకోలేక చిన్న నగరాల బాట పట్టిన ఐటీ కంపెనీలు.
- ఫుల్ స్టాక్ డెవలపర్లు, ఏఐ, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్లు, సైబర్ సెక్యూరిటీ అనలిస్టులు, క్లౌడ్ స్పెషలిస్టులకు మంచి డిమాండ్

ఆరేళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

జూన్‌లో 2.1 శాతంగా నమోదు
2019 జనవరి తర్వాత ఇదే తక్కువ
వడ్డీ రేట్లు మరింత దిగొచ్చే చాన్స్

న్యూఢిల్లీ: వరుసగా కొన్ని నెలలుగా తగ్గుతూ వస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో మరింతగా తగ్గి 2.1 శాతానికి దిగొచ్చింది. ఇది ఆరేళ్ల కనిష్ఠ స్థాయి. 2019 జనవరిలో నమోదైన 1.97% తర్వాత ద్రవ్యోల్బణం ఇంత దిగువకు రావడం ఇదే ప్రథమం. అలాగే రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం వరుసగా ఇది ఎనిమిదో నెల. రుతుపవనాలు సకాలంలో రావడం, విస్తృతంగా వ్యాపించడం కారణంగా ఆహార వస్తువుల ధరలు.. ప్రత్యేకించి కూరగాయల ధరలు -19 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. ఇవి కాకుండా పప్పులు, పప్పు ఉత్పత్తులు (-11.76%), మాంసం, చేపలు (-1.62%), తృణ ధాన్యాలు, అనుబంధ ఉత్పత్తులు; చక్కెర, కన్ఫెక్షనరీ, పాలు, పాల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాల (-3.03%) ధరలు కూడా జూన్‌లో గణనీయంగా తగ్గాయని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తెలిపింది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మే నెలలో 2.82 శాతం ఉండగా గత ఏడాది జూన్‌లో 5.08 శాతంగా ఉంది.

రెపో మరింత తగ్గుతుందా...?

గత నవంబరు నుంచి ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం అది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్‌బీఐ) ప్రభుత్వం నిర్దేశించిన ద్రవ్యోల్బణం కట్టడి కనిష్ఠ పరిమితి 2 శాతానికి (ఎగువకు లేదా దిగువకు 2% సర్దుబాటుతో 4% స్థాయికి కట్టడి) అతి చేరువకు వచ్చింది. ఈ కారణంగా వచ్చే నెల మొదటి వారంలో జరుగనున్న ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో వడ్డీ రేటు మరింతగా తగ్గించవచ్చని అంటున్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ రెపో రేటును 1 శాతం మేరకు తగ్గించింది. ఆగస్టులో మరో 0.25 శాతం తగ్గించవచ్చని భావిస్తున్నట్టు ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ అన్నారు.

తెలంగాణలో కనిష్ఠం

ప్రాంతాలవారీగా చూసినట్టయితే రిటైల్ ద్రవ్యోల్బణం తెలంగాణలో అత్యంత కనిష్ఠం 0.93 శాతంగా ఉండగా కేరళలో అత్యంత గరిష్ఠం 6.71 శాతంగా నమోదైంది. అంతే కాదు.. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ సగటు కన్నా తక్కువ స్థాయిలో 1.72 శాతం ఉండగా పట్టణ ప్రాంతాల్లో 2.56 శాతంగా ఉంది.

టోకు ధరలదీ అదే దారి

టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) అయితే 19 నెలల విరామం అనంతరం నెగిటివ్ జోన్‌లోకి వచ్చిందని గణాంకాలు చెబుతున్నాయి. ఇది జూన్‌లో 0.13 శాతంగా ఉంది. మే నెలలో ఇది 0.39% ఉండగా గత జూన్‌లో 3.43 శాతంగా ఉంది. టోకు ధరల సూచీలోని ఆహార వస్తువుల విభాగం 3.75 శాతం ప్రతి ద్రవ్యోల్బణాన్ని నమోదు చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	496
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	88	విజయవాడ	94
వరంగల్	88	గుంటూరు	99
కరీంనగర్	88	ఒంగోలు	102
మహబూబ్‌నగర్	88	చిత్తూరు	100
కర్నూలు	88	నెల్లూరు	105
విశాఖపట్నం	81	అనంతపురం	105
గోదావరి	94		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,880 ▲	91,550 ▲	1,25,000 ▲
విజయవాడ	1,01,450 ▲	95,300 ▲	1,16,700 ▲
విశాఖపట్నం	1,00,900 ▲	91,550 ▲	1,25,000 ▲
రాజమండ్రి	99,870 ▲	91,550 ▲	1,15,800 ▲
ప్రొద్దుటూరు	98,000 ▲	90,160 ▲	1,12,800 ▲
ముంబై	98,303 ▲	90,045 ▲	1,13,867 ▲

నాలుగో రోజూ నష్టాలే..

సెన్సెక్స్ 247 పాయింట్లు డౌన్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాలు చవిచూశాయి. ఐటీ రంగ షేర్లలో అమ్మకాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 490 పాయింట్లు క్షీణించింది. మళ్లీ కాస్త కోలుకున్న సూచీ.. చివరికి 247.01 పాయింట్ల నష్టంతో 82,253.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67.55 పాయింట్లు కోల్పోయి 25,082.30 వద్ద ముగిసింది.

పీఈ ఇన్వెస్టర్ల చేతికి వీఐపీ ఇండస్ట్రీస్

న్యూఢిల్లీ: ప్రముఖ లగేజ్, ట్రావెల్ యాక్సెసరీస్ తయారీ కంపెనీ వీఐపీ ఇండస్ట్రీస్ యాజమాన్యం చేతులు మారుతోంది. ఈ కంపెనీ ప్రమోటర్లు అయిన దిలీప్ పిరామల్, అతని కుటుంబ సభ్యులకు కంపెనీ ఈక్విటీలో ఉన్న వాటా నుంచి 32 శాతం వాటాను మల్టిపుల్స్ ప్రైవేట్ ఈక్విటీ అనే ఆల్టర్‌నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి ఇద్దరి మధ్య స్పష్టమైన ఒప్పందం కుదిరింది. దీంతో మల్టిపుల్ పీఈ సంస్థ ప్రజల నుంచి మరో 26 శాతం వాటాను ఒక్కో షేరు రూ.388 చొప్పున కొనుగోలు చేసేందుకు త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది.

ఎస్క్రో ఖాతాలో రూ.4,843 కోట్లు జమ

జేన్ స్ట్రీట్

న్యూఢిల్లీ: సెబీ ఆదేశానుసారంగా ఎస్క్రో ఖాతాలో రూ.4,843.57 కోట్లు జమ చేసిన అమెరికన్ హెడ్జ్ ఫండ్ కంపెనీ జేన్ స్ట్రీట్. తమపై విధించిన కొన్ని ఆంక్షలను ఎత్తివేయాలని నియంత్రణ మండలిని కోరింది. జేన్ స్ట్రీట్ అభ్యర్థనను పరిశీలిస్తున్నామని సెబీ పేర్కొంది. మోసపూరిత ట్రేడింగ్ వ్యూహాల ద్వారా మార్కెట్ నుంచి అక్రమంగా వేల కోట్లు ఆర్జించిన జేన్ స్ట్రీట్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను ఎస్క్రో ఖాతాలో జమ చేయాలని ఆదేశించింది.

వెండి రూ.5,000 జంప్

» ఢిల్లీలో రూ.1.15 లక్షలకు చేరిన కిలో ధర

న్యూఢిల్లీ: వెండి కొండెక్కుతోంది. ఢిల్లీ మార్కెట్లో కిలో ధర ఏకంగా రూ.5,000 పెరుగుదలతో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1.15 లక్షలకు చేరింది. హైదరాబాద్ మార్కెట్లోనైతే రూ.1.25 లక్షలు పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో దీని రేటు 14 ఏళ్ల (2011 సెప్టెంబరు తర్వాత) గరిష్ఠ స్థాయి 39.02 డాలర్లకు ఎగబాకడంతో దేశీయంగానూ అమాంతం పెరిగింది. అంతర్జాతీయంగా పారిశ్రామిక రంగాల్లో, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీలో వెండి వినియోగం భారీగా పెరుగుతుండటం, ట్రంప్ సుంకాలతో నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, బులియన్ ఇన్వెస్టర్లు బంగారానికి ప్రత్యామ్నాయంగా వెండిలో పెట్టుబడులు పెంచుకోవడం ఈ ర్యాలీకి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా, మేలిమి (99.9% స్వచ్ఛత) బంగారం రేటు దేశ రాజధానిలో రూ.200 పెరిగి రూ.99,570కి చేరగా.. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ మూడు వారాల గరిష్ఠ స్థాయి 3,369 డాలర్లకు చేరింది.

విమానాశ్రయాల సమీపంలోని ఇళ్లకు భలే గిరాకీ

4 ఏళ్లలో 120% వరకు పెరిగిన ధర

న్యూఢిల్లీ: ప్రస్తుతం లేదా ప్రతిపాదిత విమానాశ్రయాల సమీపంలోని ఇళ్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. గత నాలుగేళ్లలో బెంగుళూరు, హైదరాబాద్, నవీ ముంబై, గ్రేటర్ నోయిడా ఎయిర్‌పోర్టులకు సమీపంలో ఉన్న ఇళ్ల ధరలు ఏకంగా 70 నుంచి 120 శాతం వరకు పెరిగాయి. స్క్వేర్ యార్డ్ అనే రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ ఈ విషయం తెలిపింది. ఈ ప్రాంతాల్లో గత నాలుగేళ్లలో ఇళ్లు, ఫ్లాట్లతో పాటు ఇళ్ల స్థలాల ధరలూ ఇదే స్థాయిలో పెరిగాయి. అయితే ఇదే సమయంలో ఆయా నగరాల్లోని ఇతర ప్రాంతాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల ధరల పెరుగుదల 45 నుంచి 93 శాతం వరకు పెరిగాయి.

తగ్గిన హెచ్‌సీఎల్ టెక్ లాభం

క్యూ1లో 9.7% క్షీణత. రూ.3,843 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌సీఎల్ టెక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో 9.7 శాతం క్షీణించి రూ.3,843 కోట్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.4,257 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 8.1 శాతం పెరిగి రూ.28,057 కోట్ల నుంచి రూ.30,349 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంతో పోల్చితే మాత్రం లాభం 10.7% క్షీణించగా ఆదాయం నామమాత్రంగా 0.3% పెరిగింది. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో ఈ ఏడాది ఆదాయ వృద్ధి అంచనాలను కంపెనీ 3-5 శాతానికి పరిమితం చేసింది. స్థిర కరెన్సీ విలువల ఆధారంగా సేవల విభాగం వ్యాపారం 4.5% వృద్ధిని సాధించిందని, వార్షిక ప్రాతిపదికన ఆదాయం 3.7% వృద్ధిని నమోదు చేసిందని కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ కుమార్ అన్నారు. అయితే తక్కువ వినియోగం, జెనరేటివ్ ఏఐ, జీటీఎం విభాగాల్లో అదనపు పెట్టుబడుల కారణంగా నిర్వహణాపరమైన మార్జిన్ 16.3 శాతం ఉన్నట్టు ఆయన చెప్పారు.

రూ.12 మధ్యంతర డివిడెండ్: 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ గల ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. ఇందుకు రికార్డు తేదీని జూన్ 18గా నిర్ణయించారు. ఈ నెల 28వ తేదీన వాటాదారులకు డివిడెండు చెల్లిస్తారు.

స్పోర్ట్స్

నాయర్‌కు ఇక నో?!

మూడు టెస్టుల్లోనూ విఫలం
సాయి సుదర్శన్‌కు చాన్స్?





సాయి సుదర్శన్

న్యూఢిల్లీ : దేశవాళీ పోటీల్లో పరుగుల వరద పారిస్తుండడంతో వయసు (34) కూడా చూడకుండా అవకాశాలిస్తే వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఇంగ్లండ్‌తో ప్రస్తుత సిరీస్‌లోని మూడు టెస్టుల్లో వరుసగా 0, 20, 31, 26, 40, 14 స్కోర్లతో కనీసం ఒక్క ఫిఫ్టీ కూడా చేయలేకపోయాడు. 22 కంటే తక్కువ సగటుతో మూడు టెస్ట్‌ల్లో కలిపి 131 రన్స్ మాత్రమే చేశాడు. పైగా..బ్యాటింగ్ టెక్నిక్‌లో లోపాలు లేకపోలేదు. ఇవన్నీ చూస్తుంటే వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ తన కెరీర్‌లో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడేసినట్టే కనిపిస్తోంది. ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన కరుణ్..ఇంగ్లండ్ పర్యటనను ప్రశంసనీయ రీతిలోనే ఆరంభించాడు. ఇంగ్లండ్ లయన్స్‌తో మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేయడం ద్వారా టెస్ట్ తుది జట్టులో తనకు చోటు కల్పించక తప్పని పరిస్థితి కల్పించాడు. కానీ పేలవ ప్రదర్శనతో సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. భారత టెస్ట్ జట్టు భావి ఆటగాడిగా విశ్లేషకులు అంచనా వేస్తున్న 21 ఏళ్ల సాయి సుదర్శన్‌కు నాలుగో టెస్ట్‌లో అవకాశం ఇవ్వడమే సబబని మాజీ సెలెక్టర్ దేవంగ్ గాంధీ, మాజీ కీపర్ దీప్‌దాస్ గుప్తా అభిప్రాయపడ్డారు.

ఉత్కంఠ పోరులో.. లార్డ్స్ చేజారె!

పోరాడి ఓడిన భారత్
రెండో ఇన్నింగ్స్‌లో 170 ఆలౌట్
22 పరుగులతో ఇంగ్లండ్ విజయం
జడేజా అజేయ అర్ధసెంచరీ



ఇంగ్లండ్ ఆటగాళ్ల విజయహేల





జడేజా (61నాటౌట్)

ఆహా.. ఇది కదా టెస్టు క్రికెట్ మజా అంటే.. టీ20 జోరులో ఐదు రోజుల ఆటను బోరింగ్‌గా ఫీలయ్యే నేటి తరానికి విఖ్యాత లార్డ్స్ మైదానంలో భారత్ సాగించిన పోరాటాన్ని చూపాల్సిందే.. 193 పరుగుల ఛేదనలో 112 రన్స్‌కే 8 వికెట్లు కోల్పోయిన గడ్డు స్థితిలో జడేజా వీరోచితంగా నిలబడిన తీరు అపూర్వం. మరో ఎండ్‌లో బుమ్రా, సిరాజ్ ఏపాటి క్రీజులో నిలుస్తారులే అని అంతా భావించినా.. చక్కటి వ్యూహంతో జడేజా వీరి అండతోనే భారత్ పోరాటాన్ని మరో 35 ఓవర్లపాటు కొనసాగించి టెస్టుపై ఆశలు రేపాడు. కానీ ఆఖరి సెషన్ ఆరంభంలో విజయానికి 22 పరుగుల దూరంలో భారత్ అద్వితీయ సమరానికి చెక్ పడింది. తొలి సెషన్‌లో నాలుగు కీలక వికెట్లతో దెబ్బతీసి పైచేయి సాధించిన ఇంగ్లండ్ చివరికి మూడో టెస్టును దక్కించుకుంది.

లండన్: ఇంగ్లండ్‌తో ఉత్కంఠ భరితంగా ముగిసిన మూడో టెస్టులో టీమిండియా పోరాటం ఫలితాన్నివ్వలేదు. టెయిలెండర్ల అండతో విజయం కోసం పట్టు వదలకుండా ప్రయత్నించినా దురదృష్టం వెంటాడింది. ఫలితంగా 193 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన గిల్ సేన ఆదివారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్‌లో 170 పరుగులకు ఆలౌటైంది. దీంతో 22 పరుగుల తేడాతో గట్టెక్కిన ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్‌లో 2-1తో ఆధిక్యం సాధించింది. జడేజా (181 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 61 నాటౌట్), రాహుల్ (39) మాత్రమే రాణించారు. స్టోక్స్, ఆర్చర్‌లకు మూడేసి, కార్స్‌కు రెండు వికెట్లు దక్కాయి.ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 387, భారత్ 387 పరుగులు సాధించగా.. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 192 రన్స్ చేసింది. స్టోక్స్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

వణికించిన ఆర్చర్

58/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఆఖరి రోజు ఛేదన ఆరంభించిన భారత జట్టు రాహుల్, పంత్ (9) బ్యాటింగ్‌పైనే ఆశలు పెట్టుకుంది. కానీ విజయం కోసం మరో 135 పరుగులు కావాల్సి ఉండగా, అటు ఇంగ్లండ్ పేసర్ల సవాల్‌ను వీరితోపాటు ఇతర బ్యాటర్లు కూడా సరిగ్గా ఎదుర్కోలేకపోయారు. ఫలితంగా తొలి సెషన్ ముగిసే సరికి 112/8 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడింది. రాహుల్, పంత్ క్రీజులో నిలిస్తే గెలుపు సులువే అని అంతా భావించారు. కానీ ఈ జోడీ 18 బంతుల తేడాతో పెవిలియన్‌కు చేరింది. వేలి నొప్పితో బాధపడుతున్న పంత్.. ఆర్చర్ పేస్‌ను ఆడేందుకు ఇబ్బందిపడ్డాడు. అయితే తన ఓవర్లలోనే రెండు ఫోర్లు బాదినా ఓ అద్భుత బంతికి బౌల్డయ్యాడు. ఇక కాసేపటికే కీలక రాహుల్‌ను స్టోక్స్ ఎల్బీ చేయగా, తర్వాతి ఓవర్‌లో సుందర్‌ను సూపర్ రిటర్న్ క్యాచ్‌తో ఆర్చర్ అవుట్ చేశాడు. ఇలా తొలి గంట ఆటలోనే మూడు వికెట్లు కోల్పోయి 82/7 స్కోరుతో నిలిచింది. ఈ స్థితిలో చివరి స్పెషలిస్ట్ బ్యాటర్లు జడేజా-నితీశ్ పట్టు వదలకుండా క్రీజులో నిలిచి బౌలర్లను విసిగించారు. చివరి ఓవర్‌లో నితీశ్‌ను పేసర్ వోక్స్ అవుట్ చేయడంతో 112/8తో జట్టు బ్రేక్‌కు వెళ్లింది. తొలి సెషన్‌లో స్టోక్స్ వరుసగా 9 ఓవర్లు వేయడం విశేషం.

అదిరే పోరాటంతో..

లక్ష్యం 81 పరుగులు.. ఉన్నవి రెండే వికెట్లు. రెండో సెషన్ సమయానికి గెలిచేందుకు భారత్ ముందున్న పరిస్థితి ఇది. అయితే అనూహ్యంగా బుమ్రా (5), సిరాజ్ (4)ల నుంచి జడేజాకు అద్భుతమైన సహకారం లభించింది. ఓవర్‌లో నాలుగు నుంచి ఐదు బంతులు తానే ఆడడం.. చివరి బంతిని వీరికి వదిలేసే ప్లాన్‌తో జడ్డూ బ్యాటింగ్ సాగించాడు. వోక్స్ ఓవర్‌లో జడేజా ఎల్బీ అయినా రివ్యూ ద్వారా బతికిపోయాడు. బుమ్రాను స్టోక్స్ అవుట్ చేయడంతో తొమ్మిదో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి వికెట్ మిగిలి ఉండడంతో ఈ సెషన్‌ను మరో అర్ధగంట పాటు పొడిగించారు. అయినప్పటికీ ఇంగ్లండ్ పేసర్ల బంతులను కాచుకున్న జడ్డూ-సిరాజ్ జోడీ వికెట్‌ను మాత్రం కోల్పోలేదు. జడ్డు ఎక్కువగా తనే స్ట్రయికింగ్ వచ్చేలా చూసుకున్నాడు. చివరకు 150 బంతుల్లో తన కెరీర్‌లోనే నెమ్మదైన అర్ధసెంచరీని సైతం పూర్తి చేశాడు. ఇక విజయానికి 30 పరుగుల దూరంలో జట్టు టీ బ్రేక్‌కు వెళ్లింది. కానీ ఆ తర్వాత భారత్ పోరాటం మరో ఐదు ఓవర్లకే పరిమితమైంది. స్పిన్నర్ బషీర్ ఓవర్‌లో సిరాజ్ ఐదో బంతిని బ్యాక్‌ఫుట్‌తో డిఫెండ్ చేశాడు. కానీ కింద పడగానే బంతి అతడి ప్యాడ్స్ పక్కనుంచి లెగ్ స్టంప్‌ను తాకింది. సిరాజ్ గమనించేలోపే బెయిల్స్ కూడా కిందపడడంతో తను షాక్‌తో క్రీజులో కుప్పకూలగా.. అటు స్టోక్స్ సేన సంబరాలు మిన్నంటాయి.



స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387;
భారత్ తొలి ఇన్నింగ్స్: 387;
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 192.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) ఆర్చర్ 0; రాహుల్ (ఎల్బీ) స్టోక్స్ 39; కరుణ్ (ఎల్బీ) కార్స్ 14; గిల్ (ఎల్బీ) కార్స్ 6; ఆకాశ్ (బి) స్టోక్స్ 1; పంత్ (బి) ఆర్చర్ 9; జడేజా (నాటౌట్) 61; సుందర్ (సి అండ్ బి) ఆర్చర్ 0; నితీశ్ (సి) స్మిత్ (బి) వోక్స్ 13; బుమ్రా (సి-సబ్) సామ్ కుక్ (బి) స్టోక్స్ 5; సిరాజ్ (బి) బషీర్ 4; ఎక్స్‌ట్రాలు: 18; **మొత్తం: 74.5 ఓవర్లలో 170 ఆలౌట్;** వికెట్ల పతనం: 1-5, 2-41, 3-53, 4-58, 5-71, 6-81, 7-82, 8-112, 9-147, 10-170; **బౌలింగ్:** వోక్స్ 12-5-21-1; ఆర్చర్ 16-1-55-3; స్టోక్స్ 24-4-48-3; కార్స్ 16-2-30-2; రూట్ 1-0-1-0; బషీర్ 5.5-1-6-1.

1 లార్డ్స్‌లో జరిగిన టెస్టుల్లో ఎక్కువ సార్లు (4) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన స్టోక్స్

2 లార్డ్స్‌లో జరిగిన టెస్టుల్లో రెండు ఇన్నింగ్స్‌లోనూ 50+ స్కోర్లు సాధించిన రెండో భారత బ్యాటర్‌గా జడేజా. 1952లో వినూ మన్కడ్ ఈ ఫీట్ సాధించాడు.

3 ఇంగ్లండ్‌లో భారత్ తరఫున వరుసగా నాలుగు 50+ స్కోర్లు సాధించిన మూడో బ్యాటర్‌గా జడేజా. పంత్ (5), గంగూలీ (4) ముందున్నారు.

సిరాజ్‌కు జరిమానా

పేసర్ మహ్మద్ సిరాజ్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు. అలాగే అతడి ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చారు. నాలుగో రోజు ఆటలో డకెట్ వికెట్ తీసిన ఆనందంలో అతడు దూకుడుగా వ్యవహరించాడు. డకెట్ మొహం దగ్గరికి వెళ్లి అతడి భుజాన్ని ఢీకొట్టడం ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధం కావడంతో రెఫరీ ఈ నిర్ణయం తీసుకున్నారు.

టైటిల్‌పై సాత్విక్ జోడీ గురి

జపాన్ ఓపెన్



టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టైటిల్‌పై భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి గురి పెట్టింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మూడు టోర్నీల్లో సెమీస్ చేరిన సాత్విక్ జోడీ టైటిల్ సాధించలేకపోయింది. అయితే మంగళవారం నుంచి జరుగనున్న ఈ టోర్నీతో ఆ లోటును భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక, చాలా కాలంగా ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్న స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, పీవీ సింధు సింగిల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరితో పాటు ఉన్నతి హుడా, అనుపమ ఉపాధ్యాయ, రక్షిత రామ్‌రాజ్, డబుల్స్‌లో హరిహరన్-రుబాన్ కుమార్, కవిప్రియ-సిమ్రాన్ సింగీ, రుతుపర్ణ-శ్వేతపర్ణ జోడీలు బరిలోకి దిగుతున్నాయి.

ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ కోచ్‌గా వరుణ్



హైదరాబాద్: ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తమ కొత్త బౌలింగ్ కోచ్‌గా భారత మాజీ పేసర్ వరుణ్ ఆరోన్‌ను నియమించుకుంది. న్యూజిలాండ్ మాజీ పేసర్ జేమ్స్ ఫ్రాంక్లిన్ స్థానంలో వరుణ్‌ను తమ కోచింగ్ బృందంలోకి ఎస్ఆర్‌హెచ్ తీసుకుంది. 2011 నుంచి 2015 మధ్య వరుణ్ 9 టెస్టులు, 9 వన్డేల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో వరుణ్ చివరిగా ఆడాడు.

ఆసీస్‌కు ఆధిక్యం

విండీస్‌తో మూడో టెస్టు

కింగ్‌స్టన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టెస్టు (డే/నైట్)లో ఆస్ట్రేలియాకు 82 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 16/1తో బ్యాటింగ్ కొనసాగించిన వెస్టిండీస్ 143 పరుగులకు కుప్పకూలింది. క్యాంప్‌బెల్ (36) టాప్ స్కోరర్. బోలాండ్‌కు మూడు.. కమిన్స్, హేజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ రెండో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 6 వికెట్లకు 99 పరుగులు చేసింది. దీంతో ఓవరాల్‌గా 181 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. గ్రీన్ (42 బ్యాటింగ్) మాత్రమే రాణించాడు. అల్జారికి మూడు, షామర్‌కు రెండు వికెట్లు దక్కాయి.

దక్షిణాఫ్రికా బోణీ

ముక్కోణపు టీ20 సిరీస్

హరారే: జింబాబ్వే, న్యూజిలాండ్‌తో ముక్కోణపు టీ20 టోర్నీలో దక్షిణాఫ్రికా బోణీ చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో సఫారీలు ఐదు వికెట్లతో జింబాబ్వేను ఓడించారు. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 141/6 స్కోరు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా 15.5 ఓవర్లలో 142/5 స్కోరు చేసి నెగ్గింది.

సినర్, అల్కారజ్ ర్యాంకులు పదిలం

లండన్: డబ్ల్యూటీఏ తాజా ర్యాంకింగ్స్‌లో.. వింబుల్డన్ విజేత సినర్, రన్నరప్ అల్కారజ్‌లే తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. 12వేల ర్యాంకింగ్ పాయింట్లతో సినర్ నెం.1 స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 3,430 పాయింట్లతో అల్కారజ్ రెండో స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. జొకోవిచ్ తన ఆరో స్థానాన్ని దక్కించుకున్నాడు. డబుల్స్‌లో భారత స్టార్ యుకీ భాంబ్రీ 29వ ర్యాంక్‌లో ఉన్నాడు.

ప్రీ క్వార్టర్‌ఫైనల్లో హారిక

బటూమి (జార్జియా): భారత గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, వైశాలీ రమేశ్‌బాబు ఫిడే మహిళల వరల్డ్ కప్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. సోమవారం జరిగిన టైబ్రేకర్‌లో స్ట్రవోలా (గ్రీస్)పై హారిక, కరీసా (అమెరికా)పై వైశాలి విజయం సాధించి నాలుగో రౌండ్‌కు చేరారు. మరో జీఎం వంతిక అగర్వాల్ టైబ్రేకర్‌లో లగ్నో చేతిలో ఓడిపోయింది.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో
కేటీఆర్, హరీశ్‌రావు భేటీ!

» తాజా పరిస్థితులపై సుదీర్ఘ చర్చ

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావుతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సోమవారం సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో తాజా పరిస్థితులు, ఇటీవలి పరిణామాలు, ఇతర కీలకాంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్ తేవాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు, క్షేత్రస్థాయి పరిణామాలపై పార్టీ అనుసరించాల్సిన వైఖరిపై వారు సమాలోచనలు చేసినట్లు సమాచారం. ఇటీవల మరోసారి కాళేశ్వరం కమిషన్‌ను కలిసి అదనపు సమాచారం ఇచ్చిన సంగతిని కేసీఆర్‌కు హరీశ్‌రావు వివరించారని విశ్వసనీయంగా తెలిసింది. కాగా, పార్టీ పటిష్టతకు బీఆర్ఎస్ శ్రేణులతో చేపట్టాల్సిన ప్రత్యేక కార్యక్రమాలపై కేటీఆర్, హరీశ్ రావుకు పలు సూచనలు చేసిన గులాబీ బాస్.. పార్టీ అనుబంధ సంఘాలకు శిక్షణలిచ్చి..బలోపేతం చేయాలని హితవు చెప్పారు. ఈ నెల 19న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం కార్యకర్తలకు ఉప్పల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ చేపట్టాలని కేసీఆర్ సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగే వర్క్‌షాప్‌ను హరీశ్ రావు ప్రారంభిస్తే.. సాయంత్రం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముగించాలని అధినేత కేసీఆర్ నిర్ణయించినట్లు సమాచారం. అలాగే, ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు, ఆ తర్వాత పరిణామాలపైనా వారు ముగ్గురు చర్చించినట్లు తెలియవచ్చింది.

ఏబీఎన్‌కే దమ్కీ ఇచ్చే దమ్ముందా..?

» బీఆర్ఎస్‌ది అవకాశవాదం: మైనంపల్లి హన్మంతరావు

నిజాంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఓ గూండా పార్టీలా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతికే దమ్కీ ఇచ్చే దమ్ముందా..? అని మండిపడ్డారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని జడ్‌చెరువు తండాలో ప్రముఖ సంఘ సేవకుడు మోహన్ నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సభలో హన్మంతరావు మాట్లాడారు. అవకాశవాద రాజకీయాలు మానుకోవాలంటూ బీఆర్ఎస్‌కు హితవు చెప్పారు. కాంగ్రెస్ జోలికొస్తే గుసాంచి కొడతామన్నారు. తమ పార్టీ కార్యకర్తలు ఎంతో ఓపికతో ఉన్నారని, హరీశ్‌రావు లాంటివారు సీఎంపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే దాడులు తప్పవని హెచ్చరించారు.

ఆ 5 విశ్వవిద్యాలయాలపై చర్యలు తీసుకోండి

» ఐకార్‌కు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తగిన అనుమతులు లేకుండా వ్యవసాయ డిగ్రీలు అందిస్తున్న ప్రైవేటు విశ్వవిద్యాలయాలపై కఠినచర్యలు తీసుకోవాలని భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐకార్)కి సోమవారం రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. కావేరీ, మల్లారెడ్డి, అనురాగ్, గురునానక్, ఎస్ఆర్ యూనివర్సిటీలు.. ఐకార్, రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు లేకుండానే డిగ్రీ, పీజీతో పాటు పీహెచ్‌డీ వంటి వ్యవసాయ కోర్సులను నిర్వహిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ నేతలు ఐకార్ డైరెక్టర్ జనరల్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యా ప్రమాణాలు పాటించకుండా, ఐకార్ గుర్తింపు ఉందని విద్యార్థులను మోసం చేస్తున్నాయని తెలిపారు. ఏటా రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తూ వారి జీవితాలతో యూనివర్సిటీలు చెలగాటమాడుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విజయ్ మరణం విప్లవోద్యమానికి తీరని నష్టం

» యుసీసీఆర్ఐ(ఎం-ఎల్) సంస్థ కార్యదర్శి వినోద్

హైదరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం సభ్యుడు కామ్రేడ్ విజయ్(74) శనివారం రాత్రి అనారోగ్యంతో మరణించారని, ఆయన మృతి కమ్యూనిస్టు విప్లవోద్యమానికి తీరని నష్టమని యుసీసీఆర్ఐ(ఎంఎల్) సంస్థ కార్యదర్శి వినోద్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమాన్ని వ్యాప్తి చేయడానికి, వ్యవసాయ విప్లవ పోరాటాలు, విద్యార్థి ఉద్యమాల నిర్మాణానికి, సింగరేణి బెల్ట్‌లో కార్మిక పోరాటాలకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం లంకపల్లి గ్రామంలో 1951 మార్చి 19న జన్మించిన విజయ్.. ఏరోనాటిక్ ఇంజినీరింగ్ పూర్తి చేసి న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్‌లో చేరి, విప్లవోద్యమాలకు ఆకర్షితుడై ఉద్యోగానికి రాజీనామా చేశారని వినోద్ తెలిపారు.

నేడు, రేపు బీసీ సలహా మండలి సమావేశాలు

» బెంగళూరులో నిర్వహించనున్న ఏఐసీసీ

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజధాని బెంగళూరులో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఏఐసీసీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బీసీ సలహా మండలి సమావేశాలను నిర్వహించనున్నారు. సమావేశాలకు తెలంగాణ తరఫున ఏడుగురు ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరిలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, మధుయాష్కీ ఉన్నారు.

కల్లు సొసైటీలపై నిషేధానికి కుట్ర

» కల్తీ కల్లు ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

» గౌడ సంఘాల నేతల డిమాండ్

బర్కత్‌పుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కల్తీ కల్లు పేరుతో కలు సొసైటీలను నిషేధించడానికి రాష్ట్ర ప్రభుత్వం, లిక్కర్ మాఫియాలు కుట్రలు చేస్తున్నాయని గౌడ సంఘాల నేతలు ఆరోపించారు. కూకట్‌పల్లిలో జరిగిన కల్తీ కల్లు ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌడ కల్లు గీతల సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, గౌడ కల్లు గీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆయిలి వెంకన్న గౌడ్, గౌడ జనహక్కుల పోరాట సమితి అధ్యక్షుడు యెలికట్టే విజయ్‌కుమార్ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగ సదానందం గౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.దుర్గయ్యగౌడ్, బీసీ రచయితల సంఘం అధ్యక్షుడు బైరు శేఖర్ మాట్లాడారు. కల్తీ కల్లు ఘటనను తాము సమర్థించడం లేదని, కానీ దీనిని సాకుగా చూపి రాష్ట్రంలో కల్లును నిషేధించడానికి కుట్రలు జరుగుతున్నాయని, దీనివల్ల 2.25 లక్షల మంది గీత కార్మికులు వీధిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతిలో కల్లు ఒక భాగమని దీనిని నిషేధిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై గౌడ కులస్థుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌లు తక్షణమే స్పందించి కల్లు సొసైటీలపై దాడులు నిలిపి వేయాలన్నారు.

విద్యారంగ సమస్యలపై దశలవారీ పోరాటం

» ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిర్ణయం

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై దశలవారీ పోరాటం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నిర్ణయించింది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈ నెలాఖరులో పూర్తిచేయాలని, పైరవీ డిప్యూటేషన్లు రద్దు చేయాలని, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు జారీ చేసిన జీవోను సవరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్లతో ఉద్యమం ఉంటుందని ప్రకటించింది. టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలోఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సమావేశం సోమయ్య అధ్యక్షతన సోమవారం జరిగింది. నూతన డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి.. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ నెల 23, 24 తేదీల్లో తహసీల్దార్ల ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రాలు పంపడం, ఆగస్టు 1న జిల్లాల్లో, 23న హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టాలని నిర్ణయించారు.

ఆగస్టులో అసెంబ్లీ సమావేశాలు!

ఇకపై అసెంబ్లీ ప్రాంగణంలోనే మండలి కూడా.. పాత భవనానికి ముమ్మరంగా మరమ్మతులు

పునర్నిర్మాణ పనులపై మండలి చైర్మన్ సమీక్ష.. ఆగస్టు 15లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలను ఆగస్టులో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ సారి శాసనసభ, మండలి సమావేశాలు రెండూ ఒకే చోట, ఒకే ప్రాంగణంలో జరగనున్నాయి. శాసనసభ ప్రాంగణంలోనే ఉన్న పాత భవనాన్ని మండలి సమావేశాలకు వినియోగించేలా మరమ్మతులు చేస్తున్నారు. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖతో పాటు పనులు చేస్తున్న అగాఖాన్ సంస్థ ప్రతినిధులతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. చేపట్టిన పనుల గురించి అడిగి తెలుసుకున్న గుత్తా.. ఆగస్టులో నిర్వహించే సమావేశాలను ఒకే చోట నిర్వహించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. ఆగస్టు 15లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇదీ అసెంబ్లీ భవనం చరిత్ర..

ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ భవనాన్ని 1905లో ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ 40వ పుట్టిన రోజు సందర్భంగా ప్రారంభించి.. 1913నాటికి పూర్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక ఈ భవనాన్ని శాసనసభ సమావేశాలకు వినియోగించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక అసెంబ్లీ సమావేశాలను ఇందులోనే కొనసాగించగా.. మండలి సమావేశాలను దీనికి కొంత దూరంలో ఉన్న జూబ్లీహాల్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో సమావేశాల సమయంలో సీఎం, మంత్రులు ప్రత్యేకంగా అక్కడికి కార్లలో వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ హాలులోనే అందుబాటులో ఉన్న పాత భవనానికి మరమ్మతులు చేసి, మండలి సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరమ్మతులకు ఇప్పటికే రూ.40కోట్లను మంజూరు చేసింది. వారసత్వ భవనం కావడంతో ఎక్కడా చెక్కు చెదరకుండా దీనిని పునరుద్ధరిస్తున్నారు. ఇసుక, సిమెంటు స్థానంలో డంగు సున్నం, కరక్కాయ, రాతిపొడితో పాటు నల్లబెల్లాన్ని వినియోగిస్తున్నారు. 2024 జూన్ 4న అగాఖాన్ సంస్థ పనులు దక్కించుకోగా.. 8 నెలల్లో (2025 ఫిబ్రవరి 3లోగా) పూర్తిచేసి అప్పగించాల్సి ఉన్నా సాధ్యపడలేదు. తాజాగా ఆగస్టు 15నాటికి పూర్తిచేయాలని గడువు విధించారు.

కల్లు దుకాణాలపై దాడులు

రంగంలోకి దిగిన ఎక్సైజ్ శాఖ ప్రత్యేక బృందాలు

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని కల్లు కంపౌండ్లు, దుకాణాలపై దాడులు నిర్వహించాలని ఎక్సైజ్‌శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా వారం రోజులపాటు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈమేరకు ఆయా బృందాలకు సోమవారమే ఆదేశాలు జారీ కాగా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. కూకట్‌పల్లి కల్తీ కల్లు వ్యవహారం రాష్ట్రంలో సంచలనంగా మారిం. కల్తీ కల్లు తాగి పదకొండు మంది మృత్యువాత పడిన నేపథ్యంలో ఆబ్కారీ శాఖ కల్లు నమూనాలు సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షిస్తే అన్నిట్లోనూ ప్రాణాంతకమైన అల్ప్రాజోలం ఉన్నట్లు తేలినా ఆ శాఖ అధికారులు మేల్కొనకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతస్థాయి అధికారుల్లోనూ చర్చసాగింది. ఈ నేపథ్యంలో కల్లు విక్రయాలను 2004లో ఎందుకు నిలిపివేశారు.. 2014లో మళ్లీ ఎందుకు ప్రారంభించాల్సి వచ్చిందనే దానిపై ప్రభుత్వం ఆరా తీసింది. రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించాలని ఎక్సైజ్‌శాఖ అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలమేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీ.. కల్లు కంపౌండ్‌లపై స్టేట్ టాస్క్ ఫోర్స్, అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు చేయాలని సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది కూడా కల్లు దుకాణాలపై నిఘా పెట్టాలని, కల్తీ కల్లును గుర్తిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. కల్లు కంపౌండ్‌లు, కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని సొసైటీలున్నాయి.. వాటి పరిధిలోని కల్లు దుకాణాలు ఎన్ని.. వాటిలో విక్రయిస్తున్న కల్లు ఎక్కడి నుంచి సేకరిస్తున్నారో పరిశీలించనున్నారు. కల్లు శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపేలా చర్యలు తీసుకోనున్నారు. అనుమతులు లేని కల్లు దుకాణాలను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తారు. కల్లు అక్రమ రవాణా, కల్తీ కల్లు తయారు చేసేవారిపై కఠినంగా వ్యవహరించనున్నారు. లైసెన్స్‌లు లేని కల్లు దుకాణాలను సీజ్ చేయనున్నారు. కల్లు దందాల్లో సిండికేట్ వ్యవస్థనూ గుర్తించనున్నారు. కాగా కల్తీ కల్లు వ్యవహారంపై ఎక్సైజ్ కమిషనర్‌ను సీఎంవో పిలిపించి.. గతంలో ఈ సమస్యపై ఆశాఖ నుంచి తీసుకున్న నిర్ణయాలు, కల్తీ కల్లు నియంత్రణకు చేపట్టిన చర్యల గురించి వివరాలు సేకరించినట్లు తెలిసింది. 2004లో కల్తీ కల్లు వ్యవహారంపై అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. ఎక్సైజ్ అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేసి హైదరాబాద్‌లో కల్లు విక్రయాలులేకుండా చర్యలు తీసుకున్నారనే అంశం అధికారుల్లో చర్చకు వచ్చినట్లు తెలిసింది. 2004లో హైదరాబాద్‌లో కల్లు విక్రయాలను నిలువరించిన ప్రభుత్వం.. 2014లో ఏ కారణంతో మళ్లీ కల్లు విక్రయాలకు అనుమతిచ్చిందని కమిషనర్ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. కూకట్‌పల్లి కల్తీ ఘటనతో కల్లు అమ్మకాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది.



ఓ కల్లుదుకాణాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కఠినంగా వ్యవహరిస్తాం..

కల్లు అమ్మకాల్లో కల్తీ చేసినా, అల్ప్రాజోలం, డైజోఫాం వంటి నిషేధిత పదార్థాలతో కల్లు తయారు చేసి అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడితే కఠినంగా వ్యవహరిస్తాం. ఎప్పటికీ లైసెన్స్‌లు లేకుండా చేస్తాం. సొసైటీ సభ్యత్వం నుంచి సైతం తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

-ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం

కల్తీ కల్లు బాధితురాలి మృతి

» 11కు చేరిన మృతుల సంఖ్య

హైదరాబాద్ సిటీ/నిమ్స్/అడ్డగుట్ట/జీడిమెట్ల/హైదర్‌నగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కూకట్‌పల్లి కల్తీకల్లు ఘటనలో సోమవారం మరొకరు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 11కు చేరింది. హైదర్‌నగర్‌లోని రాంనరేష్‌నగర్‌కు చెందిన పుట్టి గంగామణి (40) గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. కాగా గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 16 మంది కల్తీ కల్లు బాధితుల్లో గంగామణి మృతి చెందినట్లు సూపరింటెండెంట్ రాజకుమారి తెలిపారు. ముగ్గురు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారని, మరో నలుగురినిసోమవారం డిశ్చార్జ్ చేసినట్టు చెప్పారు. మిగతా 8 మందికి ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. కల్తీ కల్లు తాగి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిలో సోమవారం ఐదుగురు డిశ్చార్జ్ అయ్యారు. మరోవైపు ఆదివారం కుత్బుల్లాపూర్‌లోని రామిరెడ్డినగర్‌లో కల్లు తాగిన భార్యాభర్తలు లచ్చిరాం, సాక్రిబాయ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. వారికి ఎలాంటి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కల్తీకల్లు ఘటనతో ఎక్సైజ్, పోలీస్ అధికారులు కొన్ని కల్లు దుకాణాల్లో సోమవారం సోదాలు నిర్వహించారు. మేడ్చల్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.మాధవయ్య, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నర్సిరెడ్డి... రామిరెడ్డినగర్‌లోని కేకే ఓనర్స్ సొసైటీలో ఉన్న కల్లు షాపును పరిశీలించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో
గందరగోళం

» సీట్ల కేటాయింపులో ఎడతెగని జాప్యం

» అభ్యర్థులు, తల్లిదండ్రుల ఆందోళన

హైదరాబాద్ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ర్యాంకులు పొందిన విద్యార్థులకు సీట్ల కేటాయింపులో అధికారులు ఎడతెగని జాప్యం చేస్తున్నారు. ఇప్పటికే అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య ప్రతియేటా తగ్గుముఖం పడుతుండగా, అధికారుల నిర్లక్ష్యంతో ఆసక్తి కలిగిన అభ్యర్థులు కూడా ఇంటర్మీడియట్ బాట పడుతున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 4లోపు తొలివిడత, 15 లోపు తుదివిడత సీట్ల కేటాయింపులను పూర్తిచేసి, సీట్లు పొందిన విద్యార్థులకు 17 నుంచి అకాడమిక్ సెషన్ ప్రారంభించాల్సి ఉంది. అయితే మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియనే పూర్తిచేయని సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు రెండోవిడత కౌన్సెలింగ్ ఎన్నటికి ముగిస్తారోనని అభ్యర్థులు, తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. అకాడమిక్ సెషన్, క్లాస్‌వర్క్ ప్రారంభించే విషయమై అధికారులు స్పష్టమైన తేదీలను ప్రకటించాలని, తొలివిడత సీట్ల కేటాయింపు వివరాలను తక్షణం వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

పెరిగిన ఫీజుల చెల్లింపుపై స్పష్టత కరువు...

పెరిగిన ఫీజుల్లో ఎంతమేర రీయింబర్స్‌మెంట్ చెల్లించాలనే అంశంపై అధికారులకు స్పష్టత రాక పోవడంతోనే తొలివిడత సీట్ల కేటాయింపులో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు కళాశాలల్లో వార్షిక ట్యూషన్ ఫీజు గతేడాది వరకు రూ.15,500 ఉండగా, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో 14,900 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ ఏడాది నుంచి ఫీజును రూ.39వేలకు పెంచడంతో దానిలో రీయింబర్స్‌మెంట్ ఎంత చెల్లించాలనే అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైంది. ఈ విషయమై కౌన్సెలింగ్ క్యాంపు ఆఫీసరు శ్రీనివాస్ స్పందిస్తూ ఫీజుల చెల్లింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం ఉందని, ఉత్తర్వులు జారీ కాగానే సీట్ల కేటాయింపు వివరాలు ప్రకటిస్తామన్నారు.

మా కుమార్తె వివాహానికి రండి

» రాహుల్‌గాంధీకి జగ్గారెడ్డి దంపతుల ఆహ్వానం



న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె జయరెడ్డి వివాహం వచ్చే నెల 7న జరగనుందని, ఆ కార్యక్రమానికి హాజరుకావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరారు. జగ్గారెడ్డి, ఆయన సతీమణి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కుమార్తె జయరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు సోమవారం రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీకి నూతన వస్త్రాలతోపాటు వివాహ శుభలేఖను జగ్గారెడ్డి దంపతులు అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి తమ కుమార్తె వివాహానికి రావాలని ఆహ్వానించారు.



తమ కుమార్తె వివాహానికి రావాలంటూ రాహుల్ గాంధీకి నూతన వస్త్రాలు అందజేసి, సంప్రదాయ రీతిలో ఆహ్వానం పలుకుతున్న జగ్గారెడ్డి, నిర్మల దంపతులు చిత్రంలో జగ్గారెడ్డి కుమార్తె జయ రెడ్డి, కుటుంబ సభ్యులు

20 నెలల్లో 93 మంది
గురుకుల విద్యార్థుల మృతి

» స్వయంగా పర్యవేక్షిస్తానన్న సీఎం మాటలు నీటి మూటలేనా?

» కాంగ్రెస్ పాలనలో దిక్కుతోచని స్థితికి విద్యా వ్యవస్థ: హరీశ్‌రావు



హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు 20 నెలల పాలనలో వివిధ కారణాలతో 93 మంది విద్యార్థులు మృతి చెందడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తూ.. భావి తెలంగాణ భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం బలిపెడుతోందని సోమవారం 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. గురుకులాల్లో సంఘటనలు జరిగినప్పుడు.. తానే స్వయంగా పర్యవేక్షిస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలయ్యాయన్నారు. మాటలు తప్పా చేతల్లేని ముఖ్యమంత్రి నిర్లక్ష్యం వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కావాలి, ఎందరు ప్రాణాలు కోల్పోవాలని ప్రశ్నించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తుఫ్రాన్‌పేట బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని.. ఇటీవల పలు గురుకులాల్లో చోటు చేసుకున్న ఫుడ్ పాయిజనింగ్ ఘటనలను ఆయన ప్రస్తావించారు. వీటిని చూస్తూ తల్లిదండ్రులు భయపడుతున్నారని, బీఆర్ఎస్ పాలనలో దేశానికి దిక్సూచిలా నిలిచిన తెలంగాణ విద్యా వ్యవస్థ.. నేడు దిక్కుతోచని స్థితికి చేరిందని విమర్శించారు. 'విద్యార్థులకు కడుపు నిండా అన్నం కూడా పెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందా? గురుకులాల్లో జరుగుతున్న మరణ మృదంగానికి బాధ్యులెవరు రేవంత్‌రెడ్డి..' అని నిలదీశారు. కాంగ్రెస్ నిర్లక్ష్యంతో లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోందన్నారు.

ఎందరు మరణించినా సీఎంకు సోయి రావట్లేదు: కేటీఆర్

గురుకుల హాస్టల్‌లో మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇందుకు కాంగ్రెస్ సర్కారు వైఫల్యమే కారణమని 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. గురుకులాల్లో 90 మంది విద్యార్థులు వివిధ కారణాలతో మరణించినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోయి రావడం లేదని మండిపడ్డారు. గురుకులాల్లో మోగుతున్న మరణ మృదంగాన్ని ఆపకపోతే తల్లిదండ్రుల శాపనార్థాలు తగిలి ఈ కాంగ్రెస్ సర్కారు కుప్పకూలడం ఖాయమని హెచ్చరించారు. 'కళ్ల ముందే వరి నారు ఎండిపోతుంటే తట్టుకోలేక.. ఆడబిడ్డలు బిందెలతో నీళ్లు పోసే పరిస్థితి వచ్చింది. ఇందిరమ్మ రాజ్యంలో బిందె సేద్యమా? ఎంత దుస్థితి తెచ్చినవ్ రేవంత్ రెడ్డి.. రైతాంగం అగచాట్లు కనబడటం లేదా..?' అంటూ మరో పోస్టులో ప్రశ్నించారు.

హాస్టల్‌పై నుంచి దూకి విద్యార్థిని మృతి

(మొదటిపేజీ తరువాయి)

జ్యోతీరావుపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో సీటు వచ్చింది. గత నెల 21వ తేదీన గురుకులంలో చేరగా, సిక్ లీవ్‌లు రావడంతో ఈ నెల 5న సంధ్యను తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. సెలవులు ముగియడంతో ఆదివారం మళ్లీ గురుకులానికి తీసుకువచ్చారు. అయితే అప్పటి నుంచి ముభావంగానే ఉన్న సంధ్య.. రాత్రి తోటి స్నేహితులతో భోజనం చేసి నిద్రించింది. ఈ నేపథ్యంలోనే తెల్లవారుజామున వాచ్‌మన్ గదులను తనిఖీ చేస్తుండగా సంధ్య కనిపించకపోవడంతో.. భవనం వెనుక వైపు పరిశీలించగా రక్తమడుగులో శవమై కనిపించింది. పక్కన ప్లేట్లు, దుస్తులతో కూడిన బ్యాగ్ ఉంది. దీంతో వాచ్‌మన్ ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించగా హుటాహుటిన చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మథకుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి.. ఇతర గురుకుల అధికారులు పరిశీలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మధ్యాహ్నం సమయంలో అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇటు ఎస్ఎఫ్ఐ, బీజేవైఎం నాయకులు గురుకులం ఎదుట ఆందోళన నిర్వహించారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బైఠాయించారు. సాయంత్రం వరకు అధికారులతో చర్చలు జరిపారు. విద్యార్థి కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లిస్తామని పాఠశాల అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అంత్యక్రియల నిమిత్తం తల్లిదండ్రులకు రూ20 వేలు అందజేశారు. కూతురి మృతిపై సమగ్ర విచారణ జరపాలని తండ్రి పరుశరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



కుమార్తె మృతితో కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు

45 మంది విద్యార్థినులకు అస్వస్థత

» దేవరకొండ ఆసుపత్రిలో చికిత్స

» నల్లగొండ జిల్లా ముదిగొండ ఆశ్రమ పాఠశాలలో ఘటన

దేవరకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 45 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ముదిగొండ ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 10 తరగతుల వరకు మొత్తం 310 మంది విద్యార్థినులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు స్నాక్స్‌లో భాగంగా విద్యార్థినులకు వేయించిన బొబ్బర్లు పెట్టారు. రాత్రి ఏడు గంటలకు చికెన్, బగారా అన్నం వడ్డించారు. సోమవారం ఉదయం అల్పాహారంలో భాగంగా పులిహోర తిన్న కొంతమంది విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అవుతున్నాయని ఆశ్రమ సిబ్బందికి చెప్పారు. వసతిగృహంలో ఉన్న ఏఎన్ఎంలు ప్రాథమిక చికిత్స చేసి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అస్వస్థత పాలైన విద్యార్థినుల్లో 25 మందిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి, 20 మందిని తూర్పుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా వైద్యులు వెంటనే చికిత్స అందించారు. విద్యార్థినుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని దేవరకొండ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవిప్రకాష్ తెలిపారు.



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి



డిప్యూటీ సీఎం భట్టి నుంచి ఇంటి పట్టా అందుకుంటున్న మరియమ్మ

భట్టికి అవ్వ ఆశీర్వాదం!

- ఇల్లు మంజూరైందన్న ఆనందంతో నృత్యం
- వేదికపై జై కాంగ్రెస్.. జై భట్టి.. అంటూ నినాదాలు

చింతకాని, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఇల్లు లేని తనకు ప్రజా ప్రభుత్వంలో ఇల్లు మంజూరు కావడంతో ఓ వృద్ధురాలు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఖమ్మం జిల్లా చింతకానిలో సోమవారం నిర్వహించిన మహిళాశక్తి సంబురాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి పట్టా అందుకున్న కంచర్ల మరియమ్మ.. అదే వేదికపై ఆనందంతో నృత్యం చేశారు. 'జై కాంగ్రెస్, జై భట్టి' అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో భట్టి ఆమెకు నమస్కరిస్తూ దగ్గరకు తీసుకోగా.. నూరేళ్లు చల్లగా ఉండాలంటూ భట్టిని ఆమె ఆశీర్వదించారు. త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ నాయకులు తీసుకుంటారని చెప్పిన భట్టి.. ఆ మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లుకు పలు సూచనలు చేశారు.

అన్నిగ్రామాల్లో హనుమాన్ ఆలయాల నిర్మాణం

- కాలనీల్లో కులదేవతల గుడులూ అభివృద్ధి: సురేఖ



పరిగి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) పథకం నిధులతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో హనుమాన్ ఆలయాల నిర్మాణాన్ని చేపట్టామని, అలాగే కాలనీల్లో కుల దేవతల ఆలయాలను కూడా దశల వారీగా అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిగి, కులకచర్లలో సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వనమహోత్సవం కింద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాల అభివద్ధిని పూర్తిగా విస్మరించిందని, పదేళ్లలో ఒక్క యాదగిరిగుట్ట నిర్మాణం తప్ప రాష్ట్రంలో ఎక్కడా ఆలయాల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. జీవోలు జారీ చేసి నిధులు కేటాయించలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత యాదగిరిగుట్టతో పాటు రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా 18 కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

ఈడబ్ల్యూఎస్ కోసం 50% కోటా ఎత్తేసినపుడు, బీసీల కోసం ఎందుకు ఎత్తేయరు?: పొన్నం



హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాల్లో ఉన్న పేదల కోసం తీసుకువచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50 శాతం కోటా పరిమితిని ఎత్తేసినప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం ఎందుకు ఎత్తేయరు? అని కేంద్రాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. శాసనసభ సమావేశాలు లేనప్పుడు ప్రభుత్వాలకు ఆర్డినెన్స్ చేసే అధికారం ఉంటుందని, రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లుకు.. ఆర్డినెన్స్‌కు సంబంధం లేదని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేస్తున్నామన్నారు. బరాబర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టంచేశారు. బీసీ బిడ్డ అయ్యుండి కూడా బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ బీసీల రిజర్వేషన్లపై అసహనం వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలకు చేతనైతే బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదంతో 9వ షెడ్యూల్‌లో చేర్పించాలని చురకలంటించారు. కాగా, ఎమ్మెల్సీలు కవిత - తీన్మార్ మల్లన్న వివాదంపై స్పందిస్తూ.. మహిళల పట్ల అలా మాట్లాడడం సరికాదని, మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి అపారమైన గౌరవం ఉందని అన్నారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యవాదులంతా ఖండిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా దాడులు చేయడం కూడా సరైనది కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు.

విద్యార్థుల వసతులపై శ్రద్ధ వహించాలి: అడ్లూరి



హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే ఆహారంతో పాటు వారికి కల్పించే వసతి విషయంలో జాగ్రత్తలు పాటించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూచించారు. సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల ప్రవేశాలు, సంక్షేమ వసతి గృహాల్లో వసతులపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సోమవారం సమీక్షించారు. విద్యార్థుల ప్రవేశాల విషయంలో పారదర్శకత పాటించాలన్నారు. ఆహారం, వసతి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో రోజూ రీడింగ్

- రెండు వారాలకోసారి ఎన్‌డీఎస్‌ఏకు నివేదిక
- కుంగిన బ్లాక్‌ను కాపాడుతోంది గ్రౌటింగే!

మహదేవపూర్ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌లో ప్రతిరోజూ లెవల్స్ రీడింగ్ తీసుకుంటున్నారు. మిగతా బ్లాకుల్లో రెండు వారాలకు ఒకసారి రీడింగ్ నమోదు చేస్తున్నారు. ఈ రీడింగ్‌లన్నింటినీ ప్రతి పదిహేను రోజులకు ఒకసారి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)కి పంపిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. రోజువారీ రీడింగ్‌లో ఎలాంటి వ్యత్యాసాలు రావడం లేదని అంటున్నారు. అయితే బ్లాక్-7కు గ్రౌటింగ్ చేయడం వల్లే వరదలను తట్టుకుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రౌటింగ్ చేపట్టకపోతే ఆ బ్లాక్ మరింత కుంగుబాటుకు గురయ్యేదని అంటున్నారు. బ్యారేజీ కుంగినప్పటి నుంచి రెండేళ్లలో లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లగా.. అందులో సగానికిపైగా వరద ఏడో బ్లాక్ మీదుగానే వెళ్లినప్పటికీ స్ట్రక్చర్‌లో ఏమాత్రం కదలిక లేకపోవడం గమనార్హం. 2023 అక్టోబరు 21న ఈ బ్లాక్ కుంగుబాటుకు గురికాగా.. ఆ మరుసటి రోజు నుంచే నిల్వ ఉన్న నీటితో పాటు వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. రెండేళ్ల వ్యవధిలో 5657 టీఎంసీల నీరు దిగువకు వెళ్లగా.. సగానికిపైగా నీరు కుంగిన ఏడో బ్లాక్ మీదుగానే వెళ్లింది. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు చేసిన గ్రౌటింగే దాని గట్టెక్కించిందని అంటున్నారు.

జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2025 సంవత్సరానికిగాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం కోసం కేంద్ర విద్యామంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. http//nationalawardstoteachers.education.gov.inలో ఈ నెల 17వ తేదీ నుంచి దరఖాస్తులు సమర్పించాలని, చివరి గడువు ఈ నెల 20వ తేదీతో ముగియనుందని తెలిపారు.

ఆంధ్ర, తెలంగాణలో ఐటీ సోదాలు

నకిలీ (బోగస్) క్లెయిమ్‌లకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన ముగ్గురి వ్యక్తుల ఇళ్లల్లో ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. తిరుపతికి చెందిన చైతన్య, ఒంగోలుకు చెందిన శ్రీనివాస్, నిజాంపేట వాసి పురుషోత్తం తమ ఆదాయ పన్ను రిటర్నులలో ఉత్తరాదికి చెందిన కొన్ని రాజకీయ పార్టీలకు భారీ మొత్తంలో విరాళాలు ఇచ్చినట్లు తప్పుడు పత్రాలు సమర్పించారని ఐటీ అధికారులు గుర్తించారు. పన్ను మినహాయింపు పొందే ఉద్దేశంతో వీరు బోగస్ క్లెయిమ్‌లకు పాల్పడినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ సోదాల్లో భాగంగా పలు కీలక పత్రాలు, డిజిటల్ డేటాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రేషన్‌కార్డు.. పేదల ఆత్మగౌరవ ప్రతీక

(మొదటిపేజీ తరువాయి)

అన్నం తింటుంటే.. బీఆర్ఎస్ నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. సోమవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. దండగ అన్న వ్యవసాయాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పండగ చేశామన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడమే కాకుండా రూ.500 బోనస్ ఇచ్చామని, 25,55,965 మంది రైతులకు రూ.25 వేల కోట్లు వెచ్చించి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే 1.50 కోట్ల ఎకరాలకు, 70 లక్షల మంది రైతులకు రూ.9 వేల కోట్ల రైతుభరోసా అందించి మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. అంతేకాకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొన్నామని, దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రంలో 2.85 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి రికార్డు సృష్టించామని అన్నారు.

బస్సులకు యజమానులుగా ఆడబిడ్డలు..

రాష్ట్రంలో 65 లక్షల మంది ఆడబిడ్డలకు రెండు చీరలు అందించామని సీఎం రేవంత్ తెలిపారు. రూ.21 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ ఇచ్చి వారి ఉపాధికి తోడ్పాటునందించామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించామని, ఈ పథకం కింద రూ.6500 కోట్లు ఖర్చవుతున్నా.. అది ఆడబిడ్డలపై పెట్టిన పెట్టుబడిగా చూస్తున్నామే తప్ప దానిని ఉచిత పథకంగా చూడడం లేదని చెప్పారు. 600 బస్సులకు ఆడబిడ్డలను యజమానులను చేశామని, వాటిని 1000 బస్సులకు పెంచుతున్నామని అన్నారు. బస్సులను ఆర్టీసీకి అద్దెకివ్వడం ద్వారా ఆడబిడ్డలకు ఆదాయం వస్తోందన్నారు. ఆడబిడ్డలే 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు తయారు చేసేలా వారికి ప్లాంట్లను అప్పజెప్పామని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగ అవకాశం కూడా ఇవ్వలేదని రేవంత్ ఆరోపించారు. తాము వచ్చాక ఇప్పటికే 59 వేల ఉద్యోగాలిచ్చామని, తమ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ల పూర్తయ్యేనాటికి లక్ష ఉద్యోగాలు ఇచ్చి తీరుతామని ప్రకటించారు.

ప్రాజెక్టుల నాణ్యతపై చర్చకు సిద్ధమా!

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వారివద్ద రూ.20 లక్షల కోట్లున్నా, లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టినా అది మూడేళ్లలో కూలేశ్వరం అయిందని సీఎం రేవంత్ ఆరోపించారు. "60, 70 ఏళ్ల క్రితం కాంగ్రెస్ కట్టిన నాగార్జునసాగర్, శ్రీశైలం, మూసీ, జూరాల, దేవాదుల, ఎస్ఆర్ఎస్పీ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎలా ఉన్నాయో, మీరు కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో చర్చకు సిద్ధమా!" అని సవాల్ చేశారు. బీఆర్ఎస్ నేతలను కాళేశ్వరం వద్ద ఉరితీసినా తప్పులేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని, ఎవరేం చేసినా తెలంగాణలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్ జెండానే రెపరెపలాడుతుందని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు.



సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో జరిగిన కాంగ్రెస్ సభకు హాజరైన జనం

దేశానికి ఆదర్శంగా నిలిచాం..

రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక ఎస్సీ వర్గీకరణ చేపట్టామని సీఎం రేవంత్ అన్నారు. దేశ చరిత్రలో వందేళ్ల తర్వాత జనగణనలో కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ వర్తింపజేసి తీరుతామని, బలహీనవర్గాల వారిని రాజ్యాధికారం వైపు నడిపించే పయనం ఆగదని ప్రకటించారు. ఈ సందర్భంగా సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. తమ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని ఆయన చెబుతున్నారని, ఒక్కసారి అడ్డుకొని చూస్తే కాంగ్రెస్ కార్యకర్తల తడాఖా ఏంటో ఆయనకు తెలుస్తుందని అన్నారు. మూడు రోజుల్లో గోదావరి నీళ్లు తెస్తానంటున్న వ్యక్తి.. పదేళ్లు అధికారమిస్తే తుంగతుర్తికి గోదావరి నీళ్లు ఎందుకు తేలేదని ప్రశ్నించారు. 'గోదావరి నీళ్లు తేవడమంటే.. మందులో సోడా పోసినట్లు కాదు' అని సీఎం వ్యాఖ్యానించారు. ఆనాడు గంజికి కూడా కష్టమైన జగదీశ్‌రెడ్డికి నేడు బెంజి కారు ఎక్కడి నుంచి వచ్చిందో ప్రజలు ఆలోచించాలన్నారు. నల్లగొండ జిల్లాలో ఆయన ఓ గంజాయి మొక్క అని, వచ్చే ఎన్నికల్లో ఈ మొక్కను పీకి పారేయాల్సిన బాధ్యత జిల్లా ప్రజలపై ఉందని అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని, ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలనే గెలిపించి ఆశీర్వదించాలని కోరారు.

చరిత్రలో నిలిచిపోయే రోజు..

"రాష్ట్రంలో ఈరోజు 5.10 లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు, 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఈరోజు తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే రోజు" మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, మునుగోడు, హుజూరాబాద్ వంటి ఉప ఎన్నికల సమయంలో కొందరికి నామమాత్రంగా కార్డులిచ్చారని విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ.12 వేల కోట్లతో ప్రతి గ్రామానికీ బీటీ రోడ్డు వేసేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. కాగా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీతో పేదల కళ్లలో ఆనందం కనిపిస్తోందని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అంతకు ముందు రూ.39.50 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులు మంత్రులతో కలిసి సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో ఆనందం

సీఎం రేవంత్‌రెడ్డి సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ నేతల్లో ఆనందం వ్యక్తమైంది. ఈ సభకు తుంగతుర్తి, సూర్యాపేట, హుజూర్‌నగర్ నియోజకవర్గాలతోపాటు వరంగల్ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున జనం తరలివచ్చారు. మహిళలు పెద్దసంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో తరలి రావడంతో సీఎం తన ప్రసంగంలో సైతం మహిళలనుద్దేశించి ఎక్కువ సమయం మాట్లాడారు. ఎమ్మెల్యే మందుల సామేలును సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించినపుడు జనం ఈలలు వేశారు.

పేదల సుదీర్ఘ నిరీక్షణకు తెర: సీఎం రేవంత్

హైదరాబాద్: "రాష్ట్రంలో పేదల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలు సందడిగా మారాయి" అని సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పేర్కొన్నారు. కొత్త కార్డులు పొందిన ప్రతి లబ్ధిదారుడికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తామని, ఇది పేదల సంక్షేమం పట్ల తమ వజ్ర సంకల్పమని తెలిపారు. గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న లక్షలాది పేద కుటుంబాల ఆశలు నేడు ఫలించబోతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కాగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. ఇందుకోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నామని, అందులో సినిమా రంగానికి ఒక ప్రత్యేక చాప్టర్ ఉంటుందని చెప్పారు. సోమవారం రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన 'శ్రీమద్భాగవతం పార్ట్-1' ఫిల్మ్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



రేవంత్‌రెడ్డి, ఉత్తమ్, మహేశ్‌గౌడ్ ముచ్చట్లు

మల్లు రవి పుట్టినరోజు విందులో సీఎం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి నివాసానికి వెళ్లారు. పుట్టినరోజు సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఎంపీ రవి ఏర్పాటుచేసిన విందుకు సీఎం హాజరయ్యారు. అంతకుముందే తన పుట్టినరోజు సందర్భంగా మల్లు రవి సీఎం నివాసానికి వెళ్లి రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పలువురు మంత్రులతో పాటు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు.





పాలేరు జలాశయం నుంచి ఆయకట్టుకు నీరు వదులుతున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

కాంగ్రెస్ సర్కార్‌పై బురద జల్లుతున్న బీఆర్ఎస్

- పదేళ్లలో తప్పులు చేసి.. మాపై నిందలా?
- జలాల సమర్థ వినియోగమే లక్ష్యం: భట్టి
- కాంగ్రెస్ అంటే సాగు, కరెంటు, ప్రాజెక్టులు
- మాకు భగవంతుడి ఆశీర్వాదం: పొంగులేటి
- పాలేరు నుంచి సాగర్ జలాలు విడుదల

ఖమ్మం/కూసుమంచి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల పాటు అధికారంలో ఉండి తప్పు మీద తప్పు చేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడడంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అదే పార్టీ నేతలు తమపై నిందలు మోపడం విడ్డూరంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయం నుంచి జిల్లాలోని సాగర్ రెండో జోన్ ఆయకట్టుకు సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన సాగర్ జలాలను విడుదల చేశారు. అనంతరం పాలేరులో భట్టి విలేకరులతో కృష్ణా బేసిన్‌లో ఏపీ ప్రభుత్వం అక్రమంగా ప్రాజెక్టులు కడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు. పైగా, రోజుకు 11 టీఎంసీల నీరు తరలించేందుకు వీలుగా ప్రాజెక్టులు నిర్మించేందుకు బీఆర్ఎస్ పెద్దలు సహకరించారని ఆరోపించారు. గతంలో వారు చేసిన తప్పిదాలను సరిచేస్తూ తాము ముందుకు పోతున్నామని, కృష్ణా, గోదావరి జలాలను సమృద్ధిగా వినియోగించుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రైతును రాజు చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే వ్యవసాయం, కరెంటు, ప్రాజెక్టులని వ్యాఖ్యానించారు. భగవంతుడి దయ తమ ప్రభుత్వానికి ఉందని, అందువల్లే వ్యవసాయానికి నీరు విడుదల చేయగలుగుతున్నామన్నారు.

81 మంది జేఎల్స్‌కు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు


హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్లు(జేఎల్)గా పని చేస్తున్న 81 మందికి ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి, సంచాలకులు కృష్ణ ఆదిత్య ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఇంటర్ విద్యామండలి కార్యాలయంలో ఈమేరకు వారికి పదోన్నతుల ఉత్తర్వులు అందించారు.

రేపు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ

కేంద్ర మంత్రి పాటిల్ ఆధ్వర్యంలో సమావేశం.. సర్క్యులర్ జారీ చేసిన కేంద్ర జలశక్తి శాఖ

- ఇరు రాష్ట్రాలల్లో ప్రాజెక్టులపై చర్చ
- నేడు ఢిల్లీకి రేవంత్‌రెడ్డి, చంద్రబాబు
- కేంద్ర మంత్రికి ఉత్తమ్ లేఖ..
- ప్రతి నీటి చుక్కా సద్వినియోగం
- మన నీటి వాటాపై ఒత్తిడి తెద్దాం
- అధికారులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి





హైదరాబాద్/న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్లతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని నీటిపారుదల ప్రాజెక్టులపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశానికి హాజరు కావాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ సోమవారం ఓ సర్క్యులర్‌ను విడుదల చేసింది. మంగళవారం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీకి చేరుకోనున్నారు. కేంద్ర జలశక్తి మంత్రితో భేటీకి ముందు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అనధికారికంగా సమావేశమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. బుధవారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగే భేటీలో ఇద్దరు సీఎంలు పాల్గొంటారు. ఈ సమావేశంలో చర్చించే అజెండాను తెలుగు రాష్ట్రాలే ఖరారు చేసుకొని, సోమవారం సాయంత్రం 5 గంటల్లోగా పంపించాలని కేంద్ర జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ప్రదీప్ కుమార్ అగర్వాల్ లేఖ రాశారు. తెలంగాణ సర్కారు సమావేశ అజెండాను పంపినట్లు తెలిసింది. అలాగే సీఎం రేవంత్ ఆదేశాల మేరకు మంత్రి ఉత్తమ్ సోమవారం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖ రాశారు. ఆ లేఖలోని అంశాలే అజెండాగా ఉండనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కేంద్రంపై ఒత్తిడి తెద్దాం..

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని.. న్యాయంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కృష్ణాపై తెలంగాణ ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించుకోవడంతో పాటు ఇంత కాలం జరిగిన అన్యాయానికి శాశ్వతమైన పరిష్కారాలను సాధించాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన అధికారులతో భేటీ అయ్యారు. ఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రితో భేటీలో తెలంగాణ నీటి వాటాల సాధనతో పాటు ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణకు తీరని ద్రోహం జరిగిందని, పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్.. నీటి వాటాను సాధించడంలో విఫలమయ్యారని ఆక్షేపించారు. ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నీటిని కేటాయించగా.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల నీటి వినియోగానికి కేసీఆర్ అంగీకరించారని ఆరోపించారు. గోదావరిపై ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు రూ.11 వేల కోట్లు ఖర్చుచేసిన తర్వాత దాన్ని పక్కనపెట్టి, కాళేశ్వరం నిర్మించి లక్ష కోట్లకు పైగా ప్రజాధనం దుర్వినియోగం చేసిందని ధ్వజమెత్తారు.

తెలంగాణ లేవనెత్తుతున్న అంశాలివే..!

గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీలతో రిజర్వాయర్‌ను కట్టాలని తెలంగాణ ప్రతిపాదించింది. ఈ రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ నుంచే కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోయనున్నారు. జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ప్రతిపాదన కూడా ఇదే కావడం, తాజాగా ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ కు సమ్మతి తెలుపుతూ మంత్రి ఉత్తమ్ లేఖ రాయడంతో ఈ అంశం కూడా చర్చకు రానుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ప్రభుత్వం 90 టీఎంసీలతో దాఖలు చేసింది. తొలిదశలో మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు చేసిన 45 టీఎంసీలతో ఈ డీపీఆర్‌కు అనుమతివ్వాలని కేంద్రాన్ని కోరనుంది. సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్‌కు సంబంధించి గరిష్ఠ వరద ఆధారంగా పరిహారం చెల్లించాలన్న ఐఐటీ ఖరగ్‌పూర్ నివేదికకు అనుగుణంగా.. చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని, తక్షణమే ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ ఇప్పించాలని కేంద్రాన్ని కోరనుంది. కృష్ణా బేసిన్లో ఏపీ సర్కారు శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు అక్రమంగా నీటిని మళ్లిస్తోందని.. దాన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేయనుంది. కృష్ణా జలాల పంపకంపై జరుగుతున్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ విచారణను సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ కేంద్రాన్ని కోరనున్నారు. ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూరు-రంగారెడ్డి, డిండి, కొల్లాపూర్, నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేయనున్నారు.

ఏపీ వాదన ఇలా

బనకచర్ల ట్రైబ్యునల్ పరిధిలోకి రాదని, తాము వరద జలాలతోనే ఈ ప్రాజెక్టును నిర్మిస్తామని ఏపీ కేంద్రానికి చెప్పనుంది. గోదావరి జలాలు కృష్ణా నదికి వెళ్లకుండా నేరుగా పెన్నా బేసిన్‌కు తరలివెళ్లేలా చేస్తామని, అందువల్ల కృష్ణా-గోదావరి సంగమం కానీ, పొరుగు రాష్ట్రాలకు వాటా ఇవ్వడం కానీ జరగదని ఏపీ వాదిస్తోంది. వరద జలాలు సముద్రంలోకి వృథాగా పోకుండా ఇరు రాష్ట్రాలు ఉపయోగించుకోవాలని చంద్రబాబు ప్రతిపాదిస్తున్నారు.

పార్లమెంటు వేదికగా 'బీసీ' వాణి!

- 21న ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్
- రిజర్వేషన్లను పెంచాల్సిన ఆవశ్యకతపై ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్
- అనంతరం ప్రధానితో భేటీ కానున్న సీఎం
- నేడు గవర్నర్ వద్దకు రిజర్వేషన్ల ఆర్డినెన్స్

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీల రిజర్వేషన్‌ను 42శాతానికి పెంచే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వేగం పెంచింది. పార్లమెంటు వేదికగానే ఈ అంశాన్ని వినిపించాలని నిర్ణయించింది. ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న సమావేశాల్లోనే ఈ వ్యవహారాన్ని కొలిక్కి తీసుకురావాలని భావిస్తోంది. ఈ మేరకు 21వ తేదీనే ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడు రోజుల పాటు ఢిల్లీలోనే ఉండనున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడంతోపాటు దాని ఆవశ్యకతను వివరించనున్నారు. పార్లమెంటు సమావేశాల సమయంలోనే ఎంపీలతో కలిసి ప్రధాని మోదీని కలవాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచేందుకు రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన రెండు బిల్లులను పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఆమోదించాలని, వాటిని షెడ్యూల్-9లో చేర్చాలని కోరనున్నారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, కులగణనలో తేలిన వివరాలను కూలంకశంగా వివరించి.. రిజర్వేషన్ల పెంపునకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేయనున్నారు. మరోవైపు.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రూపొందించిన ఆర్డినెన్స్‌ను మంగళవారం గవర్నర్‌కు నివేదించనున్నట్టు తెలిసింది. దానికి గవర్నర్ ఆమోదం తెలిపితే.. రిజర్వేషన్ల ఖరారుకు ప్రత్యేక ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేయనుంది.

సౌదీలో నిజామాబాద్ వాసి అవస్థలు

- పెండింగ్‌లో ఉన్న 15 నెలల జీతం అడిగినందుకు దొంగతనం మోపిన కంపెనీ
- వీసాను రద్దు చేసిన స్థానిక కోర్టు
- రోడ్లపైనే తిండిలేక సంతోష్ ఇబ్బందులు
- భారత్‌కు రప్పించాలని సీఎంను కోరుతూ సెల్ఫీ

నిజామాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం అమ్రాద్ తండాకు చెందిన మెగావత్ సంతోష్ ఉపాధి కోసం 18 నెలల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ బందర్ అల్దాబి కంపెనీలో పని చేశాడు. సంతోష్‌తో 18 నెలలు పనిచేయించుకున్న ఆ కంపెనీ మూడు నెలల జీతమే చెల్లించింది. మిగతా 15 నెలల జీతం ఇవ్వాలని అక్కడి లేబర్ కోర్టులో కేసు వేయగా.. అతనిపై డీజిల్ దొంగతనం కేసు వేసింది. అక్కడి కోర్టు సంతోష్‌కు 16 వేల రియాల్(రూ.3.66లక్షలు) జరిమానా విధించడంతో పాటు పదేళ్ల పాటు వీసాను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. దీంతో, సంతోష్ రెండు నెలలుగా రోడ్లపైనే జీవనం కొనసాగిస్తూ తిండి కూడా లేక అనేక ఇబ్బందులు పడుతున్నాడు. తనను ఇండియాకు రప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతూ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. తన భర్తను ఇండియాకు రప్పించాలని భార్య రాణి ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.

డీమ్డ్ యూనివర్సిటీగా ఐఐపీహెచ్

రాజేంద్రనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌సాగర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్)కు డీమ్డ్ యూనివర్సిటీ హోదా కల్పిస్తూ కేంద్ర విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(పీహెచ్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ సంస్థ పనిచేస్తోంది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా ప్రజారోగ్యం కోసం అనేక శిక్షణ కార్యక్రమాలను చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

చాకలి ఐలమ్మ మనవడు సంపత్ మృతి


సంపత్ (ఫైల్)

పాలకుర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవడు చిట్యాల సంపత్ (45) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు వారి స్వగ్రామం జనగామ జిల్లా పాలకుర్తిలో సోమవారం పూర్తయ్యాయి. చాకలి ఐలమ్మ రెండో కుమారుడు పిచ్చయ్యకు భార్య భారతమ్మ, నలుగురు కుమార్తెలుండగా, సంపత్ ఏకైక కుమారుడు. తండ్రి పిచ్చయ్య మృతి చెందిన తర్వాత పదేళ్ల క్రితం కుటుంబంతో సహా హైదరాబాద్‌కు వెళ్లిన సంపత్ అక్కడ కొన్నాళ్లు ఎలక్ట్రీషియన్‌గా పని చేశారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మూడేళ్లుగా స్వగ్రామం పాలకుర్తిలోనే ఉంటున్నారు. సంపత్‌కు భార్య గౌరీశ్వరీ, ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. సంపత్ సీపీఐ(ఎం)లో పనిచేశారు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహా పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సంపత్ అంత్యక్రియల్లో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు!

హైదరాబాద్ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. బీహెచ్ఈఎల్ డిపో నుంచి అరుణాచలం, మంత్రాలయం, భద్రాచలం, కాళేశ్వరానికి సూపర్‌లగ్జరీ, రాజధాని ఏసీ బస్సులను నడపనున్నట్లు ఆ డిపో మేనేజర్ సుధ సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు సాగే అరుణాచలం యాత్రకు సూపర్ లగ్జరీలో ఒకరికి రూ.4,500, రాజధాని ఏసీ డీలక్స్ బస్సులో ఒకరికి రూ.5 వేలు చార్జీగా వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచల , కంచి దేవాలయాలను దర్శించుకోవచ్చన్నారు. ఇక మంత్రాలయం యాత్రలో భాగంగా మన్యంకొండ, కురుమూర్తి దేవాలయాలను దర్శించుకోవచ్చని.. సూపర్‌లగ్జరీలో రూ.1,250, రాజధాని ఏసీ బస్సులో రూ.1,700 చార్జీగా వసూలు చేయనున్నట్లు వివరించారు. భద్రాచలానికి సూపర్ లగ్జరీలో రూ.1,700, రాజధాని ఏసీ బస్సులో రూ.2,200 చార్జీ ఉంటుందని చెప్పారు. ఇక కాళేశ్వరానికి సూపర్ లగ్జరీలో రూ.1,200, రాజధాని ఏసీ బస్సులో రూ.1,600 చార్జీగా వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 93910 72283, 90634 07072 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

ఐఐటీ-జేఈఈ, నీట్ డిజిటల్ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నీట్, జేఈఈ-2026 ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు 'కోటా' డిజిటల్ మెటీరియల్‌ను సిద్ధం చేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. ఇందులో డిజిటల్ స్టడీ మెటీరియల్ (కాన్సెప్ట్, మల్టీపుల్ ఛాయిస్ ప్రశ్నలు) 'కోటా' గ్రాండ్ టెస్టు సొల్యూషన్స్, 'కోటా' ప్రీవియస్ టెస్టులు, సొల్యూషన్స్, ర్యాంక్ బూస్టర్ టెస్ట్, ఎన్‌సీఈఆర్‌టీ నీట్ క్వశ్చన్ బ్యాంక్ ఉంటాయని వివరించింది. ఈ మెటీరియల్‌ను వాట్సాప్ ద్వారా పొందవచ్చని తెలిపింది. మరింత సమాచారం కోసం 9849016661 నంబరుకు వాట్సాప్ మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

లిఫ్ట్ తెగి పడి 14 మందికి గాయాలు

రామచంద్రాపురం టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లిఫ్ట్ వైర్ తెగి కిందపడటంతో అందులో ఉన్న 14 మంది మహిళలు గాయపడిన సంఘటన పటాన్‌చెరు పరిధి రామచంద్రాపురంలో చోటు చేసుకుంది. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఓ వస్త్ర దుకాణంలో పనిచేయడానికి కూకట్‌పల్లి ఎల్లమ్మబండకు చెందిన మహిళలు వచ్చారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వారు అక్కడ పనిచేశారు. ఉదయం తొమ్మిది గంటలకు ఇంటికి తిరిగి వెళ్లేందుకు రెండో అంతస్తులో మహిళలందరూ ఒకేసారి లిఫ్ట్ ఎక్కారు. కిందికి వస్తున్న సమయంలో లిఫ్ట్ వైర్ తెగి.. ఒక్కసారిగా కిందపడటంతో వాటి అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటనలో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ఆంధ్ర, తెలంగాణలో ఐటీ సోదాలు

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ (బోగస్) క్లెయిమ్‌లకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన ముగ్గురి వ్యక్తుల ఇళ్లల్లో ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. తిరుపతికి చెందిన చైతన్య, ఒంగోలుకు చెందిన శ్రీనివాస్, నిజాంపేట వాసి పురుషోత్తం తమ ఆదాయ పన్ను రిటర్నులలో ఉత్తరాదికి చెందిన కొన్ని రాజకీయ పార్టీలకు భారీ మొత్తంలో విరాళాలు ఇచ్చినట్లు తప్పుడు పత్రాలు సమర్పించారని ఐటీ అధికారులు గుర్తించారు. పన్ను మినహాయింపు పొందే ఉద్దేశంతో వీరు బోగస్ క్లెయిమ్‌లకు పాల్పడినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ సోదాల్లో భాగంగా పలు కీలక పత్రాలు, డిజిటల్ డేటాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

1000 కోట్ల భూకుంభకోణం

ఎనికేపల్లి 'గోశాల' భూములకు అక్రమార్కుల ఎసరు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/మొయినాబాద్)


ఎనికేపల్లిలోని భూములు

మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలోని సర్వేనంబరు 180లో 99.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని కొన్ని దశాబ్దాలుగా స్థానిక పేదలు సాగుచేసుకుంటున్నారు. తమకు ప్రభుత్వమే ఈ భూములు అప్పగించి, పొజిషన్ ఇచ్చిందని.. కానీ పట్టా ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రంలో గోసంరక్షణ కోసం నాలుగు గోశాలలను నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా భూసేకరణ పనులు మొదలుపెట్టి ఎనికేపల్లిలోని భూమిలో గోశాల నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధమైంది. సర్కారు ఆదేశాల మేరకు అధికారులు ఆగమేఘాలపై రంగంలోకి దిగి.. ఆ భూమిలో రెండెకరాలు కబ్జాకు గురైనట్టు గుర్తించి, ఆ స్థలాన్ని కబ్జా కోరల నుంచి విడిపించారు. మరోవైపు.. తాము సాగు చేసుకుంటున్న ఈ భూములను సర్కారు స్వాధీనం చేసుకునే యత్నం చేయడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. 50 ఏళ్లుగా ఈ భూములు సాగు చేసుకుంటున్నామని, కావాలంటే గోశాలను వేరే ప్రాంతంలో నిర్మించుకోవాలని చెబుతూ వారు ఈ భూముల స్వాధీనాన్ని అడ్డుకుంటున్నారు. లేదంటే తమకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించిన తరువాతనే భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. వారికి సంఘీభావంగా ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా రోజువారీ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం ఈ భూములను పేదలకు అసైన్ చేసినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని చెబుతున్నారు. చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ రైతులను కలిసి ఇదే విషయాన్ని వివరించారు. అయినా రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ భూమికి సమీపంలో అభివృద్ధి చేసిన లే-అవుట్‌లో ఎకరానికి 300 గజాల చొప్పున రైతులకు పరిహారం కింద ఇస్తామన్నారు. ఈ ప్రతిపాదనను కొందరు వ్యతిరేకించగా మరికొందరు అంగీకరించారు. ఇలా అంగీకరించిన 21 మంది రైతులకు మంగళవారం పట్టాలు ఇస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంతలోనే.. రూ.1000 కోట్లకు పైగా విలువైన ఆ 99.14 ఎకరాల భూమినీ కొనుగోలు చేసేందుకు తాము ఒప్పందం చేసుకున్నామంటూ కొందరు వ్యక్తులు అధికారులను ఆశ్రయించడంతో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది!

అధికారుల విచారణ..

ఎనికేపల్లి భూములను కొట్టేసే కుట్ర విషయం బయటపడడంతో.. రెవెన్యూ యంత్రాంగం విచారణ మొదలు పెట్టింది. ఈ భూములకు సంబంధించి పెద్ద మొత్తంలో చేతులు మారిన సంగతి వారి ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాలు తెలిపిన మేరకు.. గత ప్రభుత్వ హయాంలో కొందరు వ్యక్తులు.. డప్పు రమేశ్ అనే వ్యక్తితో సహా 46 మంది పేర్లపై ఈ భూములకు సంబంధించి నకిలీ పత్రాలను సృష్టించారు. 20 ఏళ్ల నుంచి ఆ భూమి తమ పొజిషన్‌లోనే ఉన్నట్లుగా మొయినాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయం పేరుతో ఫోర్జరీ పొజిషన్ సర్టిఫికెట్ సృష్టించారు. డప్పు రమేశ్.. మిగిలిన 45 మంది నుంచీ ఏజీపీ తీసుకున్నట్లు మరో పత్రం సృష్టించారు. ఆ తప్పుడు పత్రాల సాయంతో మొత్తం 99.14 ఎకరాల భూమినీ.. హైదరాబాద్‌కు చెందిన బి.లింగారెడ్డి, సుభాష్ చంద్ అగర్వాల్, నవీన్ అగర్వాల్‌కు విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. 2019 ఫిబ్రవరి 11, అక్టోబర్ 4 తేదీల్లో వారితో ఒప్పందాలు చేసుకుని.. మూడు దశల్లో రూ.కోటిన్నర అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. గడువు ముగిసినా భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇటీవల ఈ భూములను గోశాల కోసం ప్రభుత్వం సేకరిస్తుందనే విషయం పత్రికల్లో రావడంతో.. ఒప్పందం చేసుకున్న వారు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. భూములు ప్రభుత్వానివని తెలిసి వారంతా కంగుతిన్నారు. తాము మోసపోయామని గుర్తించి.. సోమవారం స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులను ఆశ్రయించారు. ఫోర్జరీ డాక్యుమెంట్లతో డప్పు రమేశ్ తమను మోసం చేశాడని.. బి.లింగారెడ్డి రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎనికేపల్లిలో సర్వేనంబరు 180లోని ప్రభుత్వ భూమిని ప్రైవేటు పట్టా భూమిగా చూపించి, కుట్రపూరితంగా తమకు అగ్రిమెంట్ చేసి రూ.1.5 కోట్లు అడ్వాన్స్ కింద తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు డప్పు రమేశ్‌పై కేసు నమోదు చేశారు. పైకి డప్పు రమేశ్ పేరు వినిపిస్తున్నప్పటికీ.. ఈ వ్యవహారంలో తెర వెనుక గత ప్రభుత్వానికి చెందిన కొందరు పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై లోతైన విచారణ జరిపితే వారి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది. కాగా.. ఈ కుంభకోణంపై సర్కార్ కూడా సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. దీని వెనుక ఉన్న వ్యక్తుల పేర్లను వెలికి తీయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

కార్గిల్ వీరుడు పద్మపాణి కుటుంబ సభ్యులకు సత్కారం

- జ్ఞాపికతో సత్కరించిన భారత సైన్యం
- కార్గిల్ అమరవీరులకు నివాళులు
- భావోద్వేగాలను కలిగించేదే..
- అయినా అది 'విజయ్ దివస్'
- మేజర్ పద్మపాణి కుటుంబ సభ్యులు

హైదరాబాద్ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో.. శత్రువుల నుంచి కీలకమైన పోస్టులను చేజిక్కించుకునే క్రమంలో ప్రాణాలను త్యాగం చేసిన 545 మంది వీరసైనికులను స్మరించుకునేందుకు భారత సైన్యం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా కార్గిల్ యుద్ధంలో మరణించిన యోధుల ఇళ్లకు ఆర్మీ చేరుకుంటూ.. కుటుంబ సభ్యులకు ఓ లేఖను, జ్ఞాపికను అందజేసి, సత్కరిస్తోంది. ఈ క్రమంలో దక్షిణాదిలోని కార్గిల్ వీరుల కుటుంబాలను కలిసేందుకు ఓ బృందం హైదరాబాద్ చేరుకుంది. లెఫ్టినెంట్ అహ్మద్, నాయిబ్ సుబేదార్ ఎం.వెంకటరెడ్డి తదితరులు, విశ్రాంత సుబేదార్ పాండురంగారెడ్డితో కలిసి సోమవారం మేజర్ పద్మపాణి ఆచార్య ఇంటిని సందర్శించారు. మేజర్ పద్మపాణికి భారత సైన్యంలో రెండో అత్యున్నత పురస్కారమైన మహావీర చక్ర మరణానంతరం అందిన విషయం తెలిసిందే.! ఆర్మీ బృందం సోమవారం జూబ్లీహిల్స్‌లోని పద్మపాణి కుటుంబ సభ్యులను– పద్మపాణి భార్య చారులత, కుమార్తె అపరాజితను కలిసి.. జ్ఞాపికతో సత్కరించింది. ఆర్మీ ప్రత్యేకంగా విడుదల చేసిన కృతజ్ఞత లేఖను అందజేసింది. ఈ సందర్భంగా అపరాజిత ఆచార్య మాట్లాడుతూ.. ఆర్మీ ద్వారా జ్ఞాపికను అందుకోవడాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నామన్నారు. వీరోచితంగా పోరాడిన మన సైనికుల శక్తి సామర్థ్యాలను ప్రతి ఏడాది కార్గిల్ విజయ్ దివస్(జూలై 26) గుర్తుచేస్తూనే ఉందన్నారు. వ్యక్తిగతంగా తమకు జరిగిన నష్టం కంటే, భారత చరిత్రలో ఓ ప్రతిష్ఠాత్మక విజయానికి గుర్తుగా ఈ రోజును జరుపుకొంటామన్నారు. సుబేదార్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కార్గిల్ నుంచి ప్రత్యేకంగా తామిక్కడకు వచ్చామన్నారు. మేజర్ పద్మపాణి ఆచార్య కార్గిల్ యుద్ధంలో అత్యంత కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ నెల 26(విజయ్ దివస్) నాటికి దేశవ్యాప్తంగా కార్గిల్ అమరవీరుల కుటుంబాలను కలుస్తామని చెప్పారు.

సిగాచి ఘటనలో మరో కార్మికుడి మృతి

- 45కు చేరిన మృతుల సంఖ్య

పటాన్‌చెరు రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి కర్మాగారంలో జరిగిన ప్రమాద ఘటనలో మరో కార్మికుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 45కు చేరింది. సంఘటన జరిగిన రోజు తీవ్రంగా గాయపడి మదీనాగూడ ప్రణవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తారక్ అనే కార్మికుడు సోమవారం చనిపోయాడు. ఈ ప్రమాదబారిన పడ్డ మరో ఎనిమిది మంది ఆచూకీ ఇంకా చిక్కడం లేదు.



'స్టార్ హార్ట్ ఫెయిల్యూర్ క్లినిక్' ప్రారంభోత్సవంలో స్టార్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ గోపీచంద్, వైద్యులు

పెరుగుతున్న గుండె వైఫల్య మరణాలు

- ఏటా ఆ సమస్యతో ప్రపంచవ్యాప్తంగా 5 లక్షల మంది మృతి
- మనదేశంలో 50-60 ఏళ్లవారిలోనే గుండెసంబంధిత జబ్బులు
- స్టార్ ఆస్పత్రి ఎండీ డా. గోపీచంద్ మన్నం
- నానక్‌రామ్ గూడలో 'స్టార్ హార్ట్ ఫెయిల్యూర్ క్లినిక్' ప్రారంభం

హైదరాబాద్ సిటీ/రాయిదుర్గం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 5 లక్షల మంది.. గుండె వైఫల్యం (హార్ట్ ఫెయిల్యూర్) కారణంగా చనిపోతున్నారని.. మన దేశంలోనూ ఈ మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయని స్టార్ ఆస్పత్రి ఎండీ, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ మన్నం గోపీచంద్ ఆందోళన వ్యక్తం చేశారు. నానాక్‌రాంగూడలోని స్టార్ ఆస్పత్రిలో సోమవారం 'స్టార్ హార్ట్ ఫెయిల్యూర్ క్లినిక్‌'ను ప్రారంభించిన ఆయన సందర్భంగా మాట్లాడిన ఆయన.. పాశ్చాత్య దేశాల్లో గుండె సంబంధిత వ్యాధులు 70 ఏళ్ల వయస్సులో కనిపిస్తే మన దేశంలో 50 నుంచి 60 ఏళ్ల మధ్య కనిపిస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. గుండె వైఫల్యం చెందిన వారికి చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయని.. బాధితులకు ఎలాంటి చికిత్స అవసరమో గుర్తించి చేయడం ద్వారా నాణ్యమైన, మెరుగైన జీవితాన్ని అందించడానికి అవకాశముందని తెలిపారు. మున్ముందు.. ప్రజలకు హృద్రోగాలపై అవగాహన కల్పించి, శాస్త్రీయ చికిత్సను అందించడానికి 'స్టార్ హార్ట్ ఫెయిల్యూర్ క్లినిక్‌'ను ఉపయోగిస్తామని వెల్లడించారు. కొవిడ్ టీకాల వల్ల గుండె జబ్బులు పెరిగాయని చెప్పడానికి ఆధారాలు లేవని ఆయన స్పష్టం చేశారు. అయితే, కొవిడ్ నేపథ్యంలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరిగి పరీక్షలు చేయించుకున్నారని.. ఎక్కువ మంది పరీక్షలు చేయించుకోవడంతో గుండె సమస్యలున్న వారి సంఖ్య పెరిగిందని వివరించారు. ఇక.. భారతదేశంలో పని చేసే వయసు గల వారిలో గుండె వైఫల్యం కేసులు గణనీయంగా పెరిగిపోతున్నాయని అడ్వాన్స్ హార్ట్ ఫెయిల్యూర్ ట్రాన్స్‌ప్లాంట్ కార్డియలజిస్టు డాక్టర్.సురేష్ ఎర్ర పేర్కొన్నారు. .తెలంగాణలో 2022లో హృద్రోగ మరణాలు 282 నమోదయ్యాయని.. చనిపోయినవారిలో 30-50 సంవత్సరాల వయసు గల పురుషులూ ఉన్నారని ఆయన తెలిపారు.

ఊరూ పేరూ మార్చి.. ఏమార్చి..

(మొదటిపేజీ తరువాయి)



మునిగిపోతున్నారు. ఇలా బెట్టింగ్ యాప్స్ కారణంగా ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్య చేసుకుంటున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. బెట్టింగ్ యాప్‌ల బారినపడి ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య తమిళనాడు తర్వాత తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధికంగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. మన తర్వాతి స్థానాల్లో.. మహారాష్ట్ర, కర్ణాటక ఉన్నాయి. బెట్టింగ్ యాప్‌లు వాడుతున్నవారిలో 18-25 ఏళ్ల వయస్సు వారే ఎక్కువగా ఉంటున్నారు. ఇటీవల ఒక ప్రైవేటు సంస్థ నిర్వహించిన సర్వేలో.. బెట్టింగ్ యాప్స్ ఉపయోగిస్తున్నవారిలో 41% మంది ఇంటర్ విద్యార్థులే ఉన్నట్లు తేలడం.. బెట్టింగ్ యాప్స్ ఉపయోగిస్తున్న వారిలో మహిళల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉదాహరణకు.. హైదరాబాద్‌కు చెందిన ఒక గృహిణి బెట్టింగ్ యాప్స్ ఉచ్చుకు చిక్కి, ఆర్థికంగా నష్టపోయి.. నాలుగు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడింది. అలాగే.. బెట్టింగ్ యాప్స్ బారిన పడుతున్నవారిలో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలవారే ఎక్కువగా ఉంటున్నారు. ఇంట్లో చెప్పకుండా తెలిసిన వారి వద్ద అప్పులు చేసి.. దిక్కుతోచని స్థితిలో, భయంతో ప్రాణాలు వదులుతున్నవారు కొందరైతే కుటుంబ పెద్దల సహకారంతో అప్పులు తీర్చేస్తున్నవారు మరికొందరు. బెట్టింగ్ యాప్స్ కారణంగా తీవ్రంగా నష్టపోయి ఎవరైనా ఆత్మహత్యకు పాల్పడితే.. దర్యాప్తు సంస్థలకు తాము దొరక్కుండా ఉండేందుకు యాప్ నిర్వాహకులు పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు. తాము ఎవరో తెలియకుండా ఉండేందుకు నకిలీ పేర్లు, ఖాతాలు ఉపయోగిస్తున్నారు. ఇతరుల నుంచి బ్యాంకు ఖాతాలు అద్దెకు తీసుకుని (మ్యూల్ ఖాతా) వాటి ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. సంపాదించిన సొమ్మును క్రిప్టో కరెన్సీ రూపంలో దేశం దాటిస్తున్నారు.

కాలాన్ని బట్టి ఎర

- సైబర్ ఇంటెలిజెన్స్ ఫోరెన్సిక్ నిపుణుడు ప్రసాద్ పాటిబండ్ల

దేశంలో కరోనా తర్వాత పరిస్థితి దారుణంగా మారిందని.. కష్టపడకుండా వచ్చే సొమ్ముకు ఆశపడి యువత, మధ్యతరగతివారు బెట్టింగ్ యాప్స్, లోన్‌యాప్స్ ఉచ్చుకు చిక్కి సర్వం కోల్పోతున్నారని సైబర్ ఇంటెలిజెన్స్ ఫోరెన్సిక్ నిపుణుడు ప్రసాద్ పాటిబండ్ల తెలిపారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని ఆయన తెలిపారు. "విద్యా సంస్థలు ప్రారంభమయ్యే సమయంలో లోన్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తారు. అమాయకుల నుంచి అందినకాడికి దోచుకుంటారు. అలాగే.. ఏదైనా క్రీడలు జరిగే సమయంలో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసి డబ్బులు వసూలు చేస్తారు. వాటితోపాటే గేమింగ్ యాప్స్, ఇతర యాప్స్‌తో దోపిడీకి పాల్పడుతున్నారు" అని పాటిబండ్ల వివరించారు.

వాణిజ్య పన్నుల అదనపు కమిషనర్‌పై ఫిర్యాదు

- వాణిజ్య పన్నుల కమిషనర్‌కు, పోలీసులకు అసిస్టెంట్ కమిషనర్లు ఫిర్యాదు

హైదరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆబిడ్స్ డివిజన్‌ను పర్యవేక్షిస్తున్న వాణిజ్య పన్నుల అదనపు కమిషనర్ లావణ్యపై అదే డివిజన్‌లోని బషీర్‌బాగ్ ఒకటి, రెండో నెంబర్ సర్కిళ్లలో పని చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్లు కె.శ్రీనివాస్, జి.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర వాణిజ్య పన్నుల కమిషనర్‌కు, ఆబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీఎస్టీ వసూలు చేయాలంటూ ఒకసారి, వద్దంటూ మరోసారి తమను ఆదేశిస్తున్నారని వారు ఆరోపించారు. విధులను నిర్వహించనీయడంలేదని, బెదిరింపులకు పాల్పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. ఈ ఫిర్యాదుపై మరో 20 మంది కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్లు కూడా సంతకాలు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని, అసభ్యంగా మాట్లాడుతున్నారని, రాయలేని పదాలను వాడుతున్నారని ఆరోపించారు. సెలవు నుంచి వచ్చిన తర్వాత తాను అడిషనల్ కమిషనర్‌ను కలవడానికి ప్రయత్నిస్తే ఆమె తిరస్కరిస్తున్నారని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 10న జరిగిన అసిస్టెంట్ కమిషనర్ల సమావేశంలో తాను ముందు వరుసలో కూర్చుంటే వెనక సీట్లలోకి వెళ్లాలంటూ లావణ్య అవమానించారని ఆయన ఆరోపించారు. ఆబిడ్స్ డివిజన్‌లో రూ.875 కోట్ల పన్ను బకాయిలు ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

(మొదటిపేజీ తరువాయి)

గవర్నర్‌గా నియమించారు. అనంతరం 2021 జూలై 7న హరియాణాకు బదిలీ అయ్యారు. గవర్నర్‌గా ఆయన ఐదేళ్ల పదవీకాలం గత ఏడాది సెప్టెంబరు 10నే ముగిసినప్పటికీ 9 నెలలుగా పదవిలో కొనసాగుతున్నారు. ఎన్డీఏలో టీడీపీ మళ్లీ చేరి 15 నెలలైన తర్వాత తెలుగుదేశం నేతకు గవర్నర్ పదవి ఇవ్వడం గమనార్హం. ప్రస్తుతం గోవా గవర్నర్‌గా పీఎస్ శ్రీధరన్ పిళ్లై ఉన్నారు. కేరళ బీజేపీ మాజీ అధ్యక్షుడైన ఈయన 2019లో మిజోరం గవర్నర్‌గా నియమితులయ్యారు. 2021లో గోవాకు బదిలీ అయ్యారు. ఇప్పుడీయన స్థానంలో అశోక్ గజపతిరాజు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ బ్రిగేడియర్ బీడీ మిశ్రా రాజీనామా చేయడంతో ఆ స్థానంలో జమ్మూకశ్మీరు మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత కవీందర్ గుప్తాకు అవకాశం కల్పించారు.

ఆర్ఎస్ఎస్ నేపథ్యం..

అసీం ఘోష్ (81) విద్యావేత్త. గొప్ప వక్త. మృదుస్వభావి. ఆర్ఎస్ఎస్‌లో పనిచేశారు. 1999-2002 నడుమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారు. సంస్థాగతంగా ఆ పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. తర్వాత తెరమరుగయ్యారు. 20 ఏళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన్ను ఆకస్మికంగా హరియాణా గవర్నర్‌గా నియమించడాన్ని సొంత పార్టీ వాళ్లే నమ్మలేకపోతున్నారు. బెంగాల్ నుంచి గవర్నర్‌గా నియమితులైన నాలుగో వ్యక్తి ఆయన. అంతకుముందు సిద్ధార్థ శంకర్ రే (పంజాబ్), విష్ణుకాంత్ శాస్త్రి (యూపీ), తథాగత రాయ్ (త్రిపుర, మేఘాలయ) గవర్నర్‌గా పనిచేశారు. కవీందర్ గుప్తా (65) గతంలో జమ్ము మేయర్‌గానే గాక జమ్మూకశ్మీరు అసెంబ్లీ స్పీకర్‌గానూ పనిచేశారు. బలమైన ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉంది. బీజేపీ ఇటీవలి కాలంలో రాష్ట్ర అధ్యక్షులుగా మొదటి నుంచీ పార్టీని నమ్ముకున్నవారు.. ఆర్ఎస్ఎస్ ఆమోదం ఉన్నవారినే నియమించిన సంగతి తెలిసిందే.

తెలుగువారి గౌరవం ఇనుమడింపజేస్తా

అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్: రాజకీయాల్లో తానెప్పుడూ అవకాశాల కోసం పరుగెత్తలేదని.. ఇస్తే మాత్రం న్యాయం చేస్తున్నానని అశోక్ గజపతిరాజు అన్నారు. తనను గోవా గవర్నర్‌గా నియమించడంపై సోమవారం విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగువారి గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసేలా గవర్నర్ బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. బంగళా తనకు అలవాటైనదేనని.. కొత్త అసైన్‌మెంట్ వచ్చినప్పుడు అక్కడకు వెళ్లడం.. పూర్తయిన తర్వాత తిరిగి బంగళాకు రావడం జరుగుతున్నదేనని తెలిపారు. తనను గవర్నర్‌గా నియమించిన ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.